

హంతక కార్బైడ్ వస్తూత్పత్తి బహిష్కరించండి!

ఈ సంచికలో....

సృజన, హనుమకొండ 506001

విడి ప్రతి రూ. 4

సంవత్సర చందా రూ. 30

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh Hyd. Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Printed, Edited & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu' Printed at Nagendra Press, Vijayawada - 2 for Venkataramana Mudranalayam, Warangal

కార్మికవర్గ రాజ్యాధికారం కోసం

....తుపాకులు బొగ్గుగనుల్లో పని చేస్తాయి....

అని సంపాదకీయంలో రాసినందుకు 'సృజన' మార్చ్/ఏప్రిల్ సంచికమీద 'రాజద్రోహ ' నేరం కేసుమోపారు పోలీసులు. (రాజీవ్‌గాంధీ, రామారావు కాదు సి ఐ రామస్వామి 'రాజ ' ద్రోహాన్ని సహించ లేక పోయాడు.)

కాని తుపాకులు మళ్ళీ ఒకమారు బొగ్గుగనులను పని చేయించ డానికి పూను కున్నాయి. సింగరేణి బొగ్గుగనుల కార్మికులు సమ్మెచేస్తే గోదావరిఖని పట్టణ పోలీసులు ప్రతి బొగ్గుబావి దగ్గర ఒక నోటీసు అంటించారు.

సమ్మె చేస్తే ఉత్పత్తి పడిపోతుందనీ, చాలామంది కార్మికులకు సమ్మెచేయడం ఇష్టం లేదనీ, కొంతమంది రాడికల్స్ మాత్రమే బెదిరించి ఈ సమ్మె చేయిస్తున్నారనీ, అయితే బొగ్గుబావిలో దిగని ప్రతివాడినీ రాడికల్ అనుకోవలసి వస్తుందనీ, అందువల్ల సమ్మెలో పాల్గొన వద్దనీ హెచ్చరిస్తూ గోదావరిఖని టవున్ పోలీసు ఆ నోటీసుకు బాధ్యత వహిస్తూ పోస్టర్లు వేసారు.

అదే గోదావరిఖనిలో కేంద్ర ఇంధనమంత్రి వసంత సాఠే – ఒక సంవత్సరానికి నాలుగు వందల సమ్మెలు చేసి సింగరేణి కార్మికులు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్‌రికార్డ్స్ యెక్కారనీ, అయితే ఇటువంటి రికార్డ్సును కాకుండా ఉత్పత్తిని పెంచమని కార్మికులకు విజ్ఞప్తి చేసాడు. ఈ సమ్మెలు రాడికల్స్ చేయిస్తున్నారనీ, నిజానికి కార్మికులకు మంచి జీతాలు వస్తున్నాయి గనుక సమస్యలు లేవనీ, తాను సమ్మె వ్యతిరేక కమిటీలు ఏర్పాటు చేస్తే అందులో "విప్లవ చైతన్యం" గల కార్మికులు చేరాలని ప్రలోభపెట్టాడు కూడ. సమ్మె చేయడం కార్మికుల కెవరికీ ఇష్టంలేదని, ఇందుకు రాడికల్సే బాధ్యులని అంగీకరిస్తూ చేతులెత్త వలసిందిగా కోరితే సభలో ఎవ్వరూ చేతులెత్త లేదు. 'నాకు తెలుసు, ఈ సభలో కూడ నక్సలైట్లున్నారు ' అని చికాకు పడ్డాడు సాఠే.

బహుశా ప్రపంచవ్యాప్తంగానే రికార్డు అనదగిన స్థాయిలో బ్రిటిష్ బొగ్గుగని కార్మికులు ఒక సంవత్సరం పైగా సమ్మెచేసి ఇటీవలే విరమించారు. పైకి చూడ సమ్మె విఫలమయినట్లుగా కనిపించినా, బ్రిటిష్ ఆర్థిక వ్యవస్థను ఈ సమ్మె ఒక్క కుదుపు కుదిపింది. ఈ సమ్మెమూలంగా బ్రిటిష్ పౌండు విలువ అమెరికా డాలర్‌తో దిగువకు పడి యింది.

చిందిన కార్మికరక్తం జ్వలించడం చికాగోలో మొదలైతే ఇవ్వాళ ప్రపంచ వ్యాప్తంగా బావుల్లో కార్మికుల చెమటతో బొగ్గురగుల్కొంటున్నది. చీకటి బావుల్లోంచి ప్రాణాలొడ్డి ఒడ్డుకు బొగ్గును చేరవేస్తున్న కార్మికులు చీకటిలోంచి వెలుగును కూడ చేదుతున్నారు. చేదు బతుకుల్లో చైతన్యాన్ని రగిలిస్తున్నారు.

పని గంటల సాధనతో మొదలైన మేడే పోరాటం ఇవ్వాళ భారతరైతాంగ పోరాటంలో, నూతన ప్రజాస్వామిక విప్లవంలో విలీనమైంది. ఆదిలాబాదు, కరీంనగర్ జిల్లాల్లో ఇదిఅలంకారప్రాయమైన మాటకాదు. అక్షర సత్యం. గ్రామాల్లోవ్యవసాయ కూలీలుగా, పేదరైతులుగా దొరల దగ్గర వెట్టిచాకిరీకి, బానిసబతుకులకు బలియైపోతూ కూడ పొట్ట గడవని ప్రజలు వేలసంఖ్యలో బొగ్గు బావుల్లో, సిమెంటు కర్మాగారాల్లో పనులకు తరలి పోయారు. మగ్గాలు మూలబడిన వేలాది మంది చేనేత కార్మికులు బొంబాయి, భివాండీ, షోలాపూర్‌లకు తరలి పోయారు. వెనుక బడిన గ్రామీణ వ్యవసాయ జీవితం నుంచి సామ్రాజ్య వాద దళారీ ఉత్పత్తి కర్మాగారాల్లోకి ఒళ్ళమ్ముకోవడానికి వెళ్ళిపోయారు. అయితే అక్కడి బతుకూ బొందల గడ్డమీంచి బావిలో పడ్డట్లయింది, పెనం మీంచి ఫర్నేస్‌లో పడ్డట్లయింది. నిజంగానే సమస్య జీవితాలది కాదు. జీవన స్థితిగతులది. కార్మికుల జీతాలు రూపాయల్లో, లెక్కల్లో చెప్తే గ్రామీణ ప్రజలకు ఆశ్చర్యంగానే వుంటుంది. నియాన్ లైట్లు, రేయాన్ వస్త్రాలు సృష్టించే కార్మికులు మురికి వాడల్లో పొగలో, దుర్గంధంలో జీవిస్తున్నారు. దొరల పాదాల కింది నుంచి కంపెనీ దొరల, వారి కనుసన్నల్లోని పోలీసు దొరల కోరల్లో చిక్కిపోయారు. కార్మిక సంక్షేమ చట్టాలు ట్రేడ్‌యూనియన్ లీడర్ల జీవన వ్యాపారానికి (ట్రేడ్‌కు) సోపానాలైనవి.

బతుకు తెరువు కోసం వలసపోయే గ్రామీణ ప్రజానీకం – గ్రామాల్లో నిలిచి తమ హక్కుల కోసం 'దున్నేవానికి భూమికోసం' చేస్తున్న పోరాటం దిక్కు చూస్తున్నారు. మస్కెట్‌కు పోయేవాళ్ళు, మరమగ్గాల మీద పనిచేయడానికి పోయేవాళ్ళు ఇల్లు గుల్ల చేసుకొని, మడిచెక్క అమ్ముకొని, గొడ్డు గోదం అమ్ముకొనికూడ దళారీల మోసానికి గురియై ఊళ్ళకు తిరిగి వస్తే మేల్కొంటున్న బీళ్ళు వాళ్ళకు కాళ్ళకింద నేలను నిలిపి సాము చేసే శక్తి నిస్తున్నాయి. బొంబాయి జౌళిమిల్లు కార్మికుల సమ్మె సందర్భంగా జగిత్యాల తాలూకాలో తన గ్రామానికి తిరిగి వచ్చి విప్లవోద్యమంలోకి ఆకర్షితుడైన వాసంగి 'జేందర్' గానీ, ఇటీవల కొండాపూర్ ఎన్‌కౌంటర్'లో హత్య చేయబడిన లక్ష్మీరాజం గానీ పారిశ్రామిక రంగంలో ఏర్పడిన సంక్షోభానికి పల్లెలు చూపుతున్న పరిష్కారానికి 'సజీవ' నిదర్శనాలు.

కనుక మేడే ఇప్పుడు కొత్త స్వరూప స్వభావాలను సంతరించుకుంటున్నది. ఫ్యాక్టరీ కార్మికులు పనిగంటల పరిమితి సాధించుకునే పరిమిత పట్టణ జీవిత పరిధి నుంచి విప్లవోద్యమానికి ఉత్తేజాన్ని పొందే త్యాగాల ఎర్రజెండా దీక్షా దినంగా మేడే రాటు దేలింది. ట్రేడ్‌యూనియన్‌ల మొక్కుబడి పండుగగా ఈ నాటికి మేడే జరుగుతూ వుండొచ్చు. జరుగుతున్నది కూడ. భగత్‌సింగ్ సంస్మరణను, మేడేను జరపని పాలకవర్గ పార్టీలు లేవు. (భగత్ సింగ్‌ను కూడ 'స్వంతం' చేసుకున్న బి.జె.పి మాత్రం మేడేకి పోటీగా 'విశ్వకర్మ దినం' అని ప్రవేశ పెట్టింది. కానీ హైదరాబాదులోనూ, ఇతర చోట్లా తన చేతుల్లో వున్న ట్రేడ్‌యూనియన్‌లతో, గణేష్ ఉత్సవాలతో పాటు మేడే ఉత్సవాలు, కూడ నిర్వహించక తప్పడం లేదు.) బోనాల పండుగ, గణేష్ ఉత్సవాలు, దసరా నవరాత్రులు, శ్రీరామ కళ్యాణం సరసన రివిజనిస్టు పార్టీలతో సహా అన్ని పాలకవర్గాల ట్రేడ్ యూనియన్‌లు మేడేను ఒక హిందువుల పండుగగా మార్చి వేసినవి. కాక పోతే సామ్రాజ్యవాద సంస్కృతి ప్రభావంలో తిరుపతి వాటికన్ సిటీ అయినట్లే అన్ని పండుగలూ రికార్డు డ్యాన్సుల, వీడియో సంగీతాల సంరంభంలో తమ అర్థాలు తాము కోల్పోయినవి.

విప్లవోద్యమం పదునెక్కుతున్న చోట మాత్రం విప్లవప్రజానీకం మేడే జరుపుకోవడమే 'రాజ్యానికి' ఒక సవాల్. నాలుగేళ్ళ క్రితమే హనుమకొండ కుమార్‌పల్లిలో మేడే జెండా ఎగిరేసే వేదికను, జెండాకర్రతో సహా నేలమట్టం చేసారు పోలీసులు. గత సంవత్సరం బిట్రగుంటలో రైల్వేకార్మికులు రాడికల్స్ నాయకత్వంలో మేడే జరుపుకోవడానికి అనుమతించలేదు. సింగరేణి కాలరీస్‌లో, ముఖ్యంగా ఆదిలాబాదు, కరీంనగర్ జిల్లాల్లో మేడే జరుపుకునే రాడికల్స్‌ను మేనేజిమెంటు ఒకవైపు, రివిజనిస్టులు ఒకవైపు చేరి పోలీసులకు పట్టిస్తున్నారు. 'ఏరివేత' కార్యక్రమంలో భాగంగా వాళ్ళను మేనేజిమెంటు కొలువునుంచి తీసేస్తున్నది. ఈ చెదురు మదురు సంఘటనలు చెప్తున్న సత్యం చరిత్ర నిర్మాణంలో భాగంగా సంస్మరించబడే చరిత్రను శత్రువు సంస్మరణగా గుర్తించడు, ఆచరణగా గుర్తిస్తాడు. సంఘర్షణగా గ్రహిస్తాడు. కనుక చరిత్రగతిని తనకున్న అన్నివనర్లతో అడ్డుకోవడానికి ప్రయత్నిస్తాడు. అప్పుడు సంస్మరణ కూడ ఆనవాయితీ స్థాయినుంచి ఆచరణస్థాయికెదిగి విస్తృత ప్రజానీకాన్ని తనలో ఇముడ్చుకొనే ఒక పోరాటరూపంగా, ఒక పోరాట సంకేతంగా పరివర్తన చెందుతుంది.

చికాగో కార్మికులు చిందించిన రక్తం కార్మికుల అంతర్జాతీయ ఐక్యతాభావానికి ప్రాణం పోసింది. ప్రపంచంలో ఏమూల ఏ యంత్రంలో పని చేసే కార్మికుని రక్తమైనా ఎరుపైనట్లే ఆ కార్మికుని విముక్తికి బాటచూపే జెండా కూడా ఎరుపే అవుతుందని ప్రకటించింది.

సింగరేణి కార్మికులు ఇవ్వాళ ఇంకొక అనుబంధాన్నీ - వర్గబంధాన్నీ గ్రహించారు. అది చైనా విప్లవంలో షాంఘై కార్మికులు చూపిన బాట కావచ్చు. తెలంగాణా రైతాంగ పోరాటంలో ఆజంజాహీమిల్లు కార్మికులు, శ్రీకాకుళరైతాంగ పోరాటంలో నెల్లిమర కార్మికులు గ్రహించిన సత్యం కావచ్చు. ఇవ్వాళ మరింత స్పష్టంగా పల్లెకూ, పట్టణానికీ, అడవికీ వున్న అనుబంధాన్ని, దున్నేవానికి భూమి నినాదానికీ - జాతుల విముక్తికీ, కార్మికవర్గ రాజ్యాధికారానికీ వున్న అనుబంధాన్నీ, కరీంనగర్ ఆదిలాబాద్ రైతాంగ పోరాటం ఒక సింగరేణి కార్మికుల అనుభవంలోకే కాదు పారిశ్రామిక రంగంలో సంఘటితంగానూ, అసంఘటితంగానూ వున్న కార్మికులందరి దృష్టికీ తెస్తున్నది.

కార్మికులు ట్రేడ్‌యూనియనిజం నుంచి కార్మికవర్గ చైతన్యంలోకి ఎదిగే వర్గపోరాట చైతన్యాన్ని ఇవ్వాళ రైతాంగ పోరాటాలు అందిస్తున్నాయి. అందుకే ఒక పెద్దిశంకర్, ఒక గజ్జెల గంగారామ్ ఇవ్వాళ ఒక పోరాట సమగ్రతకు సంకేతాలవుతున్నారు. వరంగల్‌లో రీజినల్ ఇంజనీరింగ్ కాలేజికీ, బెల్లంపల్లి బొగ్గు బావికీ, ఆదిలాబాద్ ఆదివాసులకూ అంతస్సూత్రంగా వున్న విముక్తి పథం - ఆదిలాబాదు, కరీంనగర్ రైతాంగ పోరాట సంఘీభావ సభల్లో ప్రతిధ్వనించిన ప్రజా ప్రచార పంథా - ఆదిలాబాద్ అడవుల్లో గెరిల్లా విసిరిన గ్రెనేడ్ ప్రతిధ్వనించిన ప్రజాయుద్ధ పంథా - ఇవి ఇవ్వాళ రైతాంగం, ఆదివాసులు, కార్మికులు సమైకం కావలసిన ఒక విప్లవ పంథాను నిర్దేశిస్తున్నవి. పొలాలు, ఫ్యాక్టరీలు, అడవులూ ఒక విప్లవనిస్తంత్ర రహస్తంత్రిగా రవళించ వలసిన ప్రధాన ప్రవాహాన్ని మనకు ఆవాహన చేస్తున్నవి.

అందుకే ఇవ్వాళ కార్మికవర్గ రాజ్యాధికారం కోసం సాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవానికి సంకేతంగా త్యాగాల పోరాటాల మేడే జెండాను విప్లవాచరణలో భాగంగా ఆవిష్కరిద్దాం.

మేడే, 85.

భోపాల్

పరిచయం

ఇరవయ్యవ శతాబ్దపు చరిత్రలో, రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్‌లోని హిరోషిమా, నాగాసాకి నగరాలపై అమెరికావాడు అణుబాంబులు వేయడం మినహాయిస్తే, భోపాల్‌లాంటి దుర్ఘటన మరొకటి లేదు. మరణించిన ప్రజలు, బతికి ఉండి శవాలుగా మిగిలిపోయినవాళ్ళు, శవాలుగానే పుట్టబోయే శిశువులు ఈ భయంకర మారణకాండకు బహిర్ ప్రతిరూపాలు. కార్బైడ్ ఫ్యాక్టరీ తయారుచేసే క్రిమి సంహారక మందులు, వాటికోసం సృష్టింపబడిన మన వ్యవసాయ రంగ అవసరాలు ఈ సంఘటన వెనక ఉన్న ఆర్థిక విధానాలకి సూచిక. ఈ తెగుళ్ళ మందు తయారీలో అవసరమని చెప్తున్న రసాయనిక పదార్థాలు, వాటి ప్రమాదభరిత ప్రభావాల గురించి మన అజ్ఞానం మన విద్యాలయాలలో బోధిస్తున్న శాస్త్రీయ విజ్ఞాన అశాస్త్రీయ పద్ధతుల ఫలితం. ఇంత జరిగినా చెక్కుచెదరకుండా నిలిచిన బహుళజాతి కార్పొరేషన్లు మన రాజకీయార్థిక వ్యవస్థ ప్రభావం గురించి మనకు చెప్పకనే చెప్తున్న సత్యం. సమస్యను సృష్టించి, ఆ తర్వాత దాన్ని పక్కదారి పట్టిస్తున్న ప్రభుత్వం తానకుతానే ప్రకటించుకున్న దళారీ స్వభావం, ఒక్క మాటలో భోపాల్ ఈ దేశ వ్యవస్థ గురించి చరిత్ర గురించి మనం నేర్చుకోవాల్సిన పాఠం, పట్టించుకోవాల్సిన హెచ్చరిక. పోరాడవల్సిన భయంకర శక్తి.

అయితే భోపాల్ దుర్ఘటనకంటె విషాదకరమూ, ప్రమాదకరమూ అయింది ఆదుర్ఘటనపై మనపమాజ ప్రతిస్పందన. ఒకప్పుడు ఈఫ్యాక్టరీ పెడతానని చెప్పి వోట్లు వేయించుకొన్న కాంగ్రెసు పార్టీ, ఇప్పుడు ఫ్యాక్టరీ మూస్తానని చెప్పి వోట్లు వేయించుకొంది. అండర్సన్ అరెస్టు ప్రహసనంతో తన కర్తవ్యాన్ని నిర్వహించిన విదూషక ముఖ్యమంత్రి ఇప్పుడు గవర్నరు. బహుళజాతి కార్పొరేషన్లకు వ్యతిరేకంగా తామెక్కరమే పోరాడుతున్నట్టు చెప్పుకొనే ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ఒక్క సమ్మెకి పిలుపు నివ్వలేదు. ఒక ప్రదర్శన నిర్వహించలేదు. భారత ప్రభుత్వం గర్భస్రావం అనే పాపాన్ని చట్టబద్ధం చేయడంవల్లే పరిహారంగా ఈ ప్రమాదం జరిగిందని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మదర్ థెరీసా ప్రవచించింది. (50ఏళ్ల క్రితం బీహార్‌లో భూకంపానికి అంటరాని తనమే కారణమని మహాత్మాగాంధీ అన్నాడు. ఆయనకి నోబెల్‌బహుమానం రాకపోవడం ఆయన జీవితానికి పెద్దమచ్చ).

ఈ ప్రమాదంలో అనాథలయిన పిల్లల్ని క్రిస్టియన్స్ దత్తత తీసుకోకుండా నివారించాలని నానాజీ దేశ్‌ముఖ్ కోరిక. ఈ విష వాయువు ఉత్పత్తిలో సాంకేతిక వ్యవహారాల గురించి, దాని ప్రభావాల గురించి మన శాస్త్రజ్ఞులు, డాక్టర్లు, మేధావులు తమకు మాత్రమే అర్థమయ్యే భాషలో మాట్లాడుకుంటు విజ్ఞాన శాస్త్రం చుట్టు మార్మికతను సృష్టిస్తున్నారు కేసులు ఏ కోర్టులో వెయ్యాలనీ శవాల వేటలో నిమగ్నులయిన లాయర్లు వాదులాడుకుంటున్నారు. చివరికి నగరం ఇంకా విషవాయువు ప్రభావం నుండి తేరుకోలేదనే అనుమానంతో భోపాల్ లో జరగాల్సిన ఒక అంతర్జాతీయ కవి సమ్మేళనం, 'కవుల కోరిక'పై ఢిల్లీకి మార్చబడింది. అందుకే క్షీణిస్తున్న మన సాంఘిక విలువలకి కూడా భోపాల్ ఒక ప్రతీక.

ఈ పూర్వరంగంలో ఆ రాత్రి భోపాల్‌లో ఏం జరిగింది, ఎందుకు జరిగింది అన్న సమాచారం మన ప్రాథమికవసరం. 'కార్బైడ్ విష పరిష్వంగంలో' అన్న మొదటి వ్యాసం ఈ విషయాన్ని పరిచయం చేస్తుంది. ఆధునిక వ్యవసాయం ఉత్పత్తి చేస్తున్న హాని గురించి రెండవ వ్యాసం 'వ్యవసాయంలో విషం....' వివరిస్తుంది. భోపాల్ సంఘటనపై వచ్చిన సమాచారం సృష్టించిన అబద్ధపు ప్రశ్నల్ని వాటి సమాధానాల స్వభావాన్ని మూడవ వ్యాసం "మంత్రి నగరి సరిహద్దులు" వివరిస్తుంది. వాస్తవంగా భోపాల్ మనకి మిగిల్చిన ప్రశ్నల్ని నాలుగవ వ్యాసం 'భోపాల్ వేసిన ప్రశ్న' ముందుకు తెస్తుంది. పోరాట చైతన్యం గల ప్రజలు ఈ ప్రశ్నల్ని వేస్తే ఏమవుతుందో ఐదో వ్యాసం 'పోరాట ప్రతిస్పందన' వివరిస్తుంది. భోపాల్‌గురించి భోపాల్ ద్వారా మన సమాజం గురించి మనకు తెలిసినదానికంటె తెలుసుకోవాల్సినదే ఎక్కువ. అందుకు ఈ ఐదు వ్యాసాలు ఒక తొలి ప్రయత్నం.

— సాహితీమిత్రులు

కార్బైడ్ విష పరిష్వంగం

జగన్

'పరిశ్రమలే దేశానికి దేవాలయాలు' అనే నినాదంతో జవహర్‌లాల్ నెహ్రూ దేశ ప్రజలలో ఒక కొత్త భ్రమని కలిగించగలిగాడు. ఈ సరికొత్త దేవాలయాల స్వభావాన్ని గుర్తించకుండా ఉండటంకోసం ఆయన చాలా కష్టపడ్డాడు. ఆయన

కూతురు ఇంకా కష్టపడింది. వాళ్ళ కష్టాల ఫలితమూ, వైఫల్యమూ భోపాల్ చీకటి చరిత్రను సృష్టించాయి. 1984 డిసెంబర్ రెండవ తేది రాత్రి భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ నుండి లీక్ అయిన విషవాయువు కనీసం రెండువేలమందిని పొట్టన బెట్టుకుంది. ప్రజల ఆరోగ్యంపై ఈ విషవాయువు దీర్ఘకాలిక ప్రభావాల గురించి డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. అంతేకాదు భోపాల్‌లో మొక్కలు, చెట్లపైకూడా ఈ వాయువు ప్రభావం ఉంటుందని వాతావరణ శాస్త్రజ్ఞులు చెప్తున్నారు.

భోపాల్ మధ్యప్రదేశ్ రాజధాని నగరం అక్కడున్న 7 లక్షల మంది జనాభాలో సుమారు 2లక్షల మంది విషవాయువు ప్రభావానికి గురి అయిన ప్రాంతాలలో నివసిస్తున్నారు. ఫ్యాక్టరీ చుట్టూ జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలన్నీ పేద ప్రజల నివాసాలే. వీళ్ళంతా స్వయంశక్తిపై ఆధారపడి రోజుకూలీ చేసేవాళ్ళే కాని ఎక్కడా ఉద్యోగస్తులు కారు. ఎక్కువ మంది టాంగావాళ్ళు, రిక్షావాళ్ళు, పాలమ్ముకొనేవాళ్ళు, కూరలు, బీడీలు సిగిరెట్లు అమ్ముకునేవాళ్ళు, హమాలీలు, నగరంలో అతి నిరుపేద ప్రజానీకం. విషవాయువు బయటికి వ్యాపించడంతో ప్రజలు దిక్కుతోచక పరిగెత్తారు. వాయువు ఏ దిశలో పయనిస్తోందో, ఆ దిశకే పరిగెత్తడంతో మరింత ఎక్కువమంది మరణించారు. వందలు, వేలుగా నగరంలో ఉన్న హమీదియా దవాఖానాకు పరిగెత్తినా ప్రయోజనం లేకపోయింది. ఇంతమందికి కనీస వైద్య సౌకర్యాలు ఇవ్వగల వసతులు అక్కడ లేవు. పైగా ఈ వాయువు ప్రభావానికి విరుగుడికి ఏ మందునివ్వాలో డాక్టర్లకి తెలియదు. ఆ రాత్రి అనేక వేలమంది మరణించారు. అయితే మరణంకంటె మరణ క్రమమే భయంకరమయింది కావడంతో ఇప్పుడు బలికి మిగిలిన వాళ్ళదే పెద్ద సమస్య. వీళ్ళల్లో ఎంతమంది తిరిగి పనులకు పోగల కనీస ఆరోగ్యాన్ని పొందగలరు, ఆర్థికంగా చితికిపోయిన వేలాది కుటుంబాల మాటేమిటి అన్న సమస్యలను ప్రభుత్వం ఇంకా నామ మాత్రంగానయినా గుర్తించినట్టు లేదు.

భోపాల్ యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ సెవిన్ అనే తెగుళ్ళ మందుని తయారు చేస్తుంది. వ్యవసాయ రంగంలో ఉత్పత్తిని పెంచడానికి 1960 ల చివరి దినాల నుండి మన దేశం అమలుపరుస్తున్న 'నూతన వ్యవసాయ వ్యూహం' లో ఈ మందులొక భాగం. కనీస నీటి పారుదల సౌకర్యాలు ఉన్నచోట, అధికోత్పత్తి విత్త

నాలు, ఎరువులు, తెగుళ్ళ మందులు వాడి ఉత్పత్తిని పెంచ ప్రయత్నించే ఈ వ్యూహానికే ముద్దుపేరు హరిత విప్లవం. భోపాల్‌లో ఈ మందు ఉత్పత్తి చేయడానికి యూనియన్ కార్బైడ్‌కి 1969లో ప్రభుత్వం లైసెన్స్ ఇచ్చింది. ఇందుకు కావాల్సిన మిథైల్ ఇసోసయనేట్ (మిక్) మొదట్లో అమెరికా నుండి దిగుమతి చేసుకున్న కంపెనీ 1973 ఒప్పందంతో భోపాల్‌లోనే ఈ వాయువుని ఉత్పత్తిచేయడం ఆరంభించింది. ప్రజల్ని పొట్టనపెట్టుకున్నదీవాయువే.

భోపాల్ ఫ్యాక్టరీ తాను తయారు చేసిన సెవిన్ మందుని అమ్మడమే కాక ఈ రకం తెగుళ్ళ మందుని తయారుచేసే మరో 8 కంపెనీలకు మిక్‌ను సరఫరా చేస్తుంది కూడా. ఈ మిక్ వాయువు కవసరమయిన రసాయనిక పదార్థాలు గురించి చర్చలింకా ముగిసినట్టు లేవు గానీ, ఈ ప్రమాదానికి అవకాశాలు అసలీ ఉత్పత్తి క్రమంలోనే ఉన్నాయన్న ప్రాథమిక సత్యాన్ని ఎవరు గుర్తిస్తున్నట్టు లేదు. బహుశా ఒక యూనియన్ కార్బైడ్ తప్ప!

మన దేశ మార్కెట్‌లో ప్రవేశించిన మొట్టమొదటి అమెరికన్ కంపెనీలలో యూనియన్ కార్బైడ్ ఒకటి. 1905లో అది బ్యాటరీలు అమ్ముకునే ఒక వ్యాపార సంస్థగా ప్రవేశించింది. మరొక 20 ఏళ్ళు గడిచింతరువాత 1926లో కలకత్తాలో ఎవరెడీ బ్యాటరీల తయారీతో కార్బైడ్ ఉత్పత్తి రంగంలో ప్రవేశించింది. 1947 నాటికి ఈ వ్యాపారసంస్థ ఏటా 10 కోట్ల బ్యాటరీలు ఉత్పత్తిచేసే సంస్థగా అభివృద్ధి చెందింది. 1947 తర్వాత మన ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చిందో లేదోగాని యూనియన్ కార్బైడ్‌కి తన కార్యక్రమాలు విస్తృతం చేసుకునే స్వాతంత్ర్యం మాత్రం వచ్చింది. మొదట కార్పొరేషన్ ఇతర దేశాలలో తయారు చేస్తున్న రసాయనిక పదార్థాల ప్లాస్టిక్స్ మన దేశంలో అమ్మడం ఆరంభించింది. దశాబ్దం తిరక్కుండా ట్రాంబేలో ఈ పదార్థాల ఉత్పత్తి ఆరంభించింది. 50 లలో ఫైబర్ పదార్థాలు, పైప్సుల అమ్మడం ఆరంభించి 60 ల నాటికి ఉత్పత్తి ఆరంభించింది ఆ తర్వాత కాలంలో కార్బైడ్స్, ఎలక్ట్రోడ్స్ నప్తా ఉత్పత్తికూడా మొదలయింది. 1969లో భోపాల్‌లో తెగుళ్ళ మందుల ఫ్యాక్టరీ, 1971లో విశాఖపట్నం సముద్ర తీరంలో మెరైన్ ప్రొడక్ట్ ఉత్పత్తి మొదలయింది. గడిచిన ఎనిమిది దశాబ్దాలకాలంలో 500 రూపాయల విలువగల వస్తువులను అమ్ముకునే సంస్థ 200 కోట్ల రూపాయల

విలువగల వస్తువులని ఉత్పత్తిచేసే సంస్థగా పెరిగింది. దేశంలో 13 చోట్ల ఎనిమిది రకాల వస్తువులని ఉత్పత్తిచేస్తుంది 20 నగరాలలో అమ్మకపు కేంద్రాలున్నాయి. కలకత్తాలోనూ, భోపాల్‌లోనూ పరిశోధనా విభాగాలు వచ్చాయి. విదేశీ కంపెనీల పెరుగుదలపై ప్రభుత్వం ఆంక్షలువిధిస్తూ చట్టాలు చేసినా వాటి అభివృద్ధి క్రమానికి ఏమి నష్టం జరగలేదు. "అవసరమయిన వస్తువులను" తయారుచేసే కంపెనీలకు, "ఆధునిక సాంకేతిక జ్ఞానాన్ని" ఉపయోగించే కంపెనీలకు ఈ ఆంక్షలు, చట్టాలు పూర్తిగా వర్తించవు. తన శాఖలలో భోపాల్‌లో సెవిన్ అనే 'అవసరమయిన' తెగుళ్ళమందుని తయారుచేస్తు, అందుకు 'ఆధునికసాంకేతిక జ్ఞానాన్ని' ఉపయోగించిన యూనియన్ కార్బైడ్‌కి సహజంగానే ఈ రాయితీలన్ని లభించాయి. కార్బైడ్ అభివృద్ధి విదేశీ పెట్టుబడుల పట్ల, సాంకేతిక జ్ఞానంపట్ల, ప్రత్యేకించి బహుళ జాతి కార్పొరేషన్లపట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు ఒక ఉదాహరణ.

మాతృదేశంలో ప్రధాన శాఖ ఉండి ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలలో వివిధ శాఖలలో ఒక దానితో ఒకటి సంబంధం ఉన్నా, లేకున్నా వివిధ ఉత్పత్తులను చేసే కంపెనీలను బహుళజాతి కార్పొరేషన్లు అంటుంటారు. ఒక్కొక్క కార్పొరేషన్‌కి 30 నుండి 100 దేశాలలో శాఖలు, ఉప సంస్థలు ఉంటాయి. వీటి సాలీనా దాయం మన జాతీయాదాయం కంటె ఎక్కువే ఉంటుంది.

ఈ రకం బహుళ జాతి కార్పొరేషన్లు మనకి కొత్త కాదు. ఈ దేశాన్ని సుమారు వంద సంవత్సరాలపాటు ఒక బహుళ జాతి కార్పొరేషన్ పరిపాలించింది. (అయితే ఈస్టిండియా కంపెనీకి వ్యాపారం ప్రధానం కాని, ఉత్పత్తికాదు). దేశం ముందడుగు వేస్తున్నకొద్దీ ఈ కంపెనీల ప్రాబల్యం పెరుగుతూ వచ్చింది. (దీన్నే తిరగేసి ఈ కంపెనీలు ఇంత ఎక్కువగా ఉండటమే దేశాభివృద్ధికి సూచికని రాజీవ్‌గాంధీగారు ఇటీవలే ఒక అమెరికన్ పత్రికకు సెలవిచ్చారు). ఈ కార్పొరేషన్లు ప్రధానంగా నాలుగు రూపాలలో సాక్షాత్కరిస్తుంటాయి. మొదటిది ఒక పెద్ద బహుళ జాతి కార్పొరేషన్‌కి శాఖలు (ఉదాహరణకి మందులు తయారుచేసే CIBA కంపెనీ). ఈ రకం శాఖలు ప్రస్తుతం మన దేశంలో 540 ఉన్నాయి. రెండవది ఈ కంపెనీలకు ఉప సంస్థలు (సబ్సిడయారీస్) మాతృసంస్థ అధికశాతం వాటాని తన యాజమాన్యంలో ఉంచుకుంటుంది. కానీ కంపెనీ దేశీయ సంస్థగా నమోద

పుతుంది. (ఉదాహరణకు యూనియన్ కార్బైడ్) ఇవి 183 ఉన్నాయి. మూడవది స్వదేశీ కంపెనీలతో ఒప్పందంతో పని చేసేవి. (ఉదాహరణకు మారుతి, సుజికి). ఇవికాక కేవలం సాంకేతిక ఒప్పందాలకు మాత్రమే పరిమితమయి కూడా ఈ కార్పొరేషన్లు పని చేస్తుంటాయి. ఈ నాలుగు రూపాలలోనూ అనేక పద్ధతుల ద్వారా ఈ కార్పొరేషన్లు అదనపు విలువను తమ దేశానికి తరలిస్తుంటాయి. ఇందులో కొంత భాగం మాయచేసి తరలిస్తుంటాయి. (ఉదాహరణకు భోపాల్ ఫ్యాక్టరీని ఉప సంస్థ మాతృ సంస్థ నుండి కొనుక్కుంది. ఆ మొత్తం ఫ్యాక్టరీ ధర బయట మార్కెట్ ధరకంటె కొన్ని రెట్లు ఎక్కువ). ఇవికాక సాధికారికంగా వెళ్ళే లాభాలుంటాయి. వాటి విలువ సంవత్సరానికి 300 కోట్ల రూపాయలుంటుందని ఒక అంచనా.

కార్బైడ్ ఈరకం బహుళజాతి కంపెనీ. అమెరికన్ కంపెనీలలో దీనిస్థానం పదమూడవది 40 దేశాలలో లక్ష, ఇరవయి వేలమంది కార్మికులతో 45 వేల కోట్ల రూపాయల విలువగల ఉత్పత్తితో ఏటా 10 వేల కోట్లు లాభాన్ని గడిస్తోంది.

విస్తృతమయిన ఈ ఆర్థిక బలానికి అనుగుణంగా బహుళజాతీ కార్పొరేషన్లు రాజకీయ సాంస్కృతిక ఆధిపత్యం కూడా కొనసాగిస్తుంటాయి. ఈ కార్పొరేషన్లతో తగువు పెట్టుకుని చిలీలో అలెండీ ప్రభుత్వం పడిపోయింది. నికారాగువా ప్రభుత్వం తీవ్రమయిన ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ప్రతి మూడవ ప్రపంచ దేశంలోనూ రాజకీయ పార్టీలలోనూ, ప్రభుత్వ యంత్రాంగంలోనూ, సైన్యంలోనూ ఈ కంపెనీలకు వాళ్ళ లాభాలుంటాయి. విశ్వవిద్యాలయాలలో, పరిశోధనాలయాలలో, విజ్ఞానశాస్త్రవేత్తలలో పత్రికలలో మొత్తం అన్నిరంగాలలోనూ ఈకార్పొరేషన్ల పరోక్ష ఆధిపత్యం సాగుతుంటుంది. ఈఆర్థిక, రాజకీయ సాంస్కృతిక ఆధిపత్య ఫలితంగా ఈ కార్పొరేషన్లు ఉత్పత్తి చేసే వస్తువులు, అందుకవి ఉపయోగించే సాంకేతిక జ్ఞానం మూడవ ప్రపంచ దేశాలకు అనివార్యంగానూ, అవసరంగానూ కన్పిస్తుంటాయి. అసలు అభివృద్ధి అంటే ఇదే అని ప్రధానమంత్రి నుండి ఆర్థికశాస్త్ర పంతుళ్ళదాకా అందరు ప్రచారం చేసి ప్రజలలో కూడా ఈ భావాన్ని కలిగిస్తుంటారు.

బహుళజాతి కార్పొరేషన్లు నిరాటంకంగా తమ అధికారాన్ని కొనసాగించడానికి జ్ఞానంపై వాటికున్న గుత్తాదిపత్యం ఒక కారణం. ప్రగతికి, సాంకేతికాభివృద్ధికి అవసరమయిన జ్ఞానంపై తమ వ్యక్తిగత హక్కుని ఏర్పరుచుకొని, కనీసం తమ

ఉప సంస్థలకయినా పూర్తిగా తెలియనివ్వకుండా (ఈ వాయువు లీక్ అయిన వెంటనే
ఏం చెయ్యాలో భోపాల్ ఫ్యాక్టరీ మేనేజరు అమెరికాకు కబురు పంపాల్సి వచ్చింది)
చట్టాలతో, రహస్యాలతో ప్రజలని దేశాలని అజ్ఞానంలో ఉంచడం ఈ కార్పొరేషన్ల
లక్షణం మన దేశ దోపిడి చరిత్రలో జ్ఞానంపై బ్రాహ్మణులు గుత్తాధిపత్యాన్ని చలా
యించి ప్రజలకి ఏది మంచి, ఏది చెడు, ఏది పుణ్యం ఏది పాపం, ఏది నీతి, ఏది
అవినీతి, ఏది న్యాయం, ఏది అన్యాయం అని నిర్ణయించే అధికారాన్ని స్థాపించుకు
న్నారు. సామాజిక జీవితాన్ని శాసించే గ్రంథాలని వాళ్ళకు మాత్రమే అర్థమయ్యే
సంస్కృతంలో రాసుకొని, మహర్షి మతాచార్యులై సామాజిక గౌరవాన్ని సంపాదించు
కొన్నారు. ప్రజలలో పెంచి పోషించిన అజ్ఞానానికి విగ్రహ ప్రతిష్ఠాపన చేసి వాటి
చుట్టు దేవాలయాలను నిర్మించి పవిత్రత నాపాదించారు. ఆధునిక భారతదేశ నిర్మాత
జవహర్‌లాల్ నెహ్రూ పరిశ్రమలను దేవాలయాలు చేసి విజ్ఞాన శాస్త్రాన్ని మతం
కంటె భయంకరమయిన మార్మికశక్తిగా మార్చాడు. మన దేశ పాలకులు ఈ దళారీ
స్వభావ విష ఫలితాలనుండి విముక్తిని సాధించినపుడే భోపాల్ మారణకాండలు నివా
రించబడ్తాయి

వ్యవసాయంలో విషం చల్లుతున్న దళారీ పాలకులు

అపవి

హరిత విప్లవం—పాలకులు తాము సాధించిన ప్రగతిలో ప్రధానమైనదిగా
రెండు దశాబ్దాలుగా ఊరూ వాడా ఏకమయ్యేట్టు ప్రచారం చేసుకుంటున్న ఈ మాటకు
అర్థం ఏమిటి? శాస్త్ర విజ్ఞానమో, పంటల దిగుబడి అంకెలో, ప్రభుత్వ వ్యవ
సాయ నివేదికలో, బహుళజాతి కంపెనీలో చెప్పే అర్థంకాదు, నిజమైన అర్థం,
ఈ దేశ ప్రజలు చెప్పే అర్థం ఏమిటి? హరిత విప్లవం అనే పరిణామం తమ జీవితా
లను ఏ లక్ష్యాలకు చేర్చడానికి ఏ కత్తుల వంతెనలమీద నడిపించిందని భారత ప్రజలు
అర్థం చేసుకుంటున్నారు? లేదా హరిత విప్లవపు ఏ నిజమైన అర్థం మన ప్రజల
నుంచి దాచబడుతున్నది?

హరిత విప్లవం దానితోపాటే వచ్చిన ఇతర మార్పులు, భారత ప్రజల మీద
ఎంతటి గుదిబండలయ్యాయో వివరించాలంటే ఈ రెండు దశాబ్దాలలో చితికిపోయి

కోట్లాది భారతీయ రైతు కుటుంబాల జీవన్మరణ చరిత్రను వివరించాలి ఈ రెండు దశాబ్దాలలో మన దేశంలో తగ్గిపోయిన వర్షపాతాన్ని వివరించాలి. ఈ కాలంలో పెరిగిపోయిన పంటల తెగుళ్ళనూ జబ్బులనూ వివరించాలి ఈకాలంలో తాగేనీళ్లలో పంట పొలాలలో ఊరిన ఉప్పుపరిమాణాన్ని వివరించాలి చిన్నాభిన్నమయిన ప్రకృతి సమతౌల్యాన్ని వివరించాలి. ఎండిపోయిన అనేక కొండ వాగులనూ, సెలయేళ్లనూ గండ్లు పడిన చెరువులనూ, కుంటలనూ చూపాలి. ఈ రెండు దశాబ్దాలలో ఎన్ని మానవ ప్రాణాలను, ఎందరు శిశువుల ఆరోగ్యాన్ని, ఎన్ని రకాల వృక్ష జాతుల్ని జంతు పక్షి జాతుల్ని హరిత విప్లవానికి మూల్యంగా చెల్లించామో లెక్క కట్టాలి. మొత్తంమీద డెబ్బై కోట్ల భారత ప్రజల ఆరోగ్యాన్ని పణం పెట్టి పాలకులు హరిత విప్లవం సాధించారు. దానికొనసాగింపే, ఫలితమే భోపాల్.

మానవజాతి కొన్నివేల ఏళ్ళుగా వ్యవసాయం చేస్తోంది. పరిణామక్రమంలో మానవులూ మారారు, వ్యవసాయ పద్ధతులూ మారాయి. సామ్రాజ్యవాదం రంగం మీద ప్రవేశించే వరకూ జరిగిన మార్పులన్నీ కొద్ది అటు ఇటూగా పరిణామ క్రమంలో భాగంగానే జరిగాయి అంటే ఈ మార్పులన్నీ ఒక రకమైన సహజ మార్పులుగా జరిగాయన్నమాట. ప్రకృతిలో మనిషికీ, పరిసరాలకూ మధ్య ఒక సమతౌల్యం, ఒక సమన్వయం ఉంటుంది. ప్రకృతీ సమాజమూ మారుతూ, ఒకరి నొకరు మార్చుకుంటూ ముందుకు సాగే క్రమంలో కూడా ఈ సమతౌల్యం దాదాపు చెక్కుచెదరకుండా కొనసాగుతుంది. ఈ సమతౌల్యానికి లోబడకపోయినా, లేదా సాధించలేకపోయినా ఇటు జీవజాలమైతే అంతరించిపోతుంది, అటు ప్రకృతి ఐతే తీవ్రమైన అస్తవ్యస్తతకు లోనయి, ప్రమాదకరంగా మారుతుంది.

హరిత విప్లవం అనేది ఈ సమతౌల్యాన్ని లెక్కచేయకుండా వ్యవసాయ ఉత్పత్తిని పెంచదలచుకుంది. సామ్రాజ్యవాదం మార్కెట్ విస్తరణకోసం కనిపెట్టిన వ్యవసాయ పద్ధతులలోని కొత్త మార్పును, హరిత విప్లవం పేరిట మూడో ప్రపంచ దేశాల ప్రజల మీదికి, ప్రకృతి మీదికి ప్రయోగించింది. తమ వ్యాపార అవసరాల కోసం సామ్రాజ్యవాదులు రుద్దుతున్న ఈ సాంకేతిక మార్పులలో వేరు వేరు జాతుల విత్తనాల సంయోగం, అధిక దిగుబడి వంగడాలు, నీటి పారుదల సదుపాయాలు, రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు, తెగుళ్ళ మందులు, యాంత్రీకరణ

యూకలిప్టస్ ప్లాంటేషన్‌లు కొన్ని చర్యలు మాత్రమే వీటన్నిటికీ కూడా అవి సాధించే ఉత్పాదకత కన్న ప్రమాదకరమైన దుష్ఫలితాలున్నాయి. తెగుళ్ళ మందులు (ఇంగ్లీషులో పెస్టిసైడ్స్ అని పిలిచే వీటిలోనే క్రిమిసంహారక మందులు ఒక భాగం) ఏ దుష్ఫలితాల నివ్వగలవో భోపాల్ చూపింది గనుక అసలు ఆ మందులు భారతీయ వ్యవసాయానికి ఎంతవరకు అవసరం అనేది పరిశీలిద్దాం.

ఆధునిక వ్యవసాయం భూమి నిర్జీవమై పోయిందనే ప్రాతిపదికమీద ఆరంభమవుతుంది. కాని నిజానికి భూమి నిర్జీవమైనదికాదు. ఎప్పుడూ భూమికోట్లాది క్రిమి కీటకాలతో సజీవంగా ఉంటుంది. ఆక్రిమికీటకాలలో మానవులకుఉపయోగకరమైనవీ ఉంటాయి, ప్రమాదకరమైనవీ ఉంటాయి. ఐతే భూమిసారం కోల్పోయిందనే నిర్జీవమైపోయిందనే పునాదిమీద ప్రారంభమైన ఆధునిక వ్యవసాయ శాస్త్రం పంటల ఉత్పత్తిలో పెరుగుదల సాధించడానికి అధిక దిగుబడి వంగడాలను సృష్టించింది. అధిక దిగుబడి వంగడాలకు ఎక్కువ రసాయనిక ఎరువులు అవసరమవుతాయి గనుక ఎరువుల వాడకం పెరిగింది. ఎరువుల వాడకంతో ఏపుగా పెరిగిన మొక్కలు మామూలుకంటె ఎక్కువ స్థాయిలో క్రిములనూ, తెగుళ్ళనూ ఆకర్షించాయి. వాటి నివారణ కొరకూ, నిర్మూలన కొరకూ మళ్ళీ రసాయనాలు అవసరమయ్యాయి. ఇలా భూమి నిర్జీవమైపోయిందని మొదలయిన ఆధునిక వ్యవసాయ శాస్త్రం అంతకంతకూ ఎక్కువగా రసాయన పదార్థాలని వాడడం మొదలు పెట్టింది.

ఇంతకూ తెగులు అంటే ఏమిటి? మానవులతోగానీ, మానవ ప్రయత్నాలతో గానీ ప్రత్యక్షంగానో పరోక్షంగానో జోక్యం కలిగించుకునే జీవ పదార్థం దేన్నయినా తెగులు అంటారు. ఆయా పరిస్థితులను బట్టి ఏ క్రిమి అయినా, ఏ జంతువైనా తెగులుగా మారవచ్చు. నిజానికి ప్రత్యేకంగా శాశ్వత తెగులు అయ్యే జీవ పదార్థం ఏదీ లేదు బాక్టీరియా వంటి సూక్ష్మక్రిముల నుంచి దుప్పివంటి జంతువుల వరకు పరిస్థితులను, పరిసరాలనుబట్టి తెగులుగా మారే జీవజాతులెన్నో ఉన్నాయి. క్రిములలో నైతే ఉన్న దాదాపు 30 లక్షల రకాలలో కేవలం మూడు వేల రకాలు మాత్రమే ప్రమాదకరంగామారి అదుపులో పెట్టవలసిన అవసరం కలిగిస్తాయి. కలుపుమొక్కలు కూడా ఈ తెగులు అనే భావనలోకే వస్తాయి. తెగుళ్లు పంటలను నాశనం చేస్తాయి. దిగుబడిమీద వ్యతిరేక ప్రభావం వేస్తాయి. సామ్రాజ్యవాద ప్రవేశానికి ముందు

తెగుళ్ళను నిరోధించడానికి భారతీయ రైతుకు సాంప్రదాయిక పద్ధతులుండేవి. నిజానికి అప్పుడు తెగుళ్ళు కూడా తక్కువే ఈ పద్ధతులకన్న కూడ ముఖ్యంగా అప్పుడు రైతు తెలియకుండానే తెగుళ్ళ సమస్యను ప్రకృతి సమతౌల్యానికే వదిలేశాడు. ఆ రకంగా తెగుళ్ళ పెరుగుదలయినా, నిరోధమయినా ప్రకృతి నియమాలకు లోబడే సాగింది. కాని పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదంగా మారింతర్వాత ప్రపంచ వ్యాప్తంగా వ్యవసాయంలోంచి మరింత ఎక్కువ మిగులును ఆశించి అందుకు మార్గాలు వెతికింది. ఆ క్రమంలోనే అది తెగుళ్ళ మందులను కనిపెట్టింది. అసలు తెగుళ్ళను నిర్మూలించనవసరం లేకపోయినా, అదుపులోపెడితే, నిరోధిస్తే సరిపోయినా, సామ్రాజ్యవాదం తెగుళ్ళను నిర్మూలించే మందుల్ని కనిపెట్టింది. అలా భారతీయ వ్యవసాయంలోకి తెగుళ్ళ మందులు దిగివచ్చాయి.

తెగుళ్ళమందులను మూడు కుటుంబాలుగా విభజిస్తారు. రసాయనశాస్త్ర భాషలో చెప్పాలంటే వాటి పేర్లు క్లోరినేటెడ్ హైడ్రో కార్బన్‌లు, ఆర్గానోఫాస్ఫేట్‌లు, కార్బమేట్‌లు. ఈ మూడు కుటుంబాలనూ మన వ్యవసాయానికి హరిత విప్లవమే పరిచయం చేసింది. చిన్నరకం మెక్సికన్ గోధుమ వంగడంతో ప్రయోగాలు జరిపి అధిక దిగుబడిని సాధించిన రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ అనే అమెరికన్ సంస్థ ఆ వంగడాన్ని 'షర్బతీ సోనారా' పేరుతో 1965లో మనదేశంలో ప్రవేశపెట్టడంతో ఈ హరిత విప్లవం ప్రారంభమైంది. ఆ తర్వాత 1966లో ఫిలిప్పైన్స్‌లోని అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థనుంచి ఐఆర్ఎనిమిది అనే అధిక దిగుబడి వరివంగడం వచ్చింది. ఇక ఈ ఇరవైఏళ్ళ హరిత విప్లవ క్రమంలో ఎన్నో పంటలలో అధిక దిగుబడి వంగడాలు సామ్రాజ్యవాద ప్రయోగాల నుంచి దిగివచ్చాయి.

ఈ అధిక దిగుబడి వంగడాలకు ఉన్న స్వాభావిక లక్షణాలన్నీ తెగుళ్ళను వ్యాపింపజేసేవే. అంటే ఎక్కువ తెగుళ్ళ మందులను ఆకర్షించేవే. ఒకటి - ఈ పంటలను విశాలమైన క్షేత్రాలలో, నిరంతరాయంగా పండించడమే లాభసాటి అవుతుంది. దానివల్ల చిన్నతెగుళ్ళు పెద్ద తెగుళ్ళుగా మారడం, ఏడాది పొడుగునా ఆగకుండా, విశాలమైన భూభాగంలో పోషక పదార్థాలు లభించి తెగుళ్ళు బలపడడం జరుగుతుంది. రెండు- అధిక దిగుబడి వంగడాలేవీ కూడా నిజానికి సాంప్రదాయిక వంగడాలకన్న ఎక్కువ నాణ్యమైనవేమీ కావు. కాకపోతే, అవి రసాయనిక ఎరువు

లకు, నీటి పారుదల సౌకర్యాలకు, తెగుళ్ళ మందులకు ఎక్కువ ప్రతిచర్య చూపి ఎక్కువ దిగుబడినిస్తాయి. అంటే ఎంత ఎక్కువ దిగుబడి కావాలనుకుంటే అంత ఎక్కువగా రసాయనిక ఎరువులు, తెగుళ్ళ మందులు అవసరమవుతాయి. అంతేగాక నీటిపారుదల సౌకర్యాలు కొన్ని కొత్త తెగుళ్ళను సృష్టించి కొత్త తెగుళ్ళ మందుల అవసరాన్ని పెంచాయి. మూడు- సాధారణంగా మొక్కలలో తయారయ్యే అమినో ఆమ్లాలు మామూలుకన్న ఎన్నో రెట్లు ఎక్కువ తయారవుతాయి. అందువల్ల ఈ పంటలకు ఎక్కువ తెగుళ్ళ మందులను వాడాల్సి వస్తుంది. నాలుగు- అధిక దిగుబడి వంగడాలకు ఎక్కువగా అవసరమయ్యే అమోనియా, ఇతర నైట్రోజన్ రసాయనిక ఎరువులు నీళ్ళలో కరిగి సృష్టించే పదార్థాలు తెగుళ్ళను ఎక్కువగా ఆకర్షిస్తాయి.

మరోవైపు, తెగుళ్ళ మందులన్నిటికీ వాటి వాటి సొంత ప్రమాదకర లక్షణాలున్నాయి. విశాలమైన పంట పొలంలో తెగుళ్ళ మందులు చల్లినప్పుడు అది ప్రత్యేకంగా ప్రమాదకరమైన తెగులును మాత్రమే కాక, ఆ పొలంలోని చంపెయ్య గలిగిన జీవజాలాన్నంతటినీ చంపేస్తుంది. ఆ జీవజాలంలో తెగుళ్లకు సహజ శత్రువులూ, మానవారోగ్యానికీ, ప్రకృతి సమతౌల్యానికీ అవసరమైన జాతులూ ఎన్నో ఉంటాయి. కనుక తెగులును చంపడం ద్వారా వచ్చే లాభంకంటె మిగిలిన జీవజాతులను చంపినందువల్ల కలిగే నష్టమే ఎక్కువ. అంతేగాక తమ సహజశత్రువులు చనిపోవడంతో అప్పటిదాకా చిన్న తెగుళ్ళుగా ఉన్నవెన్నో పెద్ద తెగుళ్ళుగా మారిపోతాయి. ఉదాహరణకి వరిని ఆశించే దోమ కాటు క్రిములు 1970 మధ్యకాలంలో చిన్న తెగులు. ఇప్పుడు పెద్ద తెగులుగా మారింది.

తెగుళ్ళ మందులకు ఉన్న విష స్వభావాన్ని శాస్త్రవేత్తలు తీవ్రమైనదిగానూ, దీర్ఘకాలిక ప్రభావాన్ని వేసేదిగాను గుర్తించారు. ఈ మందులు విడిపోయి వాటిప్రభావం సగానికి తగ్గడానికి పట్టే కాలాన్ని హాఫ్‌లైఫ్ అంటారు. ఈకాలం ఒక్కొక్క మందుకు ఒక్కొక్క రకంగా ఉంటుంది. అంటే అంతకాలం వరకూ ఆ మందు పరిసరాలమీద పూర్తి ప్రభావాన్ని వేస్తూనే ఉంటుందన్నమాట. ఆల్గానో క్లోరైడ్ అనే మందుకు ఈ కాలం ఇరవై సంవత్సరాలు. ఈ మందులన్నీకూడ గాలిలో, నీటిలో క్రిములలో, జంతువులలో, మొక్కలలో చేరిపోతాయి. తద్వారా వాటిని వాడే మనుషులకూ, జంతువులకూ వ్యాపిస్తాయి. అలా మన దేశంలో ప్రతి మనిషి శరీరంలోనూ

ఈ తెగుళ్ళ మందుల విషం తినే తిండి ద్వారా ప్రవేశిస్తోంది. విష స్వభావంరీత్యా ప్రమాదకరమైనదైన డిడిటి మానవ శరీరంలోకి ఏ పరిమాణంలో చేరిందో లెక్కవేస్తే అన్ని దేశాలకంటె ఆ పరిమాణం మన దేశంలోనే ఎక్కువని తేలింది. ఈ డిడిటి పరిమాణం ఎక్కువ కావడం వల్ల మన దేశంలోని ఎన్నో పక్షుల జాతులు అంతరించిపోయాయి. అలాగే, ఈ మందులు కరిగిన ద్రవ పదార్థాలు తాకితే చలి జ్వరం (ఫ్లూ), ఆటలమ్మ (చికెన్‌పాక్స్) వంటి అంటు వ్యాధులు ఇంకా ఎక్కువ అవుతాయి. చివరికి తల్లిపాలలో కూడా డిడిటి పెద్దలు సహించదగిన పరిమాణానికి 18 రెట్లు ఎక్కువ పరిమాణంలో ఉంది.

ఇక తెగుళ్ళమీద ఈ విషాల ప్రభావం చూస్తే, వాడగా వాడగా చాల రకాల తెగుళ్ళు విషాల ప్రభావాన్ని తట్టుకుని నిలువగలుగుతున్నాయి. అతి ప్రమాదకరమైనదీ, విషపూరితమైనదీ అయిన డిడిటి ఇప్పుడు దాదాపు నిరుపయోగమయిపోయింది. అందువల్ల కొత్త మందులు కనిపెట్టడమూ, అవికూడా కొన్ని సంవత్సరాలకు నిరుపయోగమైపోవడమూ జరుగుతోంది.

మన దేశంలో ప్రస్తుతం వాడుతున్న 324 తెగుళ్ళ మందుల రకాలూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిన "అతి ప్రమాదకరమైన విష పదార్థాల" జాబితాలో ఉన్నాయి. మనం వాడుతున్న డిడిటి, బిహెచ్‌సి, డైఆల్‌డ్రిన్, ఎండ్రిన్, హెప్టాక్లోర్, లెప్టోఫాస్, టెమిక్ (యూనియన్ కార్బైడ్ తయారుచేసే రెండో మందు) వంటి చాల తెగుళ్ళ మందులను సామ్రాజ్యవాద దేశాల్లో నిషేధించారు. కొన్నిటిపై పరిమితులు విధించారు. మళ్ళీ ఆ సామ్రాజ్యవాద దేశాల పెట్టుబడులూ, సాంకేతిక సహకారాలూ మన దేశంలో ఈమందులన్నిటినీ తయారు చేస్తున్నాయి. ప్రజారోగ్యం గురించీ, ప్రజా సంక్షేమం గురించీ పట్టింపులేని భారత ప్రభుత్వం ఈ విష పదార్థాల అమ్మకాన్ని స్వేచ్ఛగా కొనసాగిస్తోంది. ఇప్పటివరకూ ప్రభుత్వం ఈ మందుల విషయంలో తయారుచేసిన రెండు చట్టాలూ లోపపూరితమైనవే. కేవలం ఆ మందుల సంచులపై 'విషపదార్థం' అని అచ్చు వేయాలని నిబంధన విధించడం తప్ప ప్రజలకు విషాలగురించి చెప్పడానికి ప్రభుత్వం ఏ చర్యలూ తీసుకోలేదు. అధికసంఖ్యాక రైతాంగం నిరక్షరాస్యులయినపుడు దానిమీద హెచ్చరికలు రాసినా, అందునా ఇంగ్లీషులో ప్రయోజనం లేదు.

ఇదంతా ఇంతేనా, ఇలా మనం విషాలు తినవలసిందేనా, దీనికి వేరే పరిష్కారం లేదా అంటే, ఉంది. కాని ఈ నిర్జీవమైన భూమీ, తుప్పలుగా రసాయన శాస్త్రం ఆలోచనను బోధించే సమాజంలో లేదు. ప్రజలు స్థాపించుకున్న సోషలిస్టు సమాజంలో ఆపరిష్కారం ఉంటుందని చైనా చాల విజయవంతంగా రుజువుచేసింది.

చైనా వ్యవసాయంలో తెగుళ్ల అదుపుకు 'సమగ్ర తెగుళ్ళ నిర్వహణ' (ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మానేజ్‌మెంట్) పద్ధతి చేపట్టారు. ఈ పద్ధతి తెగుళ్ళను రసాయనిక మందులతో నిర్మూలించటం ఒక్కటే పరిష్కారమనే ఆలోచనకు వ్యతిరేకమైనది ఈ పద్ధతిలో సాంప్రదాయిక జ్ఞానం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలగలిశాయి. ఈ పద్ధతి జీవశాస్త్రం, రసాయనశాస్త్రం, ప్రకృతి సమ తౌల్య శాస్త్రం, వాతావరణశాస్త్రం, నీటి నిర్వహణ, సాంస్కృతిక ఆచారాలు వంటి ఎన్నిటినో కలుపుకుని తయారయింది. ఈ పద్ధతిలో సాంస్కృతిక, జీవశాస్త్ర పరిమితుల ఆధారంగా తెగుళ్ళను అదుపు చేస్తారు. తరతరాలుగా రైతులు అవలంభిస్తున్న పంటల మార్పిడి నేల, నీటి నిర్వహణ సాంస్కృతిక పరిమితుల కిందికి వస్తాయి. క్రిముల తెగుళ్ళ సహజ శత్రువులను ఎక్కువ మోతాదులో పెంచి వాటిద్వారా తెగుళ్ళను నివారించడం జీవశాస్త్ర పరిమితి కిందికి వస్తుంది. ఈ జీవశాస్త్ర పరిమితిని ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగానే వ్యవసాయంలో గొప్ప ముందడుగుగా గుర్తిస్తున్నారు చైనాలో చాల తెగుళ్ళనునివారించే ట్రైకోగ్రామా అనేక్రిమిని 12 వేరువేరు జాతులలోకనిపెట్టారు. ఇది తెగుళ్ళను అదుపు చేయడంలో 20 శాతం విజయాన్ని సాధించింది. రసాయనిక మందుల వాడకాన్ని సగానికి తగ్గించేసింది. లాభాలకోసం మాత్రమే ఉత్పత్తి, సాంకేతికాభివృద్ధి జరిగే వ్యవస్థలో ఈ రకం పరిణామాలు ఎలా వస్తాయి!

కాని ఈ రసాయనిక మందులు, ఎరువులవల్ల బహుళజాతి సంస్థలకు, దేశంలోని దళారీ సంస్థలకు అంతంత లాభాలు వస్తుంటే మన ఆరోగ్య, వ్యవసాయ శాఖల అధికారులు "ఇవి వాడ వద్దు. వీటివల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుంది" అని రైతులకు ఎందుకు చెపుతారు? (అసలు వాళ్ళు రైతుల దగ్గరికి వెళ్ళరు. అది వేరే సంగతి) కనీసం ఖర్చులేని నిరోధక చర్యల గురించి కూడా చెప్పరు. అదీ గాక ఈ కొత్త పరిష్కారమార్గాల మీద పరిశోధనలు చేసి అభివృద్ధి చేయడం అంటే ఎప్పుడూ ఈగల్ని తోలుకుంటూ కూచునే వ్యవసాయ పరిశోధనా కేంద్రాలకు పెద్ద

పని. ఇప్పుడు రాష్ట్రంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం కింద ఉన్న 55 పరిశోధనా కేంద్రాలు తయారు చేసిన వంగడాలు రైతులకు అందించలేనంత అసమర్థంగా ఉన్నాయి. చివరికి విదేశీ లాభాలకోసం స్వదేశీ విషం పెరుగుతూ పోతుంది. భోపాల్ ఈ దేశంలో వ్యాపిస్తున్న విష వ్యవసాయ పరిణామాల్ని అతి విషాదకరంగా మన ముందుకు తెచ్చింది.

(ఎంఎన్ మజుందార్, మీరానందాల వ్యాసాల ఆధారంగా)

మంత్ర నగరి సరిహద్దులు

సురా

Where's the knowledge we've lost in information?
Where's the wisdom we've lost in knowledge?
Where's the life wev'e lost in living?

– T. S. Eliot

భోపాల్ దుర్ఘటన జరిగి దాదాపు నాలుగు నెలలు కావస్తోంది. అప్పటినుండి పత్రికలు, వారపత్రికలు, దిన పత్రికలు, ఇంగ్లీషు పత్రికలు, తెలుగు పత్రికలు విదేశీ పత్రికలు స్వదేశీ పత్రికలు ఈ "ప్రమాదం" గురించి, యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ గురించి మనల్ని సమాచార ప్రవాహంలో ముంచెత్తుతున్నాయి. ఫ్యాక్టరీ చుట్టుపక్కల చోలాలోనో, జయప్రకాశ్ కాలనీలోనో బతికి బయడపడ్డ ప్రజలు జీవితాన్ని పోగొట్టుకొని జీవిస్తుంటే ఇతరులు ఈ సమాచార ప్రవాహంలో తమ జ్ఞానాన్ని పోగొట్టుకుంటున్నారు. మన మెదడులపై సవారీ చేస్తున్న ఈ సమాచారం సృష్టించిన ప్రశ్నలకి సమాధానాన్ని అన్వేషిస్తూనే నాలుగు నెలలు గడిచాయి. ప్రశ్నలని సృష్టించిన సమాచారం యాదృచ్ఛికం కాదు. భోపాల్ సంఘటన ప్రమాదమూ కాదు.

ఈ సంఘటనలో ఎంతమంది మరణించారు? ప్రభుత్వం ముందు రెండు వేలని చెప్పి తర్వాత 1491 అని చెప్పి మళ్ళీ దాన్ని 2300 చేసింది. ఇప్పుడు ప్రభుత్వం నియమించిన మరోపరిశోధనా బృందం 1100 అని చెప్తోంది. అనధికార లెక్కలు 3000 వేల నుండి ఇరవైవేలదాకా అంచనా వేస్తున్నాయి.

రాత్రి అక్కడికక్కడే మరణించిన వాళ్ళు, పరిగెత్తూ దారిలో మరణించిన వాళ్ళు, హమిదియా దవాఖానాలో మరణించినవాళ్లు, రైల్వేస్టేషన్‌లో మరణించిన వాళ్ళు పోయి పోయి హోషంగాబాద్‌లో, ఇండోర్‌లోనో మరణించిన వాళ్ళు, ఒక సమాధిలో ఇరికించబడ్డ ఐదారు శవాలు, ఒకే చేతిమీద కాల్చబడ్డ ఏడెనిమిది సగం కాలిన శవాలు, తర్వాత కాలంలో నెమ్మది నెమ్మదిగా మరణించిన వాళ్ళు. ఈ లెక్కెవరికీ నిర్ధారణగా తెలియవు. ఆబద్ధాన్ని పకడ్బందీగా చెప్పడానికి తగినంత యంత్రాంగం ఉన్నా అధికారమే ఇప్పటికీ అధికార లెక్కలని తేల్చి చెప్పలేదు. నిజాన్ని అన్వేషించడానికి తగిన వనరులు లేని ఇతర శక్తులు ఆ పని చేయగలగడం అసాధ్యం. ఎంతమంది మరణించారన్న ప్రశ్నకి ఎన్నాళ్ళయినా సమాధానం చెప్పుకుంటూపోవచ్చు.

యూనియన్ కార్బైడ్‌లో లీక్ అయిన విషవాయువేమిటి? ఇది మిథైల్-ఐసో-సైనెట్, (మిక్) మిక్‌ని రెండు రకాలుగా ఉత్పత్తి చేయవచ్చు అందులో ఒకటి ఫోస్‌జిన్ అనే మరో విషవాయువు సహాయంతో చేయవచ్చు. (ఈ వాయువుని మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత నిషేధించారు.) భోపాల్ ఫ్యాక్టరీలో ఫోసిజిన్ వాడుతున్నారా లేదా? ముందు లేదన్న డాక్టర్ వరదరాజన్ (జాతీయ విజ్ఞానశాస్త్ర పారిశ్రామిక పరిశోధన మండలి అధ్యక్షుడు, భోపాల్‌లో సంఘటన అనంతరం ప్రత్యేకంగా నియమించబడిన నిపుణుడు) తర్వాత ఉండి ఉండవచ్చునని అన్నాడు. ఉన్నదాన్ని నిలువచేసి ఉంచరా అన్నది మరో ప్రశ్న. ఈ విషయంపై ప్రత్యేక పరిశోధనలు నిర్వహిస్తున్న హైదరాబాద్ ప్రాంతీయ పరిశోధన ప్రయోగశాల నుండి ప్రపంచ ఆరోగ్య సంస్థ దాకా ఎవ్వరూ తేల్చి చెప్పడం లేదు. తెలిసిచెప్పడం లేదా తెలియక చెప్పడంలేదా అన్న మరో ప్రశ్న ఎవరికీ తట్టినట్టు లేదు.

దుర్ఘటన జరిగిన వెంటనే ఈ వాయువువల్ల పెద్ద ప్రమాదమేదీ లేదని యూనియన్ కార్బైడ్ డాక్టరు ప్రకటించాడు. అప్పటికే వందలమంది మరణించారు. మరి వారం రోజులకి అమెరికా నుండి విచ్చేసిన పెద్ద డాక్టరుగారు ఈ వాయువు దీర్ఘకాలిక ఫలితాలేమిటో తనకు సరిగా తెలియదని పరోక్షంగా ఒప్పుకున్నాడు. అసలు వాయువు ఏమిటో తేల్చి చెప్పినప్పుడు దానిప్రభావంమీద చర్చ శుద్ధ పాండిత్య చర్చ. అయినా దీర్ఘకాలిక ప్రభావాలు లేవని నొక్కి చెప్తున్నారు. కాని బాధితులయిన ప్రజల కళ్ళ

మీదా, ఊపిరితిత్తులమీదా, కడుపుమీదా, స్త్రీల గర్భకోశంమీదా దీని ఫలితాల గురించి స్వచ్ఛందంగా పని చేస్తున్న డాక్టర్లు అనేక రిపోర్టులిస్తున్నారు వాయువు దీర్ఘకాలిక ప్రభావాలేమిటో అన్న ప్రశ్నకు ఆ దీర్ఘకాలమేదో గడిచేదాకా సమాధానం రాదు.

ఈ ప్రమాదానికి బాధ్యత యూనియన్ కార్బైడ్ కార్పొరేషన్ అనే బహుళ జాతి సంస్థదా భారత ప్రభుత్వందా? భోపాల్ ఫ్యాక్టరీ యాజమాన్యంలో 52 శాతం కార్పొరేషన్‌ది, 28 శాతం భారత ప్రభుత్వానిది. మిగిలిన శాతంలో భారతీయజనతా పార్టీ ఉపాధ్యక్షులు విజయరాజెసింధియాతో సహా అనేక మందికి వాటాలున్నాయి. ఇందులో బాధ్యత ఎవరిది అన్న చర్చకు అర్థం లేదు

ఈ సంఘటనకు ఫ్యాక్టరీ డిజైన్ కారణమా? దాన్ని నడపటంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల వైఫల్యమా? మిక్‌ని మనదేశంలో ఉత్పత్తి చేయడానికి యూనియన్ కార్బైడ్ కార్పొరేషన్ 1973లో భారత ప్రభుత్వంతో ఒక ఒప్పందం చేసుకొంది. అప్పుడు అమెరికాలో ఉన్న ఫ్యాక్టరీ యథాతథంగా మనకు అమ్మింది. వెనకబడిన సాంకేతిక జ్ఞానాన్ని మూడవ ప్రపంచ దేశాలకు అమ్మడం అనే సాధారణ నియమాల కిందే ఈ బదిలీ జరిగింది. ఈ ఫ్యాక్టరీ ఉత్పత్తిక్రమంలో ఇప్పటికి ఐదుసార్లు ప్రమాదాలు జరిగాయి. ప్రతిసారి యూనియన్లు భద్రతా సౌకర్యాల గురించి ఆందోళన చేస్తూనే ఉన్నాయి. ఈ ఫ్యాక్టరీవల్ల కలగబోయే నష్టాల గురించి యూనియన్స్ ఇచ్చిన సమాచారాన్ని దేశంలో ఒక్క పత్రిక ప్రచురించలేదు. అప్పుడది వార్తకాదు. ఇప్పుడు మాత్రం డిజైన్ కారణమా, ఆపరేషన్ కారణమా అన్నది ప్రశ్నే.

బహుళజాతి కార్పొరేషన్‌కి, ప్రభుత్వాధికారులకి, రాజకీయ నాయకులకి అక్రమ సంబంధాలున్నాయా అనేది మరో పెద్ద ప్రశ్న ప్రభుత్వం నియమించిన న్యాయ విచారణ సంఘం ఈ విషయాన్నికూడా పరిశీలించబోతోంది. ఈ రకం ఫ్యాక్టరీ పెట్టాలంటే మన దేశంలో బోలెడన్ని ప్రొసీజర్స్ ఉన్నాయి కేంద్రంలో ఐదు మంత్రిత్వ శాఖలు (ఆర్థిక, రసాయనిక, పారిశ్రామిక, వ్యవసాయ, విజ్ఞాన శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖలు), రాష్ట్రంలో ఐదు మంత్రిత్వ శాఖలు (పరిశ్రమలు, లేబర్, మున్సిపల్ పాలనా, విద్యుత్తు గృహ నిర్మాణ శాఖలు), ఏదో ఒక దశలో అనుమతి ఇస్తేకాని ఈ ఫ్యాక్టరీ ఉత్పత్తిని ఆరంభించి, కొనసాగించే అవకాశం లేదు. ఫ్యాక్టరీ నిర్మాణం, ఉత్పత్తి ఎనిమిది చట్టాల పరిధిలోకి వస్తుంది.

పదకొండేళ్ళ కాలంలో ఈ మొత్తం క్రమంలో వివిధదశలలో యూనియన్ కార్బైడ్‌కి ప్రత్యేకమయిన మినహాయింపులు వచ్చాయి. ఇచ్చిన చట్టాల చల్లని దీవెనలతో ఇన్ని ప్రభుత్వ మంత్రిత్వ శాఖల కనుసన్నలతో వెలిసి వర్ధిల్లిన ఈ ఫ్యాక్టరీకి అక్రమ సంబంధాలేమయినా ఉన్నాయా అనే ప్రశ్నకు మన పత్రికలకు ఇంకా సమాధానం దొరకలేదు.

ఇప్పుడు ఈ కంపెనీపై నష్టపరిహారం దావా భారత కోర్టులలో వెయ్యాలా అమెరికన్ కోర్టులలో వెయ్యాలా అనేది మరో ప్రశ్న. ఇండియన్ కంపెనీగా నమోదయిన భారత కంపెనీల చట్టం వర్తించే కంపెనీ గురించి ఇది ఏ దేశం కంపెనీ అని ఒక చర్చ. ఏ దేశం కోర్టులలో వేస్తే త్వరగా తీర్పువస్తుంది, ఎక్కువ డబ్బులు వస్తాయని మరో ప్రలోభం.

భోపాల్ సంఘటన మనకు మిగిల్చినవిగా చెప్పబడుతున్న ప్రశ్నలివి. నగరాలకు వలసవచ్చి, అనధికార ప్రాంతాలలో మగ్గుతూ స్థిరమయిన ఉద్యోగం లేక రేషను కార్డులయినా లేక ఏదో ఒక దర్ఘటనలో మరణిస్తే తప్ప సమాజం ఉనికిని గుర్తించని ప్రజలు మనమెంతమంది ఉన్నామని కాదు. హత్యచేయబడి వివాదాస్పదమయిన సంఖ్యగా మారితే తప్ప అస్థిత్వం లేని ప్రజలు, ప్రజా సమూహాలు ఈ వ్యవస్థలో ఎందుకున్నారనేది ప్రశ్నకాదు. భోపాల్‌లో ఎంతమంది మరణించారనేది ప్రశ్న.

ఫాసిజీన్ వాడకుండా మిక్ తయారు చెయ్యలేరా? అసలీ విషపదార్థాల సహాయం లేకుండా క్రిమి సంహారక మందులు తయారు చెయ్యలేరా? ఈ క్రిమి సంహారక మందులు లేకుండా తెగుళ్ళని నివారించలేరా? వ్యవసాయోత్పత్తిని పెంచలేరా? ఇవి కావు ప్రశ్నలు. లీక్ అయిన వాయువు ఫోసిజీన్, మిక్-ఏ వాయువు అని. ఆరోగ్యంపై ఆ వాయువు ప్రభావాలేమిటో తెలియకుండా దశాబ్ద కాలం పాటు దాని ఉత్పత్తి ఎలా జరిగిందని కాదు ప్రశ్న, దీర్ఘకాలిక ప్రభావాలున్నాయా లేదా అని మాత్రమే చర్చ. అవినీతి అక్రమ సంబంధాలు లేకుండా ఈ దేశంలో ఎక్కడయినా ఎవరయినా ఫ్యాక్టరీ పెట్టగలరా అన్నది కాదు ప్రశ్న ఈ ఫ్యాక్టరీ యాజమాన్యంతో ప్రభుత్వాధికారులకున్న సంబంధాలేమిటి అని అమాయకమయిన ప్రశ్న. గతప్రమాదాలలో ప్రభుత్వం ఏ చర్య తీసుకొంది అనికాదు పరిశోధన, ప్రస్తుత సంఘటనకి డిజైన్ కారణమా, ఆపరేషన్ కారణమా అని ప్రశ్న.

ఈ ప్రశ్నలన్నింటి మీదా ఎడతెరిపి లేకుండా పండిత చర్చలు జరుగుతున్నాయి. ఒక్క ప్రశ్నకీ నిర్దిష్ట సమాధానం లేదు. ఉండదు. ఈ ప్రశ్నల వెనుక ఉన్నది కేవలం అమాయకత్వం మాత్రమే కాదు - కుట్ర కూడా ఉంది. భోపాల్ సంఘటన సాంకేతిక వైఫల్యంగా, అధికారుల అవినీతి ఫలితంగా జరిగిన ప్రమాదంగా చిత్రీకరించడం యాదృచ్ఛికం కాదు. భోపాల్ సంఘటన ఉత్పత్తి క్రమంలో ఏర్పడ్డ నిర్దిష్ట సాంఘిక సంబంధాల ఫలితం. సామ్రాజ్యవాదానికి, పాలకవర్గ విజ్ఞానానికీ, ప్రజల విజ్ఞానానికి ఉన్న వైరుధ్య సంబంధాల వికృత రూపం. అబద్ధపు ప్రశ్నల్ని బద్దలు కొడితే తప్ప ఈ విషయం అర్థం కాదు. అందుకు సమాచారం చాలదు. సమాజాన్ని అర్థం చేసుకొనే విశ్లేషణ చట్రం కావాలి. అప్పుడే నిజమయిన ప్రశ్నలు మన కర్థమవుతాయి. ఆ ప్రశ్నలకి సమాధానాల్ని వెతకడం విప్లవాచరణలో భాగం అవుతుంది.

భోపాల్ వేసిన ప్రశ్న

భోపాల్ మారణకాండ ఈ సమాజం నెట్టుకొస్తున్న సంక్షోభం గురించి ఒక తీవ్రమయిన హెచ్చరిక. ఈ సంక్షోభం మన అభివృద్ధిక్రమం ఎదుర్కొంటున్న సంక్షోభం. ఈ సంక్షోభం జ్ఞానానికున్న సాంఘిక పునాదిలో సంక్షోభం. ఇది స్థయిర్యం ఎదుర్కొంటున్న సంక్షోభం.

ఫ్యాక్టరీను అక్కడి నుండి మార్చాలనీ, తగు జాగ్రత్తలు మరింత జాగ్రత్తగా తీసుకోవాలని, ప్రభుత్వ అజమాయిషీ పెరగాలనీ, నష్టపరిహారం ఎక్కువ ఇవ్వాలని వినవస్తున్న పరిష్కారాలన్నీ వ్యాధిగ్రస్తులకి యూనియన్ కార్బైడ్ డాక్టర్లిచ్చిన మందుల్లాంటివి. వ్యాధిని పరిశీలించకుండా లక్షణాలకి మందులివ్వడం.

నిజమయిన వ్యాధి తెగుళ్ళ మందుల ద్వారా వ్యవసాయోత్పత్తిని పెంచడం అనే వ్యూహంలో ఉంది. ఆ మందులు తయారు చేయడం కూడా యూనియన్ కార్బైడ్‌కి మాత్రమే తెలుసునని నిర్ణయించడంలో ఉంది. మొత్తం దుర్ఘటనను అనివార్యమయిన విషాదంగానే తప్ప నివారించతగ్గ మారణకాండగా గుర్తించక పోవడంలో ఉంది. అనేక తెగుళ్ళ మందుల ద్వారా ఏటా హత్య చేయబడుతున్న 14 వేల హత్యలలో భోపాల్ ఒక భాగం సరి అయిన పోషకాహారం లేక, అనారో

గ్యంతో, దారిద్ర్యంతో హత్య చేయబడుతున్న విస్తృత హత్యాకాండలో భోపాల్ ఒక భాగం. ఇవన్నీ ఒక క్రమంలో విడదీయరాని భాగాలు. ఆ క్రమం మూడున్నర దశాబ్దాల కాలంలో స్వతంత్ర భారతదేశం అవలు పరుస్తున్న అభివృద్ధిక్రమం ప్రతిఫలం.

వ్యవసాయ రంగంలో ఉత్పత్తిని పెంచడానికి హరిత విప్లవం ఒక సాధనం మాత్రమే. దానికి ప్రత్యామ్నాయ మార్గం ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి సంబంధాలలో మార్పు. ఆ రకంగా ఏర్పడే సామాజిక నిర్మాణం రాజకీయంగా అధికారాన్ని ప్రజల కిచ్చి, భూస్వామ్య అంతస్తుల నిర్మాణం నుండి, వ్యక్తులపై ఆధారపడ్డ నిర్మాణం నుంచి కుల, మత పునాదిగా ఏర్పడ్డ సామాజిక నిర్మాణం నుంచి, ప్రజావసరాల కనుగుణంగా ఏర్పడి ఉండేది. ఆర్థికంగా అది వ్యవసాయరంగంలో ఉన్న వనరు లన్నింటినీ పూర్తిగా వినియోగించుకుంటూ ఉత్పత్తిని పెంచేది. వివిధ పారిశ్రామిక వస్తువులకి మార్కెట్‌ని పెంచేది. టెలివిజన్లు, కంప్యూటర్లు కాక ప్రజోపయోగకర మయిన పరిశ్రమలు అభివృద్ధిచెంది ఉండేది. పెట్టుబడి మరింత అర్థవంతంగా ఉండేది. సాంకేతిక పరిజ్ఞానం స్వదేశీయమయి ఉండేది. అభివృద్ధి క్రమం ప్రజా పునాది పెరిగి వ్యవస్థ రాజకీయంగానూ, ఆర్థికంగానూ తన బలాన్ని నిర్మించుకో గలిగేది.

ఇదంతా ఒక అందమయిన కలకాదు, విషయరహితమయిన వాగాడంబరం కాదు. స్వాతంత్ర్య పోరాట కాలంలో కాంగ్రెసు సోషలిస్టు పార్టీ వాగ్దానం చేసిన రాజకీయ కార్యక్రమంలో భాగం, తెలంగాణాలోనూ, ఇతర ప్రాంతాలలోనూ కమ్యూనిస్టు పార్టీ ఆచరణ. అదే కాంగ్రెసు సోషలిస్టు పార్టీకి చెందిన వ్యక్తి మొదటి ప్రధానమంత్రి అయ్యారు. కేంద్రంలో మొట్టమొదటి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని కూడా ఆ పార్టీ నాయకుడే ఏర్పరిచాడు. రెండుసార్లు కూడా కల కుప్పకూలి వినాద మయింది. కార్యక్రమం అబద్ధం అయింది.

రాజ్యం ఈ ప్రత్యామ్నాయ మార్గాన్ని వదిలి సామ్రాజ్యవాదంపై ఆధారపడ సాగింది. 50లలో మొట్టమొదటి సంక్షోభం పి ఎల్—480 నిధులతో ఆహారధాన్యాలు దిగుమతి చేసుకొచ్చింది. ఆతర్వాత అమెరికన్ ఫౌండేషన్ల సహాయంతో వ్యవసాయా భివృద్ధి పథకాలు, గ్రామీణాభివృద్ధి పథకాలు వచ్చాయి. చివరికి వ్యవసాయ రంగాన్ని

విదేశాలకు తాకట్టుపెట్టి హరిత విప్లవం వచ్చిది. ఉత్పత్తి సంబంధాలలో మార్పుకి ప్రత్యామ్నాయంగా వచ్చిన ఈ సాంకేతిక మార్పుకి యూనియన్ కార్బైడ్ ప్రతీక. రాజకీయంగా నూతన ప్రజాస్వామిక విప్లవం ఎజెండాలోకి వచ్చిన 60ల చివరి సంవత్సరాలలోనే ఈ హరిత విప్లవ ప్రత్యామ్నాయం వచ్చింది.

ఈ సాంకేతిక ప్రత్యామ్నాయం సామ్రాజ్యవాదానికి, భూస్వామ్యానికి దేశాన్ని పూర్తిగా అమ్మేసింది. 1947కి పూర్వం ఈ రెంటికి ఏర్పడిన సంధి కొత్త రూపాలలో మరింత బలంగా 47 తర్వాత అభివృద్ధి కార్యక్రమాలలో భాగం అయింది. సామ్రాజ్యవాదంపై ఈ దేశ ఆర్థిక వ్యవస్థ క్రమంగా మరింత ఆధారపడ సాగింది. టెలివిజన్, అణుశక్తి, ఇనుప ఖనిజ ఉత్పత్తి, దాని రవాణా, అడవులను ధ్వంసం చేయడం, అడవులను తిరిగి పెంచడం, తెగుళ్ళను నివారించడం, తెగుళ్ళమందుల్ని నివారించడం అన్నిటా అంతటా సామ్రాజ్యవాదమే నిర్ణయాత్మకశక్తి అయిపోయింది ఈ సాంకేతిక ప్రత్యామ్నాయాన్ని అమ్మే బేహార్లు, అభివృద్ధికోసం ఇది అవసరం అన్న వాదనను ప్రచారంలోకి తీసుకొచ్చారు

పెట్టుబడిదారీ దేశాలలో ఉత్పత్తిశక్తుల అభివృద్ధి మూడు దశలలో వచ్చింది. మొదట యంత్ర శక్తులపై ఆధారపడిన అభివృద్ధి, రెండవది రసాయనిక పదార్థాలపై, ఇప్పుడు మూడవది ఎలక్ట్రానిక్ శక్తులపై ఆధారపడింది. ఉత్పత్తి శక్తులలో ఈ మార్పులు, అభివృద్ధి ఫలితంగా ఆయాదేశాలు అభివృద్ధి చెందగా భారతదేశం లాంటి దేశాలలో ఉత్పత్తి శక్తులు వెనుకబడి మిగిలిపోయాయి. ఈ రెంటికి మధ్య భేదాన్ని దిగుమతుల ద్వారా భర్తీ చేయవచ్చునే వాదంలో ఒక మాయ ఉంది. అది వర్ణననే విశ్లేషణ చేస్తుంది. ఉత్పత్తి శక్తుల అభివృద్ధిక్రమంలో తేడాలున్నాయనేది వాస్తవం. దాన్ని దిగుమతులద్వారా భర్తీ చేయాలనడం అసలు ఈ తేడాలెందుకు వచ్చాయో వివరించే విశ్లేషణను మరుగుపరుస్తుంది. సామ్రాజ్యవాద దేశాలలో సామాజిక వైరుధ్యాల ఫలితంగా, సుదీర్ఘ పోరాటాల చరిత్ర ఫలితంగా ఉత్పత్తి శక్తులు అభివృద్ధి అయ్యాయి. ఈ క్రమాన్ని విస్మరించి ఉక్కు ఫ్యాక్టరీని దిగుమతి చేసుకోవడం ద్వారా, టెలివిజన్ సెంటర్లు పెంచడం ద్వారా, రాకెట్లను అంతరిక్షంలోకి పంపడం ద్వారా అభివృద్ధి సాధించవచ్చని భ్రమింపజేయడం మాయ. అభివృద్ధి వెనకాల ఉన్న చారిత్రక, సామాజిక క్రమాన్ని మరుగుపరచడం, అభివృద్ధి క్రమాన్ని మరుగుపరచడం. అంటే అభివృద్ధి వ్యతిరేక శక్తుల క్రమాన్ని మరుగుపరచడమే. ఈ వ్యతిరేక శక్తుల క్రమమే సామ్రాజ్యవాద భూస్వామ్య సంగం.

మొదటిసారి దిగుమతుల తర్వాత, సాంకేతిక పరిజ్ఞానం స్వతంత్ర అభివద్ధి క్రమాన్ని ఆరంభించగలిగినప్పుడు మాత్రమే ఈ దిగుమతుల వల్ల ప్రయోజనం ఉంటుంది. అయితే అందుకు ఆ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోగల స్వతంత్ర పెట్టుబడిదారి వర్గం ఒకటుండాలి. బహుళజాతి కార్పొరేషన్ల బలవత్తరమయిన శక్తిముందు తలవొగ్గి వాటితో ఒప్పందాలు చేసుకోడంతప్ప సామ్రాజ్యవాద వ్యతిరేకత లేని పెట్టుబడిదారీ వర్గం ఈ అభివృద్ధిని సాధించలేదు. రాజీపడిన పెట్టుబడిదారివర్గం దిగుమతులద్వారా మరింత దిగుమతులనేకాని అభివృద్ధిని సాధించలేదు.

కేవలం ఈ స్వతంత్ర పెట్టుబడిదారీ వర్గమే కాక ఉత్పత్తిశక్తుల అభివృద్ధికి భూస్వామ్య వ్యతిరేక శక్తుల కూడా అవసరం. భూస్వామ్యం తన అధికారాన్ని ఎవరూ ఏ రూపంలోనూ ప్రశ్నించడానికి వీలులేదనే సూత్రంపై చెలాయిస్తుంది. అందుకే అది మత మాయని తద్వారా వచ్చే తప్పుడు చైతన్యాన్ని తన అధికారాన్ని కొనసాగించడంకోసం వాడుకుంటుంది. వేదాలయినా, బైబిల్ అయినా పాలకుల భాషలో పాలకులు మాత్రమే వివరణలివ్వగల పవిత్ర గ్రంథాలుగా సమాజాన్ని శాసిస్తాయి. జ్ఞానంపై ఈ భూస్వామ్య ఆధికారానికి వ్యతిరేకంగా పోరాడుతూనే విజ్ఞానశాస్త్రం, శాస్త్రీయ ఆలోచనావిధానం అభివృద్ధి చెందాయి. గెలిలియో, కోపర్నికస్, ఫ్రాన్సిస్ బేకన్ మొదలయిన ఎందరో అందుకు ఉదహరణలు. ఆ రకమయిన భూస్వామ్య వ్యతిరేక శక్తులు లేనప్పుడు శాస్త్రీయ విజ్ఞానం కూడా మత మౌఢ్యంగా మారుతుంది. ప్రస్తుతం మన దేశంలో విజ్ఞానశాస్త్రం, విద్యాలయాలు పరిశోధనాశాలలు- అన్నీకూడా శాస్త్రీయ జ్ఞానాన్ని భూస్వామికీకరణ చేసే ప్రయత్నంలో భాగమే. ఈ మొత్తం విశ్లేషణాశ్రయానికి భోపాల్ ఒక మంచి ఉదాహరణ.

మొదట వ్యవసాయ ఉత్పత్తిని పెంచడంకోసం తెగుళ్ళమందు అవసరం అనే నిర్ణయం జరుగుతుంది. పేద రైతాంగం, వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో ఉండే దేశంలో అంతిమంగా ఈ తెగుళ్ళ మందుని వాళ్ళే ప్రయోగిస్తుంటారు. వాళ్ళకి ఈ మందుల ఫలితాలు తెలియవు. తీసుకోవల్సిన జాగ్రత్తలు తెలియవు ఆ సాంకేతిక పరిజ్ఞానం వాళ్ళకుండదు. అందులో వాళ్ళు భాగంకారు. ఉత్పత్తి క్రమంలో వాళ్ళు నేలవరుచుకొనే జ్ఞానం కొత్త టెక్నాలజీకి పనికిరాదు. కూలీ డబ్బులు తప్ప మరేమి దొరకని కూలీకి ఈ కొత్త పద్ధతుల వల్ల వచ్చే జ్ఞానం వల్ల ప్రయోజనం ఉండదు.

తెగుళ్ళమందు వాడకం సంగతిప్రక్కన పెట్టి, ఉత్పత్తి దగ్గరకొద్దాం. ఆమందుల ఉత్పత్తి కవసరమయిన జ్ఞానం, ఉత్పత్తిపైదాని ప్రభావంకూడా యూనియన్ కార్బైడ్‌కి తప్ప మరెవ్వరికీ తెలియదు. చుట్టుప్రక్కల ప్రాంతాలపై ఈ ఫ్యాక్టరీ ప్రభావం విషవాయువు ఫలితాలు. అది వ్యాపిస్తే తీసుకోవల్సిన జాగ్రత్తలు— ఏవి ఎవ్వరికీ తెలియవు తెలిసిన కొద్దిమంది బహుళజాతి కార్పొరేషన్‌కు ఏజంట్లవుతారు. యూనియన్ కార్బైడ్ లాభాల అవసరం కోసం, సాంకేతికంగా సామాజిక పునాదిని మార్చకుండా, ఉత్పత్తిని పెంచ ప్రయత్నించే రాజ్యం అవసరాలకోసం అభివృద్ధికి, నష్టాల్ని నివారించడానికీ అవసరమయిన ప్రాథమిక జ్ఞానం కూడా రహస్యంగానే ఉంచబడ్తుంది. ఇది మన అభివృద్ధి కార్యక్రమాల లక్షణం. అభివృద్ధిని సాంఘిక పరిణామక్రమంగా కాక వస్తువుల అభివృద్ధిగా చూడటం దాని స్వభావం

ఈ దృక్పథంలో అభివృద్ధి అంటే ఎరువులు, పంపుసెట్లు, టెలివిజన్లు వగైరా ఎరువుల ఫలితాల గురించి రైతాంగం ప్రశ్నించడం నేర్చుకోడం అభివృద్ధి కాదు. అది ఏ సమ్మేళనలలో ఏమి ఎరువులు వాడాలో రైతాంగం తెలుసుకోవడం కాదు. అది ఈ ఎరువుల స్థానంలో మరి ఏ ఎరువులయినా తాము వాడగలమో లేదో రైతాంగం తెలుసుకోవడం అసలేకాదు. అది గిరిజనులు అడవుల్లో యూకలిప్టస్ బదులు మహువావేయకూడదని ప్రశ్నించడం కాదు.

అభివృద్ధి అంటే పేద రైతాంగం బంజరాయి భూముల్ని, పోరంబోకు భూముల్ని సాగులోకి తీసుకోవడం ద్వారా ఉత్పత్తిని పెంచడం కాదు అది రిగ్గుల ద్వారా బావులు వేయడం బదులు ఉన్న చెరువుల్ని బాగుచేయడం ద్వారా నీటి పారుదల సౌకర్యాన్ని ఎక్కువ చేసుకోవడం కాదు అభివృద్ధి అంటే పేద ప్రజలు తాము ఎందుకు పేద ప్రజలుగా ఉండాలో, ఎన్నాళ్ళు ఉండాలో ప్రశ్నించడంకాదు అది యూనియన్ కార్బైడ్‌లో ఉత్పత్తి క్రమం గురించి వివరాలు అడగటంకాదు. ఈ దృక్పథంలో ప్రశ్నించడం అభివృద్ధి కాదు. ప్రశ్నించే శక్తి నలవర్చుకోవడం అభివృద్ధి అసలేకాదు.

నిజానికి ఉత్పత్తి శక్తుల అభివృద్ధి క్రమంలో వచ్చే ఈ రకం ప్రశ్నలు అభివృద్ధికి సూచికలుగా కాక రాజ్య వ్యతిరేక భావాలకి సూచికలుగా పరిగణింపబడ్తాయి. కానీ భోపాల్ మారణకాండ మన ముందుకు తీసుకువచ్చిన నిజమయిన ప్రశ్నలివే. భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేకశక్తులు సంఘటితంగా ఈ ప్రశ్నలకు

సమాధానాన్ని రాబట్టి అప్పుడే పైనుండి ఏ తీవ్రశక్తులో నిర్దేశించే అభివృద్ధి క్రమానికి ప్రత్యామ్నాయం రూపొందగలదు. సంక్షోభంలోకి ప్రయాణిస్తున్న మన దేశానికి భోపాల్ మిగిల్చిన మార్గం అదొక్కటే.

(ఆర్. యస్. రావుగారి ఆంగ్ల వ్యాసానికి సంక్షిప్త స్వేచ్ఛానువాదం)

పోరాట ప్రతిస్పందన

విషవాయువు వ్యాపించిన మర్నాడే డిసెంబర్ మూడవతేది సాయంత్రానికి భోపాల్ నగరంలో అసంఖ్యాకులయిన ప్రజలు అసంకల్పితంగానే యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ మీదకి నిరసన ప్రదర్శనకు సంఘటితమయ్యారు. ప్రభుత్వం వెంటనే విషవాయువు మళ్ళీ వ్యాపిస్తోందనే పుకారుని లేవదీసి ఆ ప్రదర్శనను చెదరగొట్టగలిగింది. ప్రజలు వెళ్ళిపోయిన అదనుచూసుకొని శవాల గుట్టలను సైనికుల సహాయంతో ఆ ప్రాంతం నుండి తరలించింది.

అయితే ప్రజా ప్రతిఘటన అక్కడితో అంతమవలేదు. మరో వారం రోజులలో అది జహర్‌గాస్‌కాండ సంఘర్ష మోర్చా అనే ఐక్య సంఘటనకు రూపాన్నిచ్చింది. మధ్య ప్రదేశ్‌లో పనిచేస్తున్న కిషోర్ భారతి అనే స్వచ్ఛంద సేవా సంస్థనుండి కొందరు వ్యక్తులు, భోపాల్‌లోని సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా పార్టీకి చెందిన వ్యక్తులు ఇతరుల చొరవతో మోర్చా ఏర్పడింది.

మొదట్లో మోర్చా సహాయ కార్యక్రమాల్లో పాల్గొంది. బాధిత ప్రాంతాల్లో సర్వే జరిపి ప్రజల కష్టనష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి ప్రయత్నించింది. ఫలితం లేకపోవడంతో సంఘటన జరిగిన నెలరోజులకి జనవరి 3న పెద్దఎత్తున "ఖండనాదినం" నిర్వహించింది.

జనవరి 3వ తేదీన పదివేల మంది ప్రజలు ముఖ్యమంత్రి ఇంటిముందు ప్రదర్శన చేసారు. ఆ రోజు ముఖ్యమంత్రి లేకపోవడంతో ప్రదర్శన ధర్నాగా మారి ముఖ్యమంత్రి వచ్చేదాకా కదలమని బైఠాయింపుకి దారితీసింది. మర్నాడు ముఖ్యమంత్రి శుష్కవాగ్దానాలు ప్రజల్ని సంతృప్తి పరచకపోవడంతో ధర్నా వారం రోజులపాటు అలాగే కొనసాగింది. తర్వాత యూనియన్ కార్బైడ్ పరిశోధనా విభాగం దగ్గర ప్రదర్శనతో ఆ ధర్నా ముగిసింది.

సహాయ కార్యక్రమాలలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మోర్చా జనవరి 12న "రైలురోకో" ఆందోళనకు పిలుపునిచ్చింది. ఆ రోజు మధ్యాహ్నం నుండి వందలాది పోలీసుల సహాయంతో రైలు మార్గానికివెళ్ళే దారులన్నీ ప్రభుత్వం దిగ్బంధనం చేసింది. అయినా సుమారు వెయ్యిమంది ప్రదర్శకులు కూడగలిగారు. పోలీసులు లాఠీచార్జీచేసి 250 మందిని అరెస్టుచేసారు. అందులో 8 మందిపై కేసు పెట్టి జైలుకుపంపారు. అరెస్టయిన వాళ్ళల్లో ప్రముఖ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ అనిల్ సద్ గోపాల్ కూడా ఉన్నారు. ప్రజలని హింసకు ప్రేరేపిస్తున్నారన్న ఆరోపణపై కేసు నమోదయింది నాలుగు రోజుల తర్వాత నాయకులు బెయిల్ పై విడుదలయ్యారు.

తర్వాత కాలంలో కూడా మోర్చా ప్రదర్శనలను, సభలను నిర్వహిస్తూవస్తోంది ఫిబ్రవరి 16, 17, 18 తేదీలలో భోపాల్ సమస్యపై జాతీయస్థాయిలో సమావేశాన్ని జరిపింది. దేశవ్యాప్తంగా పౌరహక్కుల సంఘాల నుండి, ప్రజా విజ్ఞానశాస్త్ర సంఘాలనుండి, కొన్ని రాజకీయ పార్టీలనుండి అనేకమంది ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. (ఈ సంచికలోని "భోపాల్ వేసిన ప్రశ్న" వ్యాసం ఆ సమావేశంలో చదవబడినదే) మన రాష్ట్రంనుండి పియుసిఎల్, స్త్రీశక్తి సంఘటన, ఎపిసిఎల్సి ఈ సమావేశంలో పాల్గొన్నాయి. జన నాట్యమండలి సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొన్నది.

ప్రజల్ని సంఘటిత పర్చడమేకాక, మోర్చా తరపున శాస్త్రవేత్తలు ప్రభుత్వం ఇస్తున్న సమాచారాన్ని బహిర్గతం చేయడంలో కూడా తమ పాత్రను నిర్వహించారు మిగిలిన విషవాయువును తొలగించడంకోసం డిసెంబర్ రెండవవారంలో జరిగిన "ఆపరేషన్ ఫెయిత్" సమయంలో అరెస్టు చేసారని చెప్పబడుతున్న యూనియన్ కార్బైడ్ ఉద్యోగస్తులే ప్రభుత్వం తరపున పనిచేసారనే వాస్తవాన్ని బయట పెట్టించ గలిగారు. శాస్త్రీయ విజ్ఞానంపై ప్రజల అజ్ఞానాన్ని ఆధారం చేసుకొని ప్రభుత్వం సృష్టిస్తున్న గందరగోళాన్ని బహిర్గతంచేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చారు.

అసంకల్పితంగానూ, అసంఘటితంగానూ అయినా భోపాల్ ప్రజా పోరాట ప్రతిస్పందన, జ్ఞానంపై పాలకుల గుత్తాధికారానికి ఒక సవాల్ అందుకే ప్రభుత్వ నిర్బంధం.

దృశ్యం :

కన్నతల్లి

-విమల

రాత్రి వర్షించే చీకటి జల్లుల మధ్య
ఇటుకలు రాలిపడి, కప్పు కూలి పడి,
నడి నెత్తిన ఆకాశం భోరున
నల్లటి తారులా చీకటిని కురుస్తున్న వేళ
కాలి పొగచూరిన నా మట్టిగోడల
శిథిల గృహం మధ్య....
నా పిల్లల దేహాలు మసై కవురు కంపు కొడుతున్న
ఈ రాత్రి సమయాన
వీధుల్లో విషపు కన్నుల్లా బ్యాటరీలైట్లు
వెలుగుతూ, ఆరుతూ, గురితప్పిన దేగకళ్ళలా
"లక్ష్యాల్ని" చూపుతున్న వేళ
ఈ భూమి పగిలి
సమస్త ప్రపంచం బద్దలయ్యేలా
బాధామయ ఆర్తనాదాలు హోరుపెడుతున్న వేళ

వినండి బాబూ వినండి
వినండయ్యా, వినండి

నా గుండెలు పగిలేలా
నా రక్తనాళాలు తెగేలా
నా స్వరపేటిక చిట్లేలా
ఈ జగత్తు కంపించేలా, చుక్కలు రాలిపడేలా
నేను అరుస్తున్నాను
నేను విలపిస్తున్నాను
నేను గర్జిస్తున్నాను
మీరు వినేదాకా, వినితీరేదాకా
నేను మాట్లాడుతూనే వుంటాను

వేన వేల సముద్రాల ఘోషని
మీకు వినిపిస్తూనే వుంటాను

o o o

ఆకాశం ఓటి కుండైంది
రోడ్లు మురికి నీళ్ళలో మత్తుగా పొర్లుతున్నాయ్.
మూడ్రోజులుగా ఇంట్లో శ్మశాన నిశ్శబ్దం
ఏడ్చి ఏడ్చి నా కళ్ళు నీటి చేపల్లా ఉబ్బిపోయాయి
ఎంతెంత జేసింది, ఎన్నెన్ని జేసింది
నావరకూ రాకుంటే మాయె
ఎంతెంత జేసిందా తల్లి
పోనీ,
టర్కు మన్ గేటు బుల్డోజర్ల క్రింద
నా ముసలి చిన్నాయిన గుడిసె కూలిపోతేనేం ?
ఆసియా క్రీడల భవంతుల పునాదుల్లో
నా పెద్దక్క కొడుకు రాయై పోతేనేం ?
ఎన్నెన్ని జేసింది, ఎంతెంత జేసింది
ఇంట్లో శవం....
ఇందిరామాయి శవం —
ప్రశ్నించే నా ఆఖరి బిడ్డకు సరిచెబుతూవున్న...
"నా చిన్ని బాబూ ! ఆమె రాజీవుడికే కాదు నాయనా
నీకూ, నాకూ, లోకానికంతా తల్లిరా, తండ్రీ"
కర్మ కాండ జరపాలికదూ—
పొయ్యి రాజేయనేలేదు
నా తోబుట్టువులు పోయినట్లు
నా కన్న తల్లి చచ్చినట్లు
నేను విలపించాను.
నీ కోసం తల్లీ, నీ కోసం — నీ 'ఆత్మ' శాంతికోసం
నా కుటుంబాన్ని ఆకటి కడుపుతో పస్తుపండబెట్టాను

అప్పటికి నా కింకా అర్థంకాలేదు.
ఒక్కరి చావే లోకానికి శోకమనుకున్నా !
'రక్తానికి రక్తమ'నే దాహపు కేకల్ని
దుఃఖావేశమనుకున్నాను
అప్పటికీ నా కింకా అర్థం కాలేదు

o o o

లీలగా దూరపు వీధుల్లో అప్పుడప్పుడూ
ఆర్తనాదాలు వినిపిస్తున్నప్పుడు
లాఠీ, కత్తుల అస్పష్టపు రణగొణుల మధ్య
పకడో - మారో - జలాదో
కేకలు చెవుల సోకుతున్నప్పుడు
నీలం ఆకాశంపైన ఎర్రెర్రటి
మంటల కారుమబ్బుల పొగలు కమ్ముకుంటున్న
దృశ్యం అస్పష్టంగా కళ్ళకి అగుపడినప్పుడు
గాలి అలలపై తేలి, తేలి....
ఏదో వాసన, కాలుతున్న ఘాటయిన వాసన
నా నాసిక పుటాల్నితాకినప్పుడు
నాకు అర్థం కాలేదు
నా తల్లి ఇందిరామాయీ మరణించినందుకు
విషాదాశ్రువులనుకున్నా
ఆమె అమరత్వాన్ని గానంచేసే
నినాదాలనుకున్నా,
ఆమె శవం చుట్టూ వెలిగించిన
అగరొత్తులనుకున్నా,
ఆ అగరొత్తుల సువాసనలనుకున్నా!
అయ్యో ! అప్పటికి నా కింకా ఏమీ అర్థంకాలేదు.
హఠాత్తుగా — అవును హఠాత్తుగానే
వీధి మొగలో

మా పక్కింటి కుర్రాడు సగం కాలి
రొప్పుతూ, రోజుతూ
నా గుమ్మం ఎదుట కూలబడిపోయినప్పుడు
నేను నిర్ఘాంతపోయాను.
నా గుండెలు గడియ పడిపోయాయి
ఆ వెంట....
ఆ వెంటనే—
పెను తుఫానులా రాకాసిమూక
వందల, వేల సంఖ్యలో వీధుల్ని
ఇండ్లనీ....గురుద్వారాలనీ కప్పేస్తూ....
గట్లుతెగి పడ్డ మురికినీటి ప్రవాహంలా
కత్తులు, లాఠీలు, ఇనుపచువ్వలు —
పెట్రోలు - కిరోసిన్లు
ఆ వికటాట్టహాసాల్ని
ఆ దారుణ మారణ కాండను
చెప్పమంటే అక్షరాలు
సిగ్గుతో, అవమానంతో తలొంచుకున్నాయ్
వేయివిస్ఫోటాలు నాలో బద్దలయ్యినట్లు
శరీరం అణువణువును కుదిపేస్తూ
మూడ్నాళ్ళ భయంకర జీవిత వాస్తవికత
ఒక్కసారిగా నా కర్థం అయింది.

o o o

హిందూ - సిక్కులైనా
ఇరుగు పొరుగు వాళ్ళం మనం
ఇచ్చి పుచ్చుకునే మన మధ్య
జీవనస్రవంతిలో పడుగుపేకల్లా
కల్సిపోయిన మన మధ్య
పొట్ట తిప్పలకై వరుగుపెట్టే మన మధ్య

ద్వేషాలెక్కడివి - పగలెక్కడివి - అనుమానాలెక్కడివి
హిందువులో - సింధువులో
మీరెవ్వరైతేనేం ?
ఏ చింకిపాతల బతుకుల్నించి,
ఏ కూలిన గుడిసెల్నించి
ఏ మురికి కాల్వల నీడల ఇరుకు బస్తీల్నించి
మిమ్మల్ని తోలుకొచ్చారో గానీ
ఒక్క చిందిన రక్తపు చుక్కకు
వీధుల్లో వేడి రక్తం ఏరుల్లా పారించమని
ఎవరయ్యా మీకు చెప్పింది
ఒక్క "చచ్చిన ప్రాణం" కోసం
వేలాది మానవ సజీవ దేహాల్ని
మసిచేయమని ఎవ్వరయ్యా మీకు చెప్పింది
ఏ ప్రలోభాల, ప్రతీకారాల అధోలోకాలను రేగ్గొట్టి
మిమ్మల్ని తీసుకొచ్చారో గాని
నీకు నిన్నే శత్రువును చేసే కుట్ర ఇది
మన వేళ్ళతో మన కళ్ళే పొడిచే నీతి ఇది
రెండు ఆకటి కడుపుల మధ్య పెట్టే చిచ్చు ఇది
ఈ మంటన చలి కాగే
రాజ్యమూ దాని 'రాజులైన' రాజీవులేనయ్యా !

o o o

ఏం చెప్పను - నేనేం చెప్పను ?
భయంతో గజగజ వణుకుతూ
కొయ్యబారిన మా కుటుంబాల గూర్చి చెప్పనా
"సిక్కు ద్రోహుల్ని" చంపండి, కాల్చండి,
లూటీ చేయండి, స్త్రీలను చెరచండన్న
వాళ్ళ ఉన్మత్త ప్రేలాపన గురించి చెప్పనా
వాళ్ళ కళ్ళలో కావరం గురించి

చేతుల్లోని లిక్కర్ బాటిళ్ళ గురించీ చెప్పనా!
సిక్కు ఆత్మాభిమానం కుదుపగా
కృపాణం ధరించి గురుద్వార రక్షణకై
పరుగెత్తిన నా భర్త గురించి చెప్పనా
లేక - నా కళ్ళెదుటే - నా భర్త శరీరాన్ని
ముక్కలు ముక్కలుగా నరికి
గాలిలోకెగరేస్తు, బంతు లాటాడిన
వాళ్ళ నైపుణ్యం గూర్చి చెప్పనా
నా కష్టసుఖాల్లో, నా ఉద్వేగాల్లో
నా సుదీర్ఘ జీవన పోరాటంలో
పాలు పంచుకున్న నా ఇరుగు పొరుగుల
శిరస్సులు మట్టిలో దొర్లిన
వైనం గూర్చి చెప్పనా?
తర తరాల విశ్వాసాల్ని తెగనమ్ముకొని
జుట్టు కత్తిరించుకొని,
"పవిత్ర హిందువు"లై పారిపోజూసిన
నా వాళ్ళని వెంటాడి, వేటాడి,
చచ్చేదాకా 'సరదాగా' రాళ్ళతో కొట్టిన
వాళ్ళ ఆకతాయితనం గూర్చి చెప్పనా!
గద్దల బారి నుండి
కోడి రెక్కల క్రింద తన పిల్లల్ని కమ్మినట్లు
నా ముగ్గురు బిడ్డల్ని
మళ్ళీ నా గర్భంలోనే దాచేసుకోవడానికి
నే చేసిన విశ్వప్రయత్నం గూర్చి చెప్పనా!
లేక ...... లేక
నా కొంగుచాటు చేసుకొని
వణికిపోతూ నిలబడ్డ నా బిడ్డల్ని
నా నుండి లాగేసి........

అంతా పద్నాలుగు, పదహారేళ్ళ పిల్లలయ్యా—
స్త్రీలను "అనుభవించే" గొప్ప సంస్కృతికి వారసులు
భావి భారత పౌరులు.
ఏగోడల మధ్య, ఏ వస్తువుల మధ్య
నా యాభై ఏళ్ళ జీవితాన్ని గడిపానో.... ....
అదే చోట, నా బిడ్డల కళ్ళెదుట -
ఒక్కరు కాదు, ఇద్దరు కాదు, ఎనిమది మంది
నన్ను వివస్త్రను చేసి
"అన్నా...ఆమె నాకేగాదు
మనందరికీ తల్లయ్యా . . .
వదిలేయండి - వదిలేయండన్నా...."
నా కడగొట్టు బిడ్డ
కన్నీటి జలపాతాలు వాళ్ళ నడ్డుకోలేదు -
'నేను మీకు తల్లినిరా - నేను మీకు తల్లిని.
నా కడుపున పుట్టిన బిడ్డలాంటి వాళ్ళు బాబు మీరు'
ఎక్కడా భూమి ఒడిచాపి నన్ను దాచుకోలేదు
ఏ అకాశం నన్ను కప్పేయలేదు
ఏ సముద్రాలూ నన్ను లోనికి లాక్కోలేదు
ఏ గాలి సుడుల వేగం నన్నక్కడి నుండి మోసుకుపోలేదు
ఒకడి తరువాత ఒకడు
వరసగా....
ఆ రాక్షస రతిని మహదానందంగా
చూస్తూ నిలబడ్డ రాకాసి మూక -
సూర్యుడా! పట్టపగలు
ఎంత సిగ్గులేకుండా వెలుగుతున్నావయ్యా నువ్వు...!

బాబులూ - నా బిడ్డలారా
వినండిరా! వినండి!

ఒక్క సంగతి...

ఇదే మార్గాన, ఇదే మార్గాన
మీకు జన్మనిచ్చిన తల్లినిరా నేను
తొమ్మిది నెలలు
మిమ్మల్ని కడుపున మోసి
కన్నతల్లినిరా నేను
ఏ స్తన్యాన్నయితే మీరు
కండ కావరంతో, కామంతో రక్తసిక్తం చేశారో
ఆ స్తన్యంత్రాపి, అడ్డాల్లో బిడ్డలుగా
కంటిరెప్పల్లా సాకిన అమ్మనురా నేను.

o o o

ఏం మిగిలిందిక ఏడవను
అమ్మా ఇందిరామాయీ !
కన్నీళ్ళన్నీ నీకే ఖర్చు పెట్టేసానే
ఐదేళ్ళ కొకసారి మీ ఎన్నికల జాతరలో
ఢిల్లీ వీధుల్లో కాంగ్రెస్ జెండాలు
కట్టింది మేమే కదూ !
అమ్మా ఇందిరా మాయీ!
మీ బలప్రదర్శనలకో, మీ మీటింగులకో
లారీల్లో తోలుకు పోబడిన సరుకు
మా పంజాబీ కాలనీల నుండే కదూ !
అప్పుడప్పుడు అమృతసర్
"బ్లూస్టార్" కురుపు
గుండె లోతుల్లో సలిపిన
మీ "లౌకిక" రాజ్యాంగ వేడుకల్లో
మేము పాలుపంచుకున్నాం కదా !
నీ మరణం
ఇంతటి సుందర భవిష్యత్తు విస్తుందని తెలిస్తే
కాసిని కన్నీళ్ళయినా మిగుల్చుకునేదాన్ని !

మా ఉదయాలు చిట్లిపోయాయి
మా చిరునవ్వులు కాలిపోయాయి
ఛిద్రమైన జీవిత శకలాల్ని
ఏ వీధుల్లో ఏరుకోమంటావ్
గతం జ్ఞాపకాల స్మృతుల్నికూడా
కాజేసిన ఓ చల్లటి నెత్తుటికుట్రా !
మమ్మల్ని వెంటాడి వేటాడేవి
ఇక ఆ మూడు రోజులే।
ఆ భయంకర దృశ్యాలే
మా కళ్ళనిండా పరచుకున్నాయ్.

o o o

మా మగాళ్ళని కత్తికో కండగా నరికేసి-
- నా అక్కల్ని, చెల్లెళ్ళనీ
అప్పుడే యవ్వనంలో కడుగుపెడుతున్న
మా ఆడపిల్లల్ని
వీధుల్లోకి మందల్ని తోలినట్లు తోలారు.
సరుకుల్ని రాశి పోసినట్లు-
సరుకుల్లో నాణ్యమైన వాటిని ఎంచుకొన్నట్లు....
మాలో పడుచు పిల్లల్ని ఏరుకున్నారు.
ఏ దూర తీరాలకు వాళ్ళని
లారీల్లో మోసు కెళ్ళారో
ఏ "యవ్వన విక్రయశాల"ల్లో
వాళ్ళ శరీరాల్ని వేలం వేస్తున్నారో
మా కింకా తెలీదు
పిచ్చిదాన్ని –
ఇంతకాలం గ్యాసునూనె
వంటకే ననుకున్నాను.
కానీ నా ముగ్గురు కొడుకుల్నీ కట్టేసి, ఈడ్చుకొచ్చి

నెత్తిన గ్యాసునూనె కుమ్మరించి తగలేసినప్పుడు....
కాలుతున్న నా బిడ్డల శవాలపై
వాళ్ళు సిగరెట్లంటించుకుని
నా మొఖాన పొగలూదినప్పుడు....
అప్పుడు నాకింకా స్పష్టంగా అర్థం అయింది.
ఇందిరామాయికో, ఆమె సుపుత్రుడికో
ఏవేవి, ఎందుకు ఉపయోగపడతాయో,
ఎవరెవరు ఎలా ఉపయోగ పడతారో.

వంటిపై నూలు పోగైనాలేక
తల్లి గర్భం నుండి అప్పుడే
బయట పడ్డట్టున్న నన్ను,
గుడ్డముక్కకై చేతులు చాపిన నన్ను
పిచ్చికుక్కను తరిమినట్లు
వీధుల్లోకి తరిమారు.
మొలకు చుట్టుకునేందుకు
మూరెడు గుడ్డ ముక్కకై అల్లాడుతూ
త్రిలోక్‌పురీ వీధుల్లో తిరిగాను నేను.
వీధి వీధినా పాతిన టీ.వీ.ల్లో
ఇందిరమ్మ శవంపై
ఇందిరమ్మ పాడెపై
పట్టు బట్టలు కప్పుతున్నారు వాళ్ళు.
సాయుధ దళాల తుపాకీ నీడల మధ్య
"వాచ్ డాగ్స్" కాపలాల మధ్య
సజావుగా, సాఫీగా, సాగిపోయిన
"గుణపాఠపు యాక్షన్"లలో-
వీధుల్లో దిక్కులేని, దుర్మార్గపు
చావు చచ్చిన వాళ్ళ శవాల్ని
కాళ్ళకు తాళ్ళు కట్టి

మరో దూరు 'సామూహిక శవదహనాని'కై
లాక్కెళ్ళుతున్నారు 'రక్షకులు'
అక్కడ
ఆమె చుట్టూ గంధపు చెక్కల్ని పేరుస్తున్నారు
ఆమెపై నేతిని క్రుమ్మరిస్తున్నారు.
కాదు-కాదు
కాలి మసైన వేలాది సిక్కుల బతుకులపై
ఆమె చితిని పేరుస్తున్నారు
తొణికిన సిక్కుల స్వప్నాల తై లంతో
తల్లిదాహాన్ని తీరుస్తున్నారు.

o o o

మంచున తడిసిన పారిజాతంలా
అరవిచ్చిన గులాబీలా,
గలగల పారే సెలయేరులా
ఎప్పుడూ నవ్వుతూనే వుండేనువ్వు,
పదిహేనేళ్ళుగా వసంతాల్నే చూసిన నువ్వు....
రక్తసిక్తమైన నగ్న దేహంతో
మసీదు కప్పెక్కి
"అమ్మా! అమ్మా, నన్ను నీతో తీసుకెళ్ళమ్మా!
నన్ను రక్షించమ్మా!"
అని ఆక్రోశించినా ....
అమ్మా కోసలా — ఓ కోసలా!
ఎవ్వరమ్మా నిన్ను రక్షించేది.
భర్తనీ, కొడుకునూ పోగొట్టుకొని
బందెల దొడ్లో తోలకు పోబడతున్న
నీ తల్లా?
పన్నెండు మంది చెరచిన పచ్చి బాలింత
నీ పిన తల్లా?

ఎవ్వరమ్మా నిన్ను రక్షించేది,
కోసలా ! ఓ కోసలా !
అవమానంతో సిగ్గుతో
నిన్ను నువ్వు దాచుకోకు
నిన్ను నువ్వు శపించుకోకు తల్లీ
శపించుకోకు.
నిన్నూ, నన్నూ వేలాది సిక్కు యువతుల్ని
నడి వీధుల్లోకి నగ్నంగా నెట్టిన వాళ్ళని
మన రక్తంతో, మన కన్నీళ్ళతో
"వసంతాలు" ఆడుకున్న వాళ్ళని
మనం ద్వేషిద్దాం తల్లీ, ద్వేషిద్దాం !
మా బ్రతుకుల్లో పల్లేర్లు జల్లిన
ఆమె "అంతిమ సంస్కారాని"కి
ఆకాశం నుంచి విమానాల్లో పూల వర్షం కురుస్తోంది
సరిగ్గా అదేవేళ
ఏ మారు మూలనో నా చెల్లి
ప్రీతం కౌర్
భర్త స్మృతి చిహ్నంగా చిట్టచివరకి,
దక్కించుకున్న ఆతని రక్తసిక్త
ఒంటరి చిటికిన వేలిని
అర చేతుల మధ్య దాచుకుంటూంది
కన్నీటి జల్లులతో కడిగేయ బోతూంది.
దేశం నలుమూలలా,
నదీనదాలపై, పొలాల్లో - హిమాలయాల్లో సైతం
ఆమె బూడిద వర్షిస్తున్నవేళ
బంగారు కలశాల్లో, మెత్తటి మొఖమల్ వస్త్రాల మధ్య
దేశం అంతటా ప్రజల
"ధర్మ దర్శనానికై" ప్రదర్శింపబడుతున్న వేళ

డెబ్బయి కోట్ల ప్రజల్ని పాలించే
"మారాజులు"
ఆమె అస్తికలకు సైతం విధేయత" చూపుతూ
సాష్టాంగ పడుతున్న వేళ ....
నేనో పిచ్చి తల్లిని ....
నేనో వెర్రిదాన్ని .... .
నా బిడ్డలు కాలి మసైన చోట
వాళ్ళ పిడికెడు బూడిద కోసం
వాళ్ళ ఎముకల కోసం
మట్టిలో దేవుళ్ళాడుతున్నాను.
సగం కాలిన యువకుడి దేహాన్ని
నా కళ్ళముందే
నా కళ్ళ ముందే కుక్కల గుంపు లాక్కెళ్ళి
పీక్కు తినడం చూసి, నా గుండె మెలిపడింది
నాకిక ఎడతెగని శోకాన్నే మిగిల్చిన
నా కడుపు కోత గూర్చి చెప్పనా!
ఏం చెప్పను?
ఫారిష్ బజార్ లోనో
ఏ కల్యాణ పురీ క్యాంపులోనో
అర్థ రాత్రుల అసహాయ శోకాలతో
గాలి బరువెక్కుతుంది,
ఓ కల చెదిరి పడ్డట్లు,
ఓ అల విరిగి పడ్డట్లు,
మా 'జీవితం' చేజారి పోయింది
అయినా యమునానది ఎప్పట్లాగే
ప్రవహిస్తూనే వుంది.
పార్లమెంట్ వీధుల్లో
ఖద్దరు టోపీలు వందేళ్ళ

నాకుతెడియిత్త (కోయం)

షడావి

నన్నూ ఘన్‌కనే
అవుటెనా ఆదివాసి మన్‌కన్
హన్నెనాటి వరకు ఈకడితె మత్త మన్‌కన్
నేండు గూడ నన్ మన్‌కనె
ఇన్కె సిరఫ్ ఆదివాసి మన్‌కన్ ఆయోన్.
ఈకడితె వెడ్సి హూడ్ త్తన్.
వెడ్సి హెకె హూపిస్త పెద్ది శంకర్ దాదన హర్రి హూడ్ త్తన్
నావ పిసుముడ్‌తే వెడ్సి హూపిస్త "ఆదివాసి కిసాన్ షేత్
ముజుదూర్ సంఘటన" హర్రి హూడ్ త్తన్
నన్ ఇంకా అవుటెనే కలియిత్తన్
నన్ ఇన్కె అంగడం ఆదివాసి మన్‌కన్ ఆయోన్
నలువురితే పిస కరియిత్త సంఘటన మన్‌కన్
నన్ బాదల సండి కాంజ్‌సెకె హైంకె మత్తెకి
నాకున్ మత్తోర్ ముడ్సి తిత్తోర్
నన్ సంఘం తాహత్తెకి సర్కార్‌కు హోంగ్ వాత్తె.
వాత్తె వాయిర్‌కాట్
సర్కార్‌న రంగు నాకు గిన్‌కెనె తెడిసేమంత
తన్‌సే మంతోర్, కేసుల్కు తాహస్పే మంతోర్,
లంచాల్కు తెండ్ సే మంతోర్
ఇవు బొత్తిగ నాకు వంగతాహలాయె
నాకు తెడియిత్త ఇవునతోటి ఇంక లడాయి గియ్యగాం ఇంజి.

ఘన చరిత్ర గురించి
ప్రజాసామ్యం, లౌకికత్వం గురించీ
గంభీరంగా వాగుతూనే వున్నాయి.
సఫ్దర్‌జంగ్ రోడ్డులో "హడావుడి"

>

నాకు తెలిసింది (తెలుగు)

మడావి

నేనూ మనిషినే
అందులోనా ఆదివాసి మనిషిని
మొన్నటి రోజు వరకు చీకట్లో వున్న మనిషిని
ఈ రోజు గూడా నేను మనిషినే
ఇప్పుడు కేవలం ఆదివాసి మనిషిని కాదు.
చీకట్లో వెలుతురు చూశాను.
వెలుగుకెయి చూపించిన పెద్దిశంకరన్న త్రోవ చూశాను
నా జీవితంలో వెలుగు చూపించిన "ఆదివాసి కిసాన్ షేత్ మజుదూర్
సంఘటన" మార్గం చూశాను
నేను గూడ అందులోనే కలిశాను
నేను ఇప్పుడు వట్టి ఆదివాసి మనిషిని కాదు
నేను బాధల బరువు మోస్తూ నిశ్శబ్దంగా వుంటె
నన్ను వునోళ్ళల్లు ముంచుక తిన్నారు
నేను సంఘం పెడితే సర్కార్‌కు కోపమొచ్చింది.
వస్తేరాని
సర్కార్ రంగు నాకు గిప్పుడే తెలుస్తుంది
తంతుంద్రు, కేసులు బెడుతుంద్రు, లంచలాలు తీస్తనే వున్నారు.
ఇవన్ని నన్ను వంగబెట్టడానికే
నాకు తెలిసింది వీటితోని గూడ లడాయి చెయ్యాలని.

ఎప్పట్లాగే వుంది.
మా చుట్టూ ఉదాసీనం
తెరలు, తెరలుగా పడిపోతూనే వుంది
ఎవ్వరూఢుకున్నా,

ఎవరు గతం గడిచిపోయిందన్నా
మేమూరుకోం — మేమూరుకోలేం
మా గుండెలు నిప్పులైనాయి
మా కళ్ళు తూరుపు మేఘాలైనాయ్.
  బాబుల్లారా, తల్లులారా!
  బడా నాయకుల్లారా!
  ఇందిరమ్మ బూడిదను నెత్తిన జల్లుకున్న
  పవిత్రుల్లారా!
  వినండయ్యా .... వినండి!
ఇక మిగిలిందేమీ లేదు
మేము పోగొట్టుకోవడానికి!
ఇక దుఃఖించడానికేమీ లేదు....మా వద్ద
మేమే బాధామయ పర్వతాల్ని
మోస్తున్న వాళ్ళం
ఇంక మేం పొందాల్సిందంతా ముందుంది.
మా మా వేదనామయ ప్రపంచాన్ని, మా కష్టాల్ని
పంచుకునే వాళ్ళున్నారు మాకు.
నేను మీకు వినిపిస్తున్నాను
మేము కలిసి వినడస్తాం
వేన వేల రక్త ఘోషల్ని
వేన వేల పోరాట హృదయ స్పందనల్ని
మీరు వినేదాకా,
మీరు విని తీరేదాకా ....
మేము ప్రతిఘటనా ప్రపంచ గీతాన్ని
ఆలపిస్తూనే వుంటాం.

★

కథ :

తుఫాను

అల్లం రాజయ్య

పొద్దటి బువ్వలు తినే యాళ్లయ్యింది. అందరు పొలాలు దున్నేటందుకు సిద్ధ పడుతూ నాగండ్లు అమిరిచ్చేటోల్లు నాగండ్లు అమిరిచ్చు కుంటండ్లు. తాళ్ళు, దారెడు జొత్తెలు సదురు కునేటోల్లు సదురు కుంటండ్లు—జెరంత ముందుగ బువ్వలు దిన్నోళ్ళు సుట్టలు ముట్టిచ్చుకొని తుప్పతుప్ప ఊంచుకుంట అంతకు ముందు మట్టిఅల్లిన గుడ్డ బనీండ్లు ఏసుకొని రుమాల్లు సదురు కుంటండ్లు—అడ్ల ధాలికాడ ఒకచేరొల్లి—నాది నాగలి సలుగయ్యిందని ఒకలు— ఎజగ్గైందని ఒకలు—సీరె బోయిందని ఒకలు —కాని బోయిందని ఒకలు అక్లాయినె నోట్లె మంచినీళ్ళు బొయ్యకుంట ఎవలకే తీరుగ మాట్లాడాల్నో ఆ తీరుగ మాట్లాడుకుంట ఒక్కొక్కపని జేత్తండు—కమ్మరింటి కాడ గునుసుకుంట కమ్మరాయినె సుత్తెతోని కొట్టేది కొడుతనే ఉన్నడు. కొంత మొగ్గంట ఒకడు, కర్రు అంట మరొకడు వేగిర పడేటోల్లు పడ్తనే ఉన్నరు. మరింక ఆడోల్లు—తిన్న కంచాలు కడుక్కొని చిన్న పోరగండ్లను పెద్ద పోరగండ్లకు అప్పగింతలు పెడుతూ ఉట్ల మీద పగటి అంబల్లు, బువ్వలు సర్ది—సూరలో, పరమో పెట్టి పిల్లల బుజ్జగిస్తున్నారు. పసిపిల్ల తల్లులు గడపల్లల్లో కూసొని పిల్లగండ్లకు పాలిత్తండ్లు.

ఆకాశంలో మబ్బులు కుమురుకుంటున్నాయి. సాకల్ది బట్టలు జమ జేసుకుంటంది.

ఊరంతా సంపడి సంపడిగ—రొచ్చు రొచ్చుగా, బురద బురదగా ఉన్న సమయంలో ఉత్తరం దాబు మర్రి సెట్టుకింది నుంచి అరుగురు రైతులు మోకాళ్ళ మంటి బురద కాళ్ళతో ఊరు సొచ్చారు.

"దున్నేవానికి భూమి – వ్యవసాయ విప్లవం వర్దిల్లాలె—పల్లెల్లో పోలీసుల జులుం నశించాలె—పోలీసు క్యాంపులు ఎత్తెయ్యాలె—" నంట అరుసుకుంట—కుడి పిడికిల్లెత్తి తాప తాపకు, మాటమాటకు చిత్రంగా అరుస్తూ ఊళ్ళో నడుస్తున్నారు.

అప్పటికే ఆళ్ళ సుట్టు పోరగండ్ల మంద జమైంది. మరీ ఉచ్చిలి పోరగండ్లు, ఎర్ర రుమాలు పేగులు కట్టుకున్న కట్టెపుల్లలు బట్టుకొని వాళ్ళు రైతుల్లాగే అరుస్తూ మందలో కలిసిండ్లు.

ఊళ్ళోవాళ్ళ కిది కొత్తేమికాదు—వాళ్ళు ఇట్లా బర్లుకుంట వాళ్ళ ఊళ్లె వాళ్ళే సానాసార్లు తిరిగిండ్లు—కాని పొరుగూరోల్లచ్చి తమ ఊళ్లెతిర్గడం చిత్రంగనే ఉన్నది.

మాదిగోళ్లు గీసంగతి ఎట్లిన్నరో ఎగపోసుకుంట ఉరికచ్చిండ్లు—ఎందు కంటే ఆళ్ళ సెరువు ముంగటి పదెకరాల పరంపోగు సొడుభూమి ఇయ్యేడు దున్నిండ్లు—ఏసుంట నాగండ్లు కట్టిండ్లో—ఆ భూమి పడావుగానే తన కింద ఉంచుకున్న ఆరోల్ల జెగ్గయ్య, కోమటి రామలింగు నాగండ్ల కాడికిపోయి సింగిబింగాడిండ్లు; తిట్టరాని తిట్లు తిట్టిండ్లు—"ఇది అన్నా యేమన్నరు. మంది సొమ్ములు గిట్లోజబర్‌స్తీగ దున్నుకుంటె కలిగం మునిగి పోతదన్నరు." జెగ్గయ్య మాత్రం "ఇగో మిమ్ములందర్ని అధాలతుల్ల పట్టి సెంటర్ జేలుకు పట్టియ్యకపోతె నేను ఆరోని కడుపున్నే పుట్టలేదన్నడు."

మాదుగులు ఏమనలేదు. కాని నాగండ్లు ఆపలేదు.

ఇల్లారి పంచాదు తెట్టిండ్లు జెగ్గయ్య,రామలింగం — పొరుగూరు నుంచి పోలీసు పటేలు, పట్వారి, ఊళ్లె మాలిపటేలు, పెద్ద మనుషులు తిర్లేసి మర్లేసి "ఊళ్లెసిచ్చు గొట్టుడుమాదుగులకు బనావుగాదన్నరు."

అప్పుడు సంగం ముంగట బడ్డది — పంచాతు ఎటు తెగక ముందే ఊళ్లె రైతులు కొంపరు మాదుగులతో కలిసిపోయి పరం పోగు సొడుభూముల నాగండ్లు కట్టిండ్లు—పైగా ఒడ్లమీద ఎర్రజెండాలు పెట్టారు.

"మాపొలాలు గబ్జాచేసుకున్నరని" రామలింగం, జెగ్గయ్య పోలీసులకు జెప్పిండ్లు ఆళ్లెంట ఊళ్లె పెద్ద మనుషులు గావాయిపోయిండ్లు.

ఇగ బయ్యబయ్యన మోటర్లచ్చినయ్—గ మోటర్లల్ల పోలీసోల్లచ్చిండ్లు—శగు వేందో విసారం జెయ్యకుంటనే—గది అలవాటేనన్నట్లు—ఇతర కులాలోల్లను ఇడిసి పెట్టి మాదుగులనే జేలుకు పట్టుక పోయిండ్లు—అడిగే నాథుడు లేక మాదుగులు ఆరంది నాలు తానలనే ఉన్నరు. అయింక ఊరి సంగమచ్చి ఇడిపిచ్చింది.... ఈలోగా దున్నిన సెర్వుముంగటి పదెకరాల్లకు సెరువు నిండి నీళ్ళచ్చినయ్.... గాసంగతేమన్న తెలత్తదేమోనని— గీలొల్లి ఇనబడంగనే మాదుగులు ఉరికచ్చిండ్లు....

అచ్చినోల్లు ఒకలజబ్బల మీన ఒకలు సేతు లేసుకొని నినాదాలిచ్చేవాళ్ళను సూసుకుంట ఎనుకెనుక నడిసెండ్లు. అయిమూల లెక్కలేని పడుసోల్లు ఆళ్ళతోని గల్సి అర్సిఅర్సి కీకలు బెట్టిండ్లు—

నాగండ్లు కొడారేసుకొని బయలెల్లినవాళ్లు, నాగండ్లు భుజాలమీన బెట్టుకొని పొలాలమీనికి బోయేపాలేరోల్లు అగి పోయిండ్లు—

పొరుగూరి నుంచి వచ్చినవాళ్లు వినాదాలిచ్చి కుంట మూడు బజార్లకాడి కచ్చిండ్లు— అప్పటికీ పిల్లగండ్లుమొండిగోడ లెక్కి–పోయిండ్లు — మూడు పానాదులు బురద బురదగా ఉన్నాయి. సర్కారు బాయినీల్లు తోవ్వొంట పారి మరింత బురద య్యింది. ఒక్క రాయలింగు కూలిపోయిన మొండి గోడపక్క యాపకింద— భూలచ్చిమి పెక్క బొమ్మలున్న కాడ మాత్రం కాసంత పొడి జాగున్నది. ఆడ రెండు బండ్లు వానకునాని, కమ్మలు సిలిమెక్కి ఉన్నాయి. ఆ పక్కనే భూమయ్య ఎడ్ల కొట్టం లేక కట్టేసుకున్న ఎడ్లు దోమలకు సెపులు టపటప కొట్టు కుంట ఈ లొల్లికి మట్ల మీదనే గింజుకుంటున్నాయి.

పొరుగూరి నుంచివచ్చిన వాళ్లల్లో ఇద్దరు గీతల లుంగీలు ఎగగట్టు కున్నారు. ఎల్సిపోయిన అంగీలేసుకున్నారు. మరొకాయన కామెక్కిన ధోతి ఎగగట్టి గుడ్డబనీ నేసుకున్నాడు. అట్లాంటి కాయరంగు ధోతే నడికట్టు బిగిచ్చి కట్టి పెయిమీస అంగీ లేని కోల ముఖపు ఒక్క ముసలాయన—ఆసుట్టు పక్కల ఆడోల్లను కేకేసి "రాండ్లి-రాండ్లి పొద్దెక్కి పోతంది-నాలుగంటె నాలుగే ముచ్చెట్లు ఇనిపోండ్లి-దండుగాతగదా-మీకు మనుసుకత్తె ఇసారం జెయ్యిండ్లి-లాపోతే ఎవల సందాల ఆళ్ళుంటోవాల." అంటున్నాడు.

ముఖమంతా రెచ్చికొట్టుకొని ఓటుగాలు రాయలింగం ముసలాయన కెదురచ్చి "మల్లి వొంగలు బయిలెల్లిండ్లన్నమాట—సాలు సాలునయ్య—మా పొల్లె సిచ్చు పెట్ట కుండ్లి" అన్నాడు.

ముసలాయన కోపగించేది పోయి—పైగా పెకపెక పండ్లు బయట పడేటట్లు నవ్వి "సరెగని కాసింత పొవాకుంటె గెట్టు — దవుడ తీపు మెక్కుతంది." అంటూ దగ్గిరికి నడిచిండు.

రాయలింగు అయిష్టంగానే ఓపొగాకు ముక్క ముసలాయన సేతులేసిండు. "అబ్బోరాయలింగన్న—కొంచె గానికి సిరత్తెమంచ మెక్కి కూలినట్టు — నీకొడుకులు 'కోరుట్ల'న బత్తాలు మోసి ఇన్నూరు పంపెటాల్లకే నువ్వు మాదండి ధనవంతున్నను కుంటన్నావే ? నువ్వు ముడ్డికి సక్కగ ధోతిలేకున్న దొరవై పోయినావే—" అన్నది దాదోల్ల ముసల్ది—

దడి ఆవలి నుంచి దానికోడలు పొట్టైరకమ్మ గడుక కుండ సేతుల బట్టుకొని "మందికి మాన్నగాలం బుట్టి—గురుత్తం లేదు. సంగమచ్చి నంక రూపాయినర కూలి

అయినైన గురుత్తం లేదు." అన్నది.....

సెవుటు రాజక్క ముసలాయన దగ్గరికచ్చి "జానే పెద్దనాయిన — మీదే వూరు ?" అన్నది.

ముసలాయన మాది "రామయ్యపల్లె" అన్నాడు.

"ఓహో రామయ్య తోలింకా?" అన్నది.

"కాదే సెవుటుదాన రామయ్యపల్లె" అని వెంకమ్మ ఈసంత నోరు తెరిసి చెప్పింది.

రాయలింగు 'పోకడంత' దిగిపోయి తలదించుకొని సింగులు దున్నుకుంట మూడు పానాదులకాడికి నడిసిండు.

"ఓసెనాత్తి జాపసెనాత్తి"— అనుకుంటచ్చిండు మొక్క బీడికింద నుంచి గాలయ్య.

"నువ్వునేవని సూత్తన్నా—దాదా—మనోల్లు భూలచ్చిమి కాడ సభ పెదలేసిండ్లు—" అన్నాడు ముసలయ్య.

ఇద్దరు కలిసి వచ్చేసరికి లుంగీలు కట్టుకునోళ్లు డప్పు తెప్పించి — "దుక్కి దున్ని—దుక్కి దున్ని

దొందకై తిరా మాయన్న తీతగాడ—" అంటూ పాడుతండ్లు—....

మోతెపరి రైతులు, పాలేర్లు నిలబడిపోయిండ్లని దుసరుసలాడుకుంటచ్చి — ఈ తతంగమంతాజూసి ఏమంటే ఏమైతదోనని ఏమనకుంటానే ఎటోడటు జారుకున్నారు.

"ఊరు మనదిరా వాడమనదిరా" అంటూ ధోతిరైతు పాడిండు—....

"ఇగగ పాటలికే మచ్చెగని ఏంరో చెప్పుకోనంటిరి— ఆవల మబ్బు సుట్టు కత్తంది.... ఏడవని ఆస్నె ఉన్నది. జెరంత పొద్దెక్కితే ఇయ్యాల్ల ఉత్తపన్నానికి కయికిల్లుబోతయి—" అన్నదొకామె గుంపుల నుంచి—

అప్పుడే బుర్రదకాళ్ళతో ఉరికొచ్చిన మొగిలి దప్పుతీసుకోని దునదునలాడిచ్చి పాటెత్తుకున్నడు. ఊళ్లోలే సులిబట్టిండ్లు.

ఉరుము ఉరిమింది. భూమయ్య ఎద్దు ఒకటి తలుగు తెంపుకున్నది. దాన్నెవలో మళ్లాకట్టేశారు.

మాటలకచ్చేటాల్లకు నువ్వంటే నువ్వనుకున్నరు కానేప్పు. ఆఖరుకు "నాకేమన్నా సిగ్గా— మునలోణ్ణి— సరె— నీవన్న అక్కాచెక్కాల మాట్లాడ్తె ఎక్కిరియ్యకుండ్లి-" అన్నాడు మునలతను.

"నువ్వు మాట పాటకు వానప్వాల కుక్కల్ చెంగ ఆగకు గంతే" అన్నాడు లుంగీ కట్టుకున్నతను.

అది విన్పించుకోకుంటనే— "నే తల్లి— మొదటి మాదే మర్చిపోయిన— ఆఁ మతికచ్చింది— కామ్రేడ్లు....అక్కాలాలా! తమ్ములాలా — మన ఇలాకాల మనం సంగాలు పెట్టుకున్నం— కూలీల్లు పెంచుకున్నం— అక్రమంగ దీసుకున్న భూములు పంచాయితీ పెట్టి గెల్చుకున్నం- గజగిత్యాల పెద్దపల్లి, ఉజూరబాదు కొల్లయితె—ఎనుకట తిన్నదండుగలు కక్కిచ్చిండ్లు— ఇన్నరా? నాకు నాకు మతుకత్తలేవుగని— ఆఁ మన పంచాయితులు మనమేం తెంపుకుంటున్నం. పాలేరోల్ల జీతాలు పెంచుకున్నం — ఇంతెందుకు కుంటిగులాప్ సబ్బంత పర్నాలు ఒక్కటైనవి. ఇగ వానప్వాల కుక్కల్.... సరె సరె— నా మాట మోటు మాట— ఊళ్ళల్ల దొరలకు ముడ్డి కింద మంట పెట్టినట్టయ్యింది.— "తావేలు" మీ కెరికే గదా? మనం తప్పినట్టు పట్టప్పుడు దొరలు మూతులు తావేలు తీర్గ బొచ్చెలనే పెట్టుకున్నరు — మంది ఎప్పుడైతె మనం పెట్టినమో ఇగ తమ సీమకండ్లు పులపొడిసి బొచ్చెల నుంచి మూతులు జూపిండ్లు— ఇగ దానికి తాడు బిగిచ్చేదున్నది.... అట్ల పిస పిసలాడిండ్లు —బలమున్నోడు తుపాకులున్నోడు ఎదుటకే అచ్చి మన మీన బడ్డడు. పెరిగిందేగని తరుగలే — ఇగగిది గిట్లగాదని—పోలీసోలకు జెప్పుకున్నరు. ఆళ్ళ ఊళ్ళమీన బడి లూటికి అయిదేండ్లాయె ఎంత జేయాల్నో అంత జేత్తండ్లు—ఇన్నరా: గిట్లంటే కప్ప త్తండ్లు—మీదికెళ్ళి అధాలతుల, కేసుల, అదేందో కల్లోల సట్టములు—గది తెచ్చిండ్లు—అయితే గిది ఆగిందా? జగిత్యాలల బుట్టింది—అన్నాల్ల దిగ్గింది—ఆదిలబాదుల గోండోల్లు, ఓరగల్లు, నిజామాబాదు—ఇట్లా ఓనుట్టు గిరేసుకున్నది. కోమలి పోరగండ్లు ఆళ్ళ లడాయికి దిగుతె మనం దిగొద్దా? ఆళ్ళ తుపాకులు బట్టుకుంటె మనం పొరకలబడితె ఎల్లుతదా? ఇగ మీకు దాసె దొంగతనమేమున్నది - మనోల్లు తుపాకులు తీసుకొని లడాయికి తయారయ్యిండ్లు—కావాలెగద-అరెబయి సేసుకున్న పెండ్లాన్ని రావణుడు నెరబట్టిండ్లు — ఊ అంటె అత్తదా? ఆఁ అంటె అత్తదా? ఇజ్జెం జెయ్యాలె — సీతనెర లిడిపియ్యాలె- దున్నెటోనికి భూమి గావాల్నంటె గంతె-పాండవుల కతల గంతెవున్నది. ఇగగిదంత

చెప్పుతె భారతం-ఎందుగ్గని - ఊళ్ళల్ల పోలీసోల్లబడి బెల్లం పాడుజేత్తండ్లు - మనకు సెప్పుకోను దిక్కేవలు ? సెప్పుకోను బోలె పట్టుకోని తన్నెటట్టున్నది — ఆడాడ మన పిల్లలను ఉద్దుమార్తంగ యపాకుతీసి సంపుతండ్లు - పల్లెల్ల పోలీసోల్లు కాంపులుబెట్టి పచ్చిబూతు సేత్తండ్లు-కనుక-మనం అన్నాలర్ల బందువులు బెట్టాలె-ఒరే దొంగలంజ కొడుకుల్లాలా-షేం ఊకోమని చెప్పాలె—మా కస్టం సుకం జూడని గాడిదకొడుకులు—గిప్పుడు షేం కండ్లు తెరిసెటాల్లకు తుపాకులేసుకొని మీని కత్తంల్లా అని ముడ్డిమీన తన్నాలె-ఒక్కరుగాదు ఏల ఊళ్ళన్ని ఒక్కటేనని చెప్పాలె-కాంపులు ఎత్తేసేదన్క లొల్లి జెయ్యాలె-ఇయ్యేల్ల మావూల్లె కాంపున్నది. రేపు మీవూరి కత్తది - సేతులు కాలినంక ఆకులు పట్టుకోవద్దు — రేపు మంగళారం - మొత్తం బందువెట్టుండ్లి-అచ్చె పోయె బస్సులాపుండ్లి -" ముసలాయన పిడికిలి బిగించి తన చేతుల తనే గుద్దుతూ చాలా చెప్పాడు.

ఆ తరువాత ఆ వూరి సంగపెద్దె గాలయ్య మాట్లాడిండు. "వీదోల్లకు వీదోల్లె మద్దతు తెలుపుకోవాలన్నడు. తమఊళ్ళో సంగం ఇంకా బలపడాలెనన్నాడు- కష్టాలు, నష్టాలు అత్తే రానియ్యి అన్నాడు— నచ్చిందోనాడు పుట్టిందోనాడు— ఇది వరదనుక మనం జాంచె బతుకులు బతికినంమురింక. మనుషుల తీర్గ బతుకుదామన్నాడు.

వాతావరణం వేడెక్కింది - పొరుగూరోల్లు ఇంకో వూరికి వెళ్ళిపోయారు. కొందరు గునిసిండ్లు-మరికొందరు భయపడ్డరు. యువకులు ఉత్సాహపడ్డారు.

పోతూ పోతూ ముసలాయన గాలయ్యను ఓరకు పిల్చి - "ఈ పొద్దంత గీ ముచ్చట నడుగుతది - తలోతీర్గ తలపోత్తరు. నాత్రికి మంచోల్లను బిలిసి ఎట్లెట్ల జెయ్యాల్నో ఎవలేం పనులు జెయ్యాల్నో అనుకోండ్లి-బందు బరుపూనగ జరుగాలె— సానా వూళ్ళల్ల జరుగుతది—మా తీర్గనే సానామంది పచారానికి బయిలెల్లిండ్లు-" అని చెప్పిపోయిండు.

ఎటోల్లటు పనులమీనికి పోయేటాల్లకు పొద్దు నెత్తిమీనికి రానేవచ్చింది.

* * *

ఏమంట పొద్దుగూకిందో తుపతుప సినుకులు మొదలైనయ్. ఆ సినుకులను లెక్క చెయ్యకుంట గాలయ్య ముఖ్యులందరిని పిలిచిండు. బర్ల మచ్చయ్య ఇంటి కాడ ముఖ్యులు కూసున్నరు.

ఇసారాలు సాగినయ్. బందు ఎట్లెట్ల జెయ్యాల్నో నిర్ణయించుకున్నంక - "మరిగిది మన అన్నకెరుక లేకుంట జేత్తన్నం ఆ యింక మల్లా ఏదన్న ఉల్టాకత్తె" అన్నాడు ఒకడు.

"అయిందానికి కానిదానికి ఆళ్ళే రావాల్నంటె ఆళ్ళకు గీ ఒక్కరె ఉన్నదా? అచ్చినోల్లు అంతట జేత్తన్నరని చెప్పలేదా?" అని సదిరి చెప్పిండు మరొకడు.

ఎందుకైన మంచిదని మొగిలిని పిలిచి అన్నకు ఎరికజేసి రమ్మని చెప్పం పిండు గాలయ్య. గీ ముచ్చెట బయటెంకకనాలెనని కడుపుల బెట్టుకున్నడు.

అందరు అనుకున్న ప్రకారంగా ఎవలవాడకు వాళ్ళ మందిని కుప్పేసి రేపు జరుగబోయె బందుగురించి చెప్పాలని లేచిపోయారు.

వర్షం తగ్గింది. ఆకాశంలో జెగజెగ చుక్కలు మొలిచినయ్. తూర్పున ఎన్నీల పొడిసింది-ఏల్పుల ఎల్లయ్య దప్పు సంకకేసుకొని సాటింపు దప్పు కొట్టు కుంట బయలుదేరి మజ్జె మజ్జె ఆగుతూ "ఓహో .... రేపు పల్లెల్ల నుంచి పోయెటోల్లు ఎల్లిపోవాల్నని అన్ని పనులు బందుపెట్టాలని రైతుకూలి సంగం ఇందుమూలంగా తీర్మానం చేసిందని అందరికీ చెప్పమన్నదహో...."

మళ్ళీ దప్పుసప్పుడు జెజ్జెనుక — జెజ్జెనుక —

అడ్లీరయ్య రొట్టె నములుకుంటనే ఈతలికచ్చి - కొంచెం తూలుతూ—"ఓర్నీ యవ్వ—బందంటె సారాదుకాణం సంత బందేనారా?" అన్నాడు.

"అన్నీ బందే" అన్నాడు ఎల్లయ్య.

"ధుత్తెరి లొట్టపీసు సంఘం" అనుకుంట పడబోయి తమాయించుకొని- ఇంట్ల కు పోయిండు.

ఎల్లయ్య వెళ్ళిపోయాడు - అడ్లీరయ్య ఏదో మతికచ్చి తూలుకుంట జెగ్గయ్య ఇంటికేసి నడిచాడు.

"నీ బుద్ధి పాడుగాను - సాడుగొట్టు బుద్ధి" ఈరయ్య భార్య గులుగుతోంది.

అట్లావీరయ్య పోయేటాల్లకు జెగ్గయ్యఇంట్లో అయిదుగురు ఉట్టిపై కూకుండి ఏమి చేయాలా?" అని విచారం చేస్తున్నారు. పెద్దలంత ఒక్కకాన్నే ఉన్నరు. సెనార్తి - ఇన్నరా?

"రేపు బందట - " అని దొంగనవ్వు నవ్వింది అడ్లీరయ్య.

"మారినెకే - గీతపేం కూసున్నవని బయటంటె నీ బొక్క లిరుగుతయ్" అన్నాడొకడు.

"ఆళ్ళేమన్న పవ్వకిత్తరా (పావుసేరు సారుకు ఇస్తరా? " అన్నాడు వీరయ్య.

"పవ్వలేదుగివ్వలేదుపో - " అన్నాడొకడు.

"వానినోరు మంచిదిగాదు - " అని జెగ్గయ్య అయిదురూపాయలిచ్చిండు.

"దొంగలంజకొడుకులు ఓపదిరూపాలన్న ఇత్తరనుకుంటె" నడుసుకుంట 'జంబిచెట్టుసేరు' కట్టుకొని బురదలపడి లేచి-

"బంచత్ బందే చెయ్యాలె - బంచ్-" అనుకుంట తూగుకుంట సారాదుకాణం దగ్గరికివెళ్ళి రూపాయి ఉద్దెరబెట్టి అయిదురూపాయలిచ్చి - ఓసవ్వ రాగి ఓసవ్వా పరుకు సంచి జేబు తీసుకొని నడిచాడు-

అయిదుగురిలో ఒకడు బండికట్టిచ్చుకొని పోలీసుల దగ్గరికి పోయిండు. ఆసంగతి వీరయ్య చూసిగాలయ్యకు చెప్పిండు....

అంతట బురుగంగ పోలీసులు అత్తె రానియ్య అసీ సూద్దాం. అనుకున్నడు గాలయ్య....

* * *

"ఎటుబోయినవే సావిత్రి" అనుకుంట మంచాల్లో నుంచి లేచింది నర్సమ్మ - 'తడుకమక్కబోగు' సదురుకొని - ఎంటికలు గోల్ల కొట్టుకొని - ఆవులిస్తూనే - "పిల్లా ఎటుబోయినవే - " అంటూగావుకేక పెట్టింది.

సావిత్రి ఉలిక్కి పడిలేచింది. ఇంకా చీకటి చీకటిగానే ఉన్నది.

"కొడుక్కింకా తెల్లారలేదా ? రాత్రంత లొల్లెవదాలు పాడుకుంట తిర్గుడు- అంబటాల్లయ్యేదనుక మంచాల నేసుడు. లేపి జెర పొలం కాడికి బొమ్మను" అన్నది.

"అయినె రాత్రింటికి రాలేదత్తా !" అన్నది భయంభయంగా.

"ఆడు దొత్తిలకు ఏగై పోయిండు-పెండ్లాంపోయిలేదు. పని పోయిలేదు. మారే ఈ సంసారాని కగ్గితల్లి ఎరియ్యవలంగాడు. పెద్దోడు ఏదో నాలుగు పైసలు సంపాయించుకత్తనని కాలేరు (బొగ్గుబాయిలకు) మీదికి బోయిండు. ఇగగీడు బున్నెకిడిసి నట్టయ్యిండు." మంచమెత్తుకుంటనే నర్సమ్మ గులుగుతోంది.

సావిత్రి మనసు చివుక్కుమన్నది. మరింక అత్తనోరు మల్ల నిదుర బోయే దాకా పైడికంటె పలికినట్టు ఇట్లాతిడుతూనే ఉంటది. తన భర్త మొగిలికి నెత్తిలపేను, పారినట్టన్నా కాదు. ఈ కుటుంబం ఎందుకో తనకర్థం కావడంలేదు. భర్త ఎందుకు తిరుగుతాడో తనకు ఎంత ఆలోచించినా అంతుపట్టదు. కాని మొగిలి పాడితె కడుపుల దేవినట్టుగా ఉంటుంది.

కాలకృత్యాలకోసం లేచి వెల్లిన సాంభయ్య దగ్గుకుంటచ్చిండు కాళ్ళ చప్పుడు దగ్గు తప్ప మనిషి చీకటంత నలుపు-పైగా అతనెప్పుడు అంగీ తొడగడు.

"ఏమే - మొగిలిగాడు పొలంకాడికి బోయిండా ? చిన్నోడు ఎడ్లిడుసుక పోయిండా ? మల్ల అంబటేల్లకు నాగలిగడితె ఎడ్లు సొడసొడలు బోతయి- ఇంత పసుకన్న కంకుతయి. గొల్ల లంజకొడుకులకు కేవుర మెక్కింది - పసుకమందలు ఉన్నలబ్బికొడుకులకే పెట్టిరి- ఇంక పొలం మూడోసాలు కాకనేపాయె - కయికెన్నడు జేసేం - నారుపెరిగిపోబట్టె - " అంటూ కస్సకస్సమన్నానగ్గి కాండ్రకిచ్చిఉమ్మేశాడు.

"నీకొడుకు రాత్రి ఇంటికే రాలేదు." అన్నది నర్సమ్మ చేతులారుస్తూ-

"మారే నావశంగాదే—మంచి మంచోల్లకు సావు వస్తుండు. నాకు సావు రాదు...." దగ్గు ఇంకా సాంభయ్యను మాట్లాడనియ్యలేదు.

"నువ్వేమొ పెద్ద దొల్లగాని దగ్గరికిపోయి గోంత దావఖానలనన్న సూయించు కోవైతివి....సూసుకుంటపానమీనికి దెచ్చుకుంటివి-పైసల మనం సంపాయించినంగని-పైసలు మనలసంపాయించలేవు గద— అప్పోసప్పో అయితే ఆయింక తీర్సుకుందాం. పెద్దాపెరంట-ఇస్నారు కర్సుబెట్టి పెద్దావీరకుగొలిత్తె సిన్నమెత్తు తక్కువగాకపాయె." నర్సమ్మ సదువుకుంటనే చిన్న కొడుకు మంచంలో చూసింది. చిన్న కొడుకు తిరుపతి లేడు.

"ఈ గాడిదికొడుకు ఏడబోయిండో?" నర్సమ్మ

సావిత్రి రాత్రి కుండలు జాలారి దగ్గర గీకుతోంది. ఓచెవ్వు అత్తమాటల కేసి వేసి ఉంచింది.

అప్పటికి తూరుపు రేకలు పారి తెల్లగా తెల్లారిపోయింది. చెట్లమీది పక్షులు గుంపులు గుంపులుగా అరుస్తూ ఎగిరిపోతున్నాయి. ఈపాటికి వూరు యమసందడిగా ఉండాల్సింది. గొడ్ల బోయుని అరుపు-లాగెలు, ఆవుల ఒర్లుడు, బర్ల గిట్టల చప్పుడు, ఏది లేదు .... మనుషులు తిర్గడంలేదు, వూరంతా నిశబ్దంగా ఉన్నది.

"ఊళ్ళోళ్లకేం బుట్టిందవ్వా!" అనుకుంట నర్సమ్మ గడికాయ్యల దగ్గరి కొచ్చింది.

అప్పుడు పెడీ పెడిన కేకలు, అరుపులు కోమటోల్ల కొట్టాల దగ్గరి నుంచి వినిపించాయి.

"దున్నేవానికే భూమి"
"పల్లెల్ల పోలీసు క్యాంపులు...."
"....ఎత్తి వేయాలి"
"దొర జులుం...."
"....నశించాలి"

అప్పుడు విన్నటి దినం రామయ్యపల్లె రైతులు రావటం నర్సమ్మకు యాదికి వచ్చింది.

ఇంతలోనే సావిత్రి, సాంభయ్య కూడా వాకిట్లోకొచ్చి నిలుచున్నారు .... అప్పుడు తొంపరు అయిలుగాడు జుట్టింత ఇరబోసుకొని—పినిగిన బట్టలు లొడలొడ లాడుతుంటగా బొచ్చమీన కొట్టుకుంట "నాగండ్లకు బోయినోల్లు నవ్వుకుంటచ్చిరి. గుంటుకలకు బోయి నోల్లు గెద్దుకుంటచ్చిరి." అనుకుంట ఎగురుకుంట పాడుకుంటచ్చిండు.

"వారీ అయిలుగ-ఏమచ్చిందిరా?" నర్సమ్మ ముక్కుమీద వేలేసుకొని అడిగింది.

"ఓనర్సవ్వ — నీ కెర్కలేదా? నాగండ్లు ఇడిపిచ్చిండ్లు, బుంబులిడిపిచ్చిండ్లు, నాట్లు గీట్లు బందు—పాలేరోల్ల పనులు బందు" గొడ్లు బర్లు సుట్లమీన్నే— ఇయ్యాల్ల బందు—బందు" అని చెప్పుతూనే పరిగెత్తాడు.

"వ్వా, కొడుకుల తూడుకలాసెనయనుకో." అన్నాడు సాంభయ్య దవడ కొరుకుతూ—

గుట్టమీనవాన గొడితే బొలబొల వానొచ్చినట్టు ఊళ్ళెజనం, ఆడోల్లు, మొగోల్లు, బిజారు పికపికలాడంగ—ఎర్రజెండలు పట్టుకొని బజార్లకు రానే వచ్చారు. తనకొడుకు మొగిలియే గొంతంతా చించుకొని అరుస్తున్నాడు — దానికి ప్రతిగా మిగతా వాళ్ళు మొత్తుకుంటున్నారు. నర్సమ్మకు ఆ అరుపులకు ఎందుకో గుండె దడదడలాడింది.

కాళ్ళు వనికినయ్. ఏదో చెప్పరాని ఆవేశం ఒళ్ళంతా కమ్మినట్టు—అగులుగుబు లైంది.

సావిత్రికి జలజలా నెత్తురు ఒళ్ళంతా పాకింది. అత్త లేకపోతే తను పరుగెత్తి ఏదో ఒకటి అరిచేది అందరిలాగా-సాంభయ్యకుమాత్రం యమకోపంగా ఉన్నది. వీళ్ళు తేరుకోక ముందే ఊరేగింపు మూడు బజార్ల దగ్గరికొచ్చింది. పఱ పఱలాడే ఖరదలోనే జనం నిల్చున్నారు.

రాయలింగు పెద్ద బండి మీద మొగిలి ఎక్కిండు. దావాపుగానిన్నటిమాటలే మాట్లాడిండు.... నర్సమ్మ బజాట్లో మంది వెనుక నిలుచున్నది. ఆమెకు ఒక్కమాట అర్థం కావడం లేదు.... ఆ మాటలు వింటున్నదోలేదో కూడా చెప్పలేం. కాని మొగిలి నోరు, కళ్లు, ముఖం, చేతులు ఆడటం చిత్రంగా చూస్తున్నది.—

మళ్ళీ వూరేగింపు కదిలింది — వూరంతా తిరిగింది. మళ్ళీ మూడు పానాదుల దగ్గర నుండి వాగుకేసి నడిచింది. వూరేగింపు అంతకంతకు పెద్దదయ్యింది.

నర్సమ్మ తేరుకొని ఇంటి కొచ్చింది—గడనకుడి పక్క సాంభయ్య తల పట్టుకొని కూర్చున్నాడు. సావిత్రి మొగురం పట్టుకొని నిల్చున్నది. అప్పటికి ఎండ పొడ సింత మీద నుండి వాకిట్లో పారాడుతోంది.

"ఏమాయెనె కొడుకు రాజికరికం సేత్తంటె కండ్లు నిలబడి పోయినాయె — సిన్న పోరన్నన్న పిలువక పోయినవ్ — ఇన్యేడు పొలం నున్నేగని—ఎడ్ల బక్క పట్ల మీన సత్తన్నయిగదా !" అన్నాడు.

నర్సమ్మకు అప్పుడు చిన్న కొడుకు మతికొచ్చాడు. తను చూడనే లేదు. పిలుచుకొస్తనని బయలు దేరింది. వాగుదాటి రోడ్డు దగ్గరి బస్సుస్టేషీ దగ్గరికి — చేసేసరికి అక్కడ యాపల కింద ఇసుకవేస్తే రాలకుంట జనం. మూడూల్లోల్లు కలిసి పోయిండ్లు. గాలయ్య మాట్లాడుతున్నాడు. కొత్తగా డప్పులు, పదాలు....

ఇంతలోనే బస్సొచ్చింది. జనంనాని మీదికెగ బడ్డారు. టైర్ల గాలి విప్పేశారు. మందిని అందర్ని దిచేంశారు. వచ్చిన లారీలను, ట్రాక్టర్లను ఆపేశారు. అంత గందర గోలంగా ఉన్నది. ఆ మందిలో తన చిన్న కొడుకు కనిపించ లేదు .... మందిలో వెతికి చూసింది...."మీ తిరుపతి పొరుగూరు పనులు బంద పెట్టియ్యటానికి పోయి

నోల్ల తోని పోవచ్చని" నీలమ్మ చెప్పింది....

నర్సమ్మ మళ్ళీ ఇంటికేసి తిరిగేసరికి అంబటాల్ల దాటి పోయింది.

* * *

అత్తగారింటి నుంచి పెండ్లాన్ని తీస్కొని వచ్చిన గడ్డంరాజాలు ఎండ నుంచి గుడిసెలకొచ్చి కండ్లు కన్పడక—కాసేపు నిలబడి గప్పుడే ఒకాలు సొప్పుకొని గటక తింటున్న తల్లిని చూసి "ఏందే అవ్వ ఇయ్యాల్ల నాట్లకు బోలేదా ?" అన్నడు.

"ఇయ్యాల్ల నాట్లేడియి. అంత బందు." అన్నది.

"బందేందే?" అని "అట్లయితె మనూల్లెసుత జేసిండ్లన్నమాట — మాఅత్త గారూల్లె బందే—ఊరేగింపులకు రమ్మంటె ఎట్లనో తప్పిచ్చుకచ్చిన — " అనుకుంటనే ఎట్లెట్ల జర్గిందోనని చూసొద్దామని బయటికి నడిచాడు.

"ఓ—అంతయిపోయింది. ఎవలిండ్ల కాళ్ళబోయిండ్లు—ఎవల జోలికి పోకు సుమ్మీ—ఎవలను పట్ట పగ్గాలు లేవు." అన్నది తల్లి—

"గిప్పుడే అత్తిమి—పోకుంటేంది." అన్నది భార్య.

"దెహెః మీకే మెరుకనే— " అనుకుంట కంకరరోడ్డెక్కి బస్సుస్టేషీ కేసినడిచాడు గడ్డం రాజాలు.

యాపలకింద నరీసప్పుడులేదు .... ఒక్క అల్లీరయ్య మాత్రం నిన్న కొనుక్కున్న పవ్వ తాగి — 'సారాగుడిసె తడు కెప్పుడు తీత్తరా' అని — ఎదీలె పడి కూర్చున్నాడు.

"ఎందే అల్లీరన్న రంధిపడి కూసున్నవ్." రాజాలు.

"సంగపోల్లకు బుద్దిలేదెహెః—బందు వెడితె అన్నిబందువెట్టిరిగని గీ దుకాన మన్నకుల్లా ఉంచద్దా." అంతెత్తు లేచాడు.

ఆమాట అంటుండగానే బయ్యిన జీబు దూసుకొచ్చి రోడ్డుమీదాగింది—అందులో నుండి గుప్కి గుప్కిన పోలీసులు, ఒక యస్సై దునికారు—

"తెలిమాకా. పకుడో ? " అంట లాఠీలతో కొట్టుకుంట రాజాలును వల్లీరయ్యను జీబులో పడదోశారు.

"మేం సంగపోల్లంగాదు దొరా ! "వల్లీరయ్య మొత్తుకున్నాడు.

"బస్సులనాపుతారు బంచత్—బందు పెడుతారు—పోలీసు క్యాంపు లెత్తేయాల్నా

—డోకిలికే—పోలీసోల్ల తడాఖాసూసుకో— ” అంటూ కొట్ట సాగిండ్లు—

“మాకే మెరుక లేదుదొరా ! మావూళ్లె గామొగిలి, గాలయ్యలు సేసిండ్లు ” వట్లీరయ్య నెత్తురు కారే నోటితో—

ఆ మాటతో వీరయ్యను కొట్టడమాపారు. వీరయ్యను ఇద్దరు పోలీసులు జీబు దించి రెట్టలు పట్టుకొని ఊళ్ళకు నడిపించుక పోయారు. అప్పటికే వార్త తెలిసిన జనం తుపాకులు, తంగెళ్లు పట్టుకొని పరుగెత్తారు.

మొగిలి అప్పుడే అన్నంమీద కూర్చున్నాడు. నర్సమ్మ, సాంబయ్య తలో పక్క తిడుతూనే ఉన్నారు. పోలీసులు ఇంట్లోజొచ్చి ఎంగిలి చేసనే మొగిలిని బయటకీడ్చు కొచ్చారు. గాలయ్య దొరకలేదు. ఏతో చెప్పుదా మనివచ్చిన రాయలింగును, లసుమయ్యను, మరో ముగ్గురిని, వట్లీరయ్యను, రాజాలును పట్టుకొని తన్ను కుంట తాలుకాకేసి తీసుక పోయారు.

నర్సమ్మ దిగ్భ్రాంతి నుండి తేరుకునేసరికే సావిత్రి ఏడుస్తోంది. ఊరుమీద ఊరుబడ్డది....ఏడుపులు, తిట్లు—

* * *

మొగిలి జైలునుండి విడుదలై వచ్చేసరికి పొలాలు కలుపులకొచ్చాయి. ఊళ్లో చాలా సంగతులు జరిగాయి. పరంపోగు చెరువు ముందటి పన్నెండెకరాలు ఊరంతా కలిసి దున్ని అలుకుడు చేశారు.... చిన్న చిన్న ఘర్షణలు అనేకం జరిగాయి —మరి కొన్ని కేసులు, మరికొన్ని చూర్లు పోలీసు దాడులు, నినాదాలు, గోడల మీద రాతలు, వూరేగింపులు, పంచాయతులు ఇట్లా చాలా చాలా జరిగి అన్ని ఊళ్ళల్లాగే గాడుపు దుమారంలో మొదటి కంటా వూగిన చెట్టులాగా ఆ ఊరు వూగింది. ఆ చెట్టు రెమ్మ రెమ్మ, కొమ్మ కొమ్మ, ఆకాకు కదిలిపోయినట్లుగానే — ఆ ఊర్లోని ప్రతి కుటుంబం పునాదులతో సహా కదిలి పోయింది; ప్రతి మనిషి కదిలి పోయాడు.

ఇవ్వన్ని మార్పులు అంతస్పష్టంగా బయటికి కనిపించేవి కావు — ఇంతకు ముందు పాలేర్లను, కూలోల్లను ‘లంజెకొడుక’, ‘లంజెముండ ’ అని పిలిచేపిలుపు స్థానే పేర్లకు ప్రాముఖ్యం వచ్చింది.... పంచాయతులు ఊరి పెద్దల చేతుల్లో నుండి జనం చేతుల్లో కొచ్చాయి. పెండ్లిల్లు, పండుగలు ఊరి పెద్దల కను సన్నల్లో కాకుండా తమంతట తామే చేసుకునే మార్పొచ్చింది.... ఇట్లా చెప్పుకుంట బోతే ఎన్నయినా చెప్పొచ్చు. కట్టు, బొట్టు, మాటతీరు, నడకతీరు, పనితీరు అన్ని గుర్తు పట్ట నంతగా

మారిపోయాయి....

ఈ గాడుపు దుమారంలో జెగ్గయ్య కుటుంబం తాలుకాకు తరలి పోయింది.... గాలయ్య మరో ఇద్దరు యువకులు రహస్య జీవితానికి వెళ్ళి పోయారు.

*　　　*　　　*

ఆకాశంలో తెల్ల మబ్బులు జోరుగా తిరుగు తున్నాయి. పడమటి దిక్కు గుడి మెట్టు వెనుక కేసి పొద్దు వాలిపోతోంది. దళ్ళ మీద బీర పువ్వులు విచ్చు కుంటు న్నాయి. ఊరంతా విపరీతమైన సందడితో ఉన్నది. పెసరు చెలుకలు ఏరుకొచ్చి, వాకిల్లల్లో వేసి దుడ్లతో గుప్కు గుప్కున కొట్టేచప్పుడు. ఆడోల్లు చాటలు గబగబ ఆడిస్తున్నారు. ఊరంతా నల్లగా పెసరు పొట్టుతోటి, బుసితోటి నిండి పోయింది. చిన్న పిల్లలు వచ్చి పెసరు గాయలు గిరుతూ బుసికి గోక్కుంటూ, తల్లులు వెంట తిరుగు తున్నారు.... కొంచెం పెద్ద పిల్లలను పెసాలు ఎత్తుక పోతారేమొనని దగ్గరికి రానియ్యడం లేదు.

మొగిలి దుడ్డుకర్రతో అయ్యర మియ్యర పెసరగాయ కుప్పను నలుగకొడుతు న్నాడు. ఆ దెబ్బలు, ఆ వేగంచూసి వదినె వరుసగల లచ్చుమ్మ "ఏంది పిలగ—జేలు కాన్ల కూసుండి బలం బాగనే తెచ్చుకున్నవ్." అన్నది.

"కొర్తుంటె తప్పతాది పిల్లా....అడెందు రక్కలేనోడు" అన్నది నర్సమ్మ— 'ఆఁ అదేదో యాదృచ్ఛికంగా జరిగిందని ధ్వనించేలాగా'....

"అదిగాదత్తా, ఎప్పుడన్న కోపమచ్చి మా సావిత్రిని దెబ్బేత్తదేమొనని" గౌరమ్మ కిసకిస నవ్వింది ....

"సి మొగడు నిన్ను కొడుతున్నాడే గౌరు .... అదేం కుదరదు. సంగానికి చెప్పుకుంటె పజీతు (ఇజ్జత్) తీత్తరు"- లచ్చమ్మ

సావిత్రి దూరంగా పెసాల్లు కుప్పజేస్తున్నది .... మొగిలికేసి చూడడంలేదు గాని, ఆ చేతుల్లో ఎంత బలమున్నదోనని ఆశ్చర్యపడుతున్నది. పెసరగాయ కొట్టడం మామూలుగా కాకుండా, ఏదో, కసి, కోపం అందులో ఇమిడివున్నదని సావిత్రికి భయ మయ్యింది.

అప్పుడు మొగిలి ముఖంలోకి చూసింది. ఒళ్ళంతా దిగచెమటలు కారుతుం డగా ఉన్మాదిలాగా బాదుతున్నాడు.

"మావోడు అంగుతె నలుగురిపెట్టి కట్టంజేత్తడు." అన్నది నర్సమ్మ....

సాంబయ్య నాలుగు గోనెసంచులు తీసుకొని వాకిట్లో నిలుచున్నాడు ....

మొగిలి హఠాత్తుగా కొట్టడం ఆపిండు. దుడ్డుకర్ర విసిరేసి వాకిట్లనుంచి బయటకు నడిచాడు .... నర్సమ్మ ఏదో అంటోంది.

సావిత్రి మనసులో ఎన్నో ఆలోచనలు ... జైల్లోనుండి వచ్చిన దగ్గిరినుంచి మొగిలి మనుపటితీర్గ ఉంటలేడు. అదేమిటో సావిత్రికేకాదు, నర్సమ్మకు, సాంబయ్యకు అర్థం కావడం లేదు. మాట మృదువుగా, శాంతంగా మాట్లాడుతున్నాడు .... మళ్ళీ అంతలో చిరాకు పడతాడు. అన్నం తిన్నా పరధ్యానమే. ఎక్కువ సేపు మౌనంగా ఉంటున్నాడు .... రాత్రిల్లు ఎన్నోమార్లు లేచి చదువుకోవడం, రాసుకోవడము సావిత్రి చూసింది. అప్పుడెప్పుడో భర్త నాలుగో, అయిదోతరగతో చదివాడని తెలుసుగాని - ఇంత శ్రద్ధగా చదవటం సావిత్రి చూతలేదు. మాటికి మాటికి అత్త మామలతో ఘర్షణ పడుతున్నాడు. "ఏమయ్యిందానకు" సావిత్రికి అర్థం కావడం లేదు.

మొగిలి అట్లా మూడు పొనాదుల దగ్గరికి నడిచిండు. బనీను దులుపుకున్నాడు. వేపచెట్టుమీద పక్షులు చేరుతున్నాయి. భూలచ్చిమి చెక్కబొమ్మలకు అవతల గల రాయలింగు దడికి పసుపుపచ్చగా, పసుపు చల్లినట్లు బీరపువ్వులు విరగపూసున్నాయి. అప్పటికి పొద్దుగూంకింది .... ఎటుపోవాలో కాసేపు అర్థ కానట్టుగా ఆగాడు. గబగబ అడుగులు వేస్తూ వాగుకేసి నడిచాడు వాగులో పచ్చిపాలలాగా నీళ్ళు, బొలబొల శబ్దం ... బాగా ఒత్తుగా పెరిగిన తుంగ - ఒడ్లకు జిబ్బుగా పెరిగిన ఊడుగు, తక్కలి పొదల్లో బొల్లికోళ్ళు కురకురలాడుతున్నాయి.

నీళ్ళమడుగులో మొగిలి ఈదాడు. నీళ్ళమీద చిన్నచేపలు ఎగురుతున్నాయి. సుళ్ళు సుళ్ళుగా తడలు .... ఒడ్డెక్కి బనీను, ధోవతి పిండుకొని మళ్ళీ తొడుక్కున్నాడు .... తడి ఇసుకమీద బొటనవేలుతో సుత్తి కొడవలి వేశాడు - చీకటి ముదిరినా కొద్ది చిమ్మెట్లు జోరుగా పలుకుతున్నాయి. పడమటికేసి ఆకాశంమీద జాజు పారబోసినట్టుగా ఎర్రగా —

మొగిలికి ఏమీ అర్థంకావడంలేదు. మనసంతా తిమ్మరిగా వున్నది. పెద్దగాడుపు దుమారం హోరు .... అదేమిటి ? ఎక్కడ నిలువబుద్ధి కావడంలేదు. ఏది చెయ్య బుద్ధి కావడంలేదు. కలలో బతికినట్టుగా .... ఈ స్థితి ఎందుకు కలిగిందో ? మొగిలికి

తెలియడంలేదు. కాని, ఒక నిమిషం ఖాళీగావుంటె జైల్లో తనలాగే వివిధ గ్రామాల నుండి వచ్చినవాళ్ళమాటలు, తండ్రిదగ్గు - ఖనెల్లు, ఖనెల్లున, బల్లచెక్కలాగా ఉండి- ఏదో సంపాయించాలనే అన్న ముఖం - మౌనంగా తిరిగే సావిత్రి దీలముఖం - ఇవన్నీ మార్చి మార్చి కన్పిస్తుంటాయి ...

ఇవ్వన్ని తనకెందుకు ? అందరిలాగే తను అంగవడి ఏదో రెక్కల కష్టం చేసుక బతుకుతె - పిల్లలు - మళ్ళా నాయనతీర్గ చేదగ్గు - పోలీసులుకొట్టిన దెబ్బలు మతికొస్తే - మళ్ళీ సంగపోల్ల కలవద్దు అనిపిస్తది. గత మూడురోజులుగా గాలయ్య లక్ష్మిద్వారా కబురు చేస్తున్నడు. తను తప్పించుకు తిరుగుతున్నడు. ఏదో బుఖపు ఏని మన్నోని తీర్గ చేండ్లపొంటనే తిర్గుతున్నడు. నాయిన్నకు శాతనైతలేదు - అన్నగాడు కాలేరుకుబోయిండు-తనుఇంట్లనుంచి వెళ్ళిపోతె ఎట్ల? ఈ జెల్లుగిల్లంటె-పొలం ఎసుర కయ్యి - పొలం మతికచ్చేసరికి అదే కాళ్ళమీద పొలంకాడికి నడిచాడు. చేడ్లవెంట తిరిగాడు....వక్కవాళ్ళ పొలం నడుములమంటి పెరిగి పొట్టకచ్చింది. తనుదిమాత్రం మోకాలు దాటలేదు. ఇయ్యేడు పంట సున్న అనుకున్నాడు ....

కట్టకావల - గుట్టబోరుకింద- వెంకట్రాజయ్య మామిడితోట. దానికేసి చూడ కూడదనుకున్నాడు.... లక్ష్మి చెప్పిన ప్రకారంగా - ఇంకా సేపైతె అక్కడికి గాలయ్య వస్తడు. తనకోసం ఎదురు చూస్తడు.... ఈసారి తప్పక వస్తడని ఎదురుచూస్తరు. అట్లా అనుకుంటూనే – మర్రికింది నుండి, మంబోటమీది నుండి గొల్లపల్లెకేసి నడి చాడు-నకినాలోల్ల కొట్టాలదగ్గరతాల్ల ఒకటే మోతపెడుతున్నాయి—అప్పటికి మొగిలికి సలిగాలి తోలుతున్నదని అర్థమయ్యింది-ఒంటిమీది గుడ్డలు పులిపచ్చే ఉన్నాయి .... కొట్టంముందు బండమీద కూర్చున్నాడు. కొట్టం లోపల దోమలకు ఎడ్లు చెవులు, తోకలు విసురుకోవడం విన్పిస్తోంది. బిచ్చగాళ్ళ యింటిదగ్గర 'నారి' గొంతెత్తి శ్రావ్యంగా పాడుతోంది .... ఆ పాటలో విషాదమున్నది - 'నారి' మొగుడు దేశాలు తిరిగి ఎప్పుడో ఏడాదికోసారొచ్చి పదిరోజులుండి పోతాడు.... పిల్లలతో ఏడాది పొడు గునా అది తంటాలు పడుతుంది. దాని వయసు ఇరువై అయిదేండ్లకన్నా యెక్కు వుండదు.

చుట్ట తాక్కుంట నకినాల ఓదెన్న వచ్చిండు. చీకట్లో మంగాళ్ళ మీద తన దొడ్డి ముంగట ఎవలో కూసుండడం చూసి "ఎవలాల్లు?" అన్నాడు.

"నేనే పెదనాయిన్న—" మొగిలి ....

ఓదన్న అగ్గిపుల్ల గీకి మొగిలి ముఖం చూసి "ఏందిరా మొగిలి గింత నాత్రి గీడకూసున్నవ్—ఇంట్లేమున్న కిసకిస లాడుకున్నర" అన్నాడు.

" లేదే-పొలంకాన్నుంచ త్తన్న...."

" ఓహో అదా సంగతి-" అన్నాడు ఓదెలు. అతనికి సంఘం మతికొచ్చింది.

" గీతొవ్వ మీన మంచిదిగాదు. అట్లా మాతాళ్ళ కింద కూసోకపోయినవ్." అన్నాడు ఓదెలు, చుట్ట పలిపేసి చెవులపెట్టుకుంటూ.

మొగిలి అదికాదని చెప్పాలనుకున్నాడు. కాని నాటి పాట వినలేదు. అది వినాలని అట్లాగే కూర్చున్నాడు - పాటయిపోయింది. ఎవరో మీనుండి ఎక్కెక్కి ఏడ్చినట్టు ....

మొగిలి లేచి బజార్లో కొంత దూరం నడిచిండు నెమ్మదిగా.... గిరుక్కున వెనుకకు తిరిగి వెంకట్రాజయ్య మామిడి తోటకేసి వడివడిగా నడిసాడు— అప్పుడు పెద్దగా నిట్టూర్చిండు— పెద్దబండ గుండెమీది నుంచి దింపినట్టుగా తేలిక పడి నడువ సాగిండు....

మొక్కజొన్న పెరడి మీదిగుంటా గాలి వీస్తోంది. ఆకుల వొరుసుకోవడం బలేయింపుగా వున్నది.

ం ం ం

అట్లా పోయిన మొగిలి సరిగ్గా వారం రోజులు గడిచిన తరువాత ముఖమంతా పీక్కుపోయి గడ్డంపెరిగి, బట్టలు మాసిపోయి బట్టలకు అక్కడక్కడ రక్తపు గాయలు, చీపురు ముళ్ళు అంటించుకుని గడపలోనికి అడుగు పెట్టాడు. అప్పుడు అంబటాలయ్యింది.

ఎదురుగా దొడ్డిబాయిలో పనిచేస్తున్న మొగిలి అన్న చంద్రయ్య దిగాలు పడి కూర్చుండి ఉన్నాడు. తల్లి నర్సమ్మ చెంపకు చెయ్యానించుకొని కూకున్నది - సాంబయ్య ఇంటి పక్కకు మోటబొక్కెన సదురుతున్నడు....

"ఇగో గిదీ భాగోతం—తమ్మున్ని ఏం జేత్తవో నీయిట్టం కొడుక-ఆడు సేతికి రాకుంట అగమైపోయిండు. బలువు పనులు మక్కపెరడి ఆలిశ్యమై ఇసుర్రాళ్ళంత పెళ్ళలు పెడితె-సోడతపోతె నేను ఎర్రబెంటల కర్రెపిట్టలోతె మాడి మన్నై దొగ్గయి

అరిసేతులకు నెత్తుర్లు పేరంగ కొట్టినం - మీనాయిన్న దగ్గుకుంట సొడలుసొడలు పోవుకుంట నాగలి దున్నిండు-అందరు దుక్కులు దున్నుకోవట్టిరి. జొన్నపోత ఎత్తి పోతే-మన్నుబుక్కి మంచినీళ్ళు తాగుతరా?" అంతంలేని మాటలు-నర్సమ్మ గడగడ పొల్లుపోకుంట, గుక్క తిప్పుకోకుంటా మాట్లాడింది.

ఈ మాటలేమి పట్టనట్టు - మొగిలి గబగబ ఇంటెనకకు నడిచాడు. ఎల్ల కొట్టంలో సావిత్రి పెండ తీస్తోంది -మొగిలిని చూసి ఆమెకు చెప్పరాని సంతోషం కలిగింది....దగ్గరికొచ్చి "ఇన్ని దినాలు ఎటు పోయినవ్-కొసంత చెప్పద్దా-" అనాల నుకున్నది. తామిద్దరు మాట్లాడుకుంటుంటె అత్త బయటికొస్తే తనకు చచ్చేంత సిగ్గు. ఆ కళ్ళు ఎంత ఎర్రగయినయో? అనుకుంటూ పశువుల పాకలోనికి వెళ్ళింది.

మొకంమీద నీల్లుచల్లుకొని ఇంట్ల కొచ్చాడు.

" నాకు సావురాదవ్వా ! నేను దచ్చన్న దేశాలు పట్టుక తిరుగుడేంది .... పోనీయ్ సంసారమవ్వను కుక్కల్...." చంద్రయ్య గొంతు వనికింది - మాట తడబడ్డది....

"నీ అనువం మంచిదిగాదుబిడ్డా !" నర్సమ్మ నిట్టూర్చింది....

తల్లి అన్నంటె ఎందుకు ప్రేమగా ఉంటుందో మొగిలికి అర్థమౌతోంది. అన్న నెలానెలా నాలుగు వందలరూపాలు పంపుతడు - ఆ డబ్బుతో భూములు, బాగలు కొనాలని ఆరాటం....

మొగిలి ఒక్క మాటన్నా మాట్లాడకుండా తనకోసం, కట్టిన కంది తడకల 'అర్ర' లకి పోయి మంచంలో పడిపోయాడు. మరోపదినిమిషాలల్లో మొగిలి గుర్రు కొట్టడం విన్పించింది.... బువ్వలు దినేయాల్లకు సావిత్రి గుసగుసగా మొగిలిని ఊపింది. ఎంతలేపినాసాధ్యంకాలేదు, చేసేదేమిలేక, కంచుతలెలో అన్నంపెట్టి పక్కనే మంచినీళ్ళు, కూరగిన్నెపెట్టి అత్తతోపాటు పెరడి కాడికి వెళ్ళింది.

"గాలనికి సిగ్గుశెరంలేదు - పోరగండ్లు, సంసారం ఇడిసిపెట్టి సంగమో సంగమని తిరుగుతుండు - ఊళ్లె పోరగండ్ల సెడగొడుతండు - పోలీసోల్లకన్న తెలివిలేదు. గీ ఎందునెక్క లేనిపోరగండ్ల తాపతాపకు బట్టుకపోతరు గని, అసలోల్ని పట్టుకపోరు - లడు ఈల్లకు దొరుకడు. ఏమి నాశినగాలమచ్చిపడి - పొల్లగండ్లు మునుపటి తీర్గలేదు. కయికిలిగాళ్ల, మాదిగోళ్ల, మన్నేలు - ఎవలు మునుపటితీర్గలేరు-తానాలు, బొట్లు, దూసిముడిసికొప్పు బెట్టడాలు - దొత్తిలకు సెడిపోతండ్లు - నాకు

సావురాదవ్వ - మా అవ్వముండ ఏం రాజ్జెంధారపోసింది. 'ఈయినె' కట్టుకున్న కాన్నుంచి కంటినిండ నిదురపోకపోతి, కడుపునిండ తిన్నదిలేకపాయె - చేసి చేసి నా బొక్కలు రెక్కలు తెల్లవడ్డయి - రగుతం కలికల్లై పోయింది.... కడుపు బంటింది నస్సికేందనిరి. ఏంభాగ్గెం - కొడుకులు ఎడ్లకెడ్లయిరి - కోడండ్లచ్చిరి - అవ్వా నీ కట్టం తీసేత్తమని ఒక్కలనక పేయిరి - నర్సిముండ, మన్నుల మునిగి మున నాశిడమై పోవట్టె - పెరడిలో మట్టిపెళ్లలను చిన్నగా నలుగగొడుతూ చిత్తకాత్తై ఎంత చిత్తుబొత్తుసేయంగ నర్సమ్మ సదువుతనే ఉన్నది. ఆ మాటలు ఎవలకు చెప్తు తున్నదో? సావిత్రికి అర్థం కాలేదు.

"ఇయ్యాల్లరేపు పడును పోరగండ్లు ఎంత ఖైరతు గుంటండ్లు - మొగన్ని మెతుకు మింగ నియ్యకుంట జేత్తండ్లు - నాకోడండ్లున్నరు. మరి మీయవ్వ గంతగనం ఏడుత్తంది - ఏమయ్యా గిదినీకు బనావుగాదు. దేశాలు దిరుగ దలుసుకుంటె మరి నన్నెందుకు జేసుకున్నవ్ - గిట్లజేత్తె నేనూరుకోను-అంటండ్లా? అత్తముందే ఉన్నది గదా! కుక్కతీర్గ మొరగడానికి? ఎవలింటే ఏ మున్నది - నర్సిముండ పుటుకే మంచిధిగాదు - నర్సిముండరాతే మంచిదిగాదు." నర్సమ్మ బాయిగడ్డమీది రేగుచెట్టు కిందికి నడిచి ఉరిమి ఉరిమి కురిసిన మేఘంలా మొఖాన కొంగు బెట్టుకొని ఏడ్వ సాగింది.

అప్పటికి పొద్దువాలిపోయింది....తాలుకాలోని షావుకారికి ఒప్పిన జొన్నలు కొలిసి సాంభయ్య ముఖమంతా మాడ్చుకొని పెరడి దగ్గరికి వచ్చిండు.

"పంటసేన్ల శోకాలు బెట్టకే - నీశోకమే ముంగట బడ్తంది - వానవ్వాల కొడుకులెందుకుపుట్టి -సావనా? జొన్నలొప్పి నెలైనా సత్తావంటె తీరక పాయె షావుకారి లంజెకొడుకు అన్నప్పుడు యియ్యకపోలివి ధరదిగింవని పల్లకు (క్వింటల్) ఇరువై రూపాలు కోసుకున్నడు. నూటయాభై రూపాలు ఉద్దునూర్తంగ పోయినయ్."
సాంభయ్య కోపాన్నంత వెల్లగక్కిండు.

సావిత్రి ఏమని చెప్పగలదు? ఆమెకిదంతా పెద్దచిక్కు బిడ్డ కంటెలాగున్నది- తన మొగడు తెలివిమంతుడని తెలుసు - సదుకున్నోడని తెలుసు - మొగడు నాగలి దున్నంగ - ఒంటరిగా ఉన్నప్పుడు గొంతెత్తి పాడటం తెలుసు - మందిలో డప్పు కొట్టుకుంట కుడిసెయ్యి ఇసురుకుంట ఆనాడు మూడు పానాదుల కాడ పాడటం ఇప్పటికిగుర్తే - తనతోటి ఆడోల్లు తన మొగనిగురించి చెప్పే మెచ్చుకోలుమాటలు....

ఇవ్వన్నీ ఒకపక్క, మరోపక్క అత్తమామ తిట్లు - ఏదినిజం - తన భర్త చేస్తున్న నేరమేమిటి ? పని చేసుక బతుకాలె - చిన్నతనంనుంచి తనఅవ్వ, అయ్య చెప్పిన మాట - కన్నవారికి కట్టుకున్నవారికి పేరుదేవాలె - ఏం పేరుదేవాలె - అత్తతనను తిడుతదేం ? కన్నతల్లి మాటనే ఖాతరు చేయనోడు నా మాట ఖాతరెట్లా చేస్తాడు. తను వద్దు - అత్తకు, మామకు కోపంకలిగియ్యకు అని మొగిలికి చెప్పగలదా ? అక్కడికి జైలు నుంచి మొగిలి తిరిగొచ్చినప్పుడు ఎడ్లకొట్టలో భయంభయంగా అనిచూసింది.

"నేను కోపం కలిగిత్తన్ననా ? ఆళ్ళే తెచ్చుకుంటన్నరా ?"

తనుతికమక పడ్డది. "ఏమో నాకేడ తెలుస్తది - ఊకే మీయవ్వనిన్ను తిడితె నాకెందుకో మంచిగని పియ్యదు."

మొగిలినవ్వి "నిజమే సావిత్రి - మరినేనేం జెయ్యాలె చెప్పు - మన్నుల పురుగుతీర్గ బతుకు తెమావోల్లకు మంచి గుంటది - ఇయ్యాల్ల రేపు కాలం ఎట్లున్నది నీకు కన్పత్తలేదా ? అటుసూడు సావిత్రి" అన్నాడు.

తను దిక్కులు చూసింది - తనభుజంమీద చెయ్యేసి చూపించిండు - జగ్గయ్య పెరట్ల పోశమ్మ రాలచెట్టు గాలికి ఊగుతోంది- ఆ చెట్టుకు పై భాగంలో గహొకటి తిరుగుతోంది.

"నాకేలపెట్టుకు ఒక్క ఆకన్నాగాలికి ఊగకుంట ఊకున్నదా చెప్పు ?"

"గాలత్తె ఎట్లుంటది ?"

"సావిత్రి మనమందరం ఈ కొత్తగాలికి రెపరెపలాడక తప్పుతలేదు - నాకు బాగ చెప్పత్తలేదు సావిత్రి."

"ఏమోనయ్యా....నువ్వు పోతే నాత్రినాకు దుఃఖమాగది". గొంతు గురగుర లాడింది....

"నాకు ఎవ్వలను కష్ట పెట్టాలనిలేదు సావిత్రి - కని నాకేందో పిచ్చిలేసినట్టు గున్నది." అన్నాడు....

అవ్వన్నీ యాదికొచ్చినయ్. "అయినె" మునుపటితీర్గ ఉంటె మంచిగుండు- తినుకుంట తినుకుంటనే తరెల గీతలు గీత్తడు - ఏసినంతే తిని కానకపోతె చెయ్యి కడుక్కొనిపోతడు....మాట్లాడుకుంట మాట్లాడుకుంటనే టక్కునమూగ మొద్దైపోతడు- మునుపు తల్లి తిడితె తనులిష్టేవాడు - మరీకోపమత్తె సేతుల ఏదుంటె అదిఇసిరి కొట్టె

బోడు - ఇప్పుడు ఎవలేమన్న మిలమిల సూసుకుంట కూసుంటదేకాని ఏపనికిరాడు. మరీఎక్కువైతె లేసిపోతున్నడు.

ఎందుకో రానురాను మొగిలి గురించి తనకు తెలువకుంటపోతుంది - ఆరం దినాలు నీడికిపోయినట్టు - తిండి తిన్నడో లేదో ? మంచంకాడ పెట్టొచ్చిన - లేసింతో లేదో ? కూరగంజు కన్పత్తదా ?

సావిత్రి గొడ్డలి మర్రేసి పెళ్లలు కొడుతూనే ఉన్నది. ఆమె ముఖం ఎంతకు కందిపోయింది. కుంకుంబొట్టు నుదురుమీద చెమటకు చెదిరి ఎండిపోయింది. మోకాళ్ల దాకా తెల్లగా గీతలుపడ్డాయి. దండ చేతులు సలుపుతున్నాయి - అరిచేతులు బొగ్గలు చిట్లి నెత్తురు పేరుకపోయి భగభగ మండుతున్నాయి ....

పొద్దుబారెడున్నదనగా అత్తాకోడళ్లు గొడ్డండ్లు భుజాల మీద పెట్టుకొని - నీళ్ల చెంబు నెత్తిమీద పెట్టుకొని ఇంటిదారి పట్టారు .... సాయంత్రపుగాలి చల్లగా హాయిగా ఉన్నది....

దారివెంట వెంపలి చెట్లల్లోనో, రేగుతుప్పల్లోనో, చెవుకాయ చెట్లల్లోనో పూరేడు పిట్టలు 'కుర్రు' మంటున్నాయి .... దూరంగా బిచ్చగాళ్ల ఎల్లడు 'ఉరులు' పెట్టిహాటికోసం తిరుగుతండు .... కాళ్ళకింద మెత్తగా ఒత్తుగాపెరిగిన గడ్డి. తొవ్వ కటుఇటూ "నల్లోలం గడ్డిపూలు" పసుపుపచ్చగా - ఊరుదగ్గరవుతున్నాకొద్ది బొడ్డెమ్మ నాడుతూ చప్పట్లు కొడుతూ ఆడపిల్లలు పాటలు పాడుతున్నారు. సావిత్రికి మతికే లేదు. దసరపండుగ దగ్గరె వచ్చిందని - అంతలోనే ఆమెకు చెప్పరానంత దుఃఖం కలిగింది. ఇంకా పండుక్కు తీసుకుపోను తల్లిగారు ఎవలు రాకనేపోయిరి - అన్నగా దన్న, నాయిన్నన్న - ఓ వారంరోజులు ఈగడబిడలకు దూరంగా పోతే బాగుండునని సావిత్రి అనుకున్నది.

పచ్చగా బీర కాకరపువ్వులు ఊళ్లెపళ్లమీద విరగబూసున్నాయి -

ఇద్దరు ఇల్లు చేరుకునే కన్న ముందే పెద్దమామ ఇల్లొచ్చింది, వాళ్లకొంచెం వీళ్ళకన్న స్థితి పరాలే - ఏదోవాళ్లింట్లో కొత్తగా పిల్లలు తిరుగుతున్నారు - సావిత్రి తొంగిచూసింది - పెద్దబావ పిల్లలు వచ్చినట్టున్నారు.

"అయ్యోసెల్లె బావున్నవా?" కురచగా బామనఛాయగా ఉన్న ఒకామె వాకిట్లో

కొచ్చి సావిత్రిని నవ్వుతూ పలకరించి ముఖంమాడ్చుకొని ముందుపోతున్న నర్సమ్మను "చిన్నత్తా బావున్నరా?" అన్నది-కురుబామె.

"ఆఁ బాగనే ఉన్నంబిడ్డా!" అనుకుంట ఆగకుంటానే ఇంట్లోకి పోయింది -

పాలివాళ్ళ కొట్లాటలు ఏండ్లతరబడి వస్తున్నయ్ సావిత్రికి ఆ సంగతి తెలుసు- అయినా "మీరంత బాగున్నరాఅక్కా! బావచ్చిందా?" సావిత్రి నవ్వటానికి ప్రయత్నం చేస్తూ -

"ఆఁ అందరంవచ్చినం - పిల్లలకు దసుర సెలవులిచ్చారు" అన్నది....

సావిత్రి అక్కకట్టుబొట్టు పరిశీలనగా చూసింది - బస్తీలల్ల ఉండెటోల్లు 'గోల్మాలేసి, చీరకట్టుకుంటె ఎల్తది - పొలాలల్ల పనిచేసేటోల్లకుగోచి పెట్టుకోకుంటె పని ఎల్లది — అనుకున్నది.

"సావిత్రి - ఏడిపనాడున్నది - " అత్తకేకేసింది....

నర్సమ్మకు ఈ కుటుంబమంటే కోపం - ముఖ్యంగా ఈబామన ఆకామంటె కోపం - మరోపక్క ఆమెమాట తీరుకు "పిల్లమంచిదేనని" ఆమెది కులంగాదని పెండ్లి గూడ బాపనోన్ని పిలిసికాకుండ - బాజే బజంత్రీలు లేకుండ, కట్నకానుకలు లేకుండ - దండలు మార్చుకొని సేసుకున్నరట - గతిలేనమ్మకు మతిలేని మొగడంట! ఇంటా వంటా లేని పెండ్లి - తమ అంశానికి నామర్దా తెచ్చిండ్లు - అని కోపం, బావ ఎక్కడ, ఏం ఉద్యోగం చేస్తడో సావిత్రికి బాగా తెలువదు. కాని బావ "మంచోడని"- సూసినప్పుడే అనుకున్నది....

ఈ విచారాలన్ని ఒదిలిపెట్టి ఇల్లు చేరుకునేసరికి ఇల్లంత అంగడంగడున్నది - దుకసాటుకు సూసింది - మొగిలిసేడు, అన్నంతిని - పల్లెంకడిగి పెట్టిండు - పల్లెం, కడిగినందుకు సావిత్రి నొచ్చుకున్నది .... మరింత ఆగకుండా కొంగునడుములో దోపుకొని ఇంటిపనికి సిద్ధ పడ్డది -

ఎడ్లకొట్టంలో తమబావ చంద్రయ్య - మామ కలిసి ఏదో చిన్నగా మాట్లాడు కుంటున్నారు. మామ గడంచిలో కూర్చున్నాడు - బావ 'గెల్లాంచ' మీద కూకున్నాడు -

ం ం ం

మొగిలి గీకల లుంగీ మోకాళ్ళదాకా ఎగగట్టాడు. ఉతికిన అంగీ - నున్నగా ట్లయింసుకున్న గడ్డం - (ఆ సాయంత్రమే గీయించుకున్నాడు) మెడకు గీశలతువ్వాల చుట్టుకొన్నాడు - అట్లాఅతను ఇంట్లో అడుగు పెట్టి ఆశ్చర్యపడ్డాడు,

మంచమేసి దానిమీద శద్దరు పరుచున్నది-దానిమీద పెదనాయన్న కొడుకు లక్ష్మి నారాయణ కూర్చున్నాడు - లక్ష్మినారాయణ అంటే మొగిలికి గౌరవం - అతని పక్కనే తన అన్న చంద్రయ్య మంచం పట్టెమీద కూర్చున్నాడు - ఆమంచం వెనుక ఇంకొక మంచంలో గొంతుదాకా గొంగడి కప్పుకొని సాంభయ్య జ్వరమొచ్చి పడుకున్నాడు - జ్వరం ఆ సాయంత్రం పూటేవొచ్చింది- అమంచానికి కొంచెం ఎడంగా నర్సమ్మ లక్ష్మినారాయణకేసి మొఖంచేసి కూర్చున్నది. ఎడంచేతిలో నశ్యం డబ్బ, కుడిచేతిలో చిటికెడు నశ్యం, కంచి తడుక సాటుకు ఒక్క మొఖం మాత్రమే సగం కనిపించే టట్లు సావిత్రి నిలబడివున్నది.

తను ఇంట్లోకి అడుగు పెట్టడంతోటే మాటలు బందయినయ్.... అంటే తనగురించే వీళ్లంతా కూర్చున్నారని, తనకు అన్నమీద ఇష్టమని, తనకిష్టం లేకున్నా అవ్వలక్ష్మినారాణన్నను తీసుకొచ్చిందని మొగిలికి అర్థమయ్యింది.

"మొగిలి, ఇట్లా వొచ్చికూర్చోరా?" లక్ష్మి నారాయణ-

"ఎప్పుడొచ్చిండ్లన్నా?" అన్నాడు శాంతంగా, తనూ ఓగడంచ తెచ్చుకొని వాల్చుకొని ముందుకూర్చుంటూ మొగిలి.

"పగలు" లక్ష్మినారాయణ-

కాసేపు ఆమాటా ఈమాట అయిన తరువాత - లక్ష్మినారాయణ కంకీన తెచ్చి ముందు పెట్టిచ్చాడు.

"వారీ మొగిలి." లక్ష్మి నారాయణ గొంతు మృదువుగా-

"మననాయిన్నలు పంచుకోంగ తలా ఓముక్రతుండ సోలెడు గక్కచ్చింది. రాళ్లు, తుప్పలు తప్ప కర్రమొలువని భూమొచ్చింది. అండ్ల నెత్తురే కలిపిండ్లో - దొక్కలే కలిపిండ్లో ఇయ్యాల్ల మనం కాసంత కడుపుకు దింటన్నం - సిన్ని, సిన్నాయినెనుక మొగోని తీర్గ ఎద్దోలెపని జేసింది- గిప్పుడు ఆళ్ల జవసత్వాలుడిగినయ్- పాతగా కుంటయ్యింది. ఏదో అంగపడి సేసుకబతుకాలె-ఆళ్లను ఎందుకు గొడగొడ సేడ్పిత్తన్నవ్రా?" అన్నాడు.

"నీ బాంచెన్ బిడ్డ - సచ్చినీకడుపున పుడుత-గట్లడుగు- ఎంతకాలం కొట్టి పోసుకోవాలె బిడ్డా! మీకండ్ల ముంగట-మీనాయిన్న నాలుగుమాటలు చెలిసినోడుగన్క మీలవ్వకు అంత బలువు పనిపడలే-మరినేనో? తిని తినక-కొడుకులు కొడుకోలో అని సాదుకత్తి-ఓలయినె బట్టగడితినా? ఓఅయినె రయికె తొడిగితినా? అన్ని మీమీదనే.

పెడితె. గిప్పుడు సాకగా కుంటయ్యింది- అగో మీచిన్నాయినె జూడు. మంచం బట్టిండు. దగ్గు తగ్గకపాయె. ఇంకానాగలి పొంట పోంది ఎల్లదాయె."

"మధ్యలోనే సాంభయ్య గునుసుకుంట" నను, ననరాదే నీ నోరుతోనే ఆడు అగమైపోతుండు."

"నీనోరు పడిపోను. అందరు నన్నే అనుండ్రి" నర్సమ్మ ముక్కు చీదింది.

చంద్రయ్య "మీరూకోండ్లి-అన్నయుంగట చెప్పరా? ఎవుసాయం జేత్తవా? గట్లనే తగ్గుతవా? నీమీన నమ్మకం బెట్టుకుంటె నాగటిమీన కానెత్తెత్తివి-గిప్పుడు జెల్ల బడితె తిరిగి తిరిగి పదిహేనూర్లు ఖర్చు పెట్టిత్తివి. మనకు సంకలేవడితె ధార్వం కండ్ల బడ్తది-గుండెగాళ్ళనే సేపని-జెయ్యపడ్తివి."

"నీకెర్క లేకపోతే నోరుమూసుకోవుటం మంచిది. నువ్వు దాయిల దిగు తన్నవేగన్క-పైసలు సంపాయించన్నది. గటక్కటి దప్పనీకు మరేది కన్పిత్తకేక-నన్నంటె అనుగని సంగపోల్ల గుండెగాళ్ళంటె మంచిదిగాదు." ముగిలి ముఖం ఎర్రబడ్డది.

కాసేపు ఎవరి బాధ వాళ్ళే చెప్పుకున్నారు. తీవ్రమైన గొంతులతో మొదలేసి-ఏడుపు గొంతులలో ముగించారు. అందరికి మొగిలే కారణం అన్నట్లు మాట్లాడారు. సాంభయ్య ఈడు చెయ్యబట్టి జూరిండ్లకు నూటయాభై పైవులు కాలిగాడు ఎగదొచ్చిం దన్నాడు. ఇట్లాంటోడు మరి పెండ్లెందుకు చేసుకున్నాడన్నారు. మాకే వీడున్నానుల్ల గల్సిపోతడన్నారు. చిన్న చిన్నాయినె తీర్గ దేశాలు బట్టి పిచ్చోడై ఎందుగ్గాకుంట సత్తడన్నరు.... సావపడ్డదన్నరు.... ఇట్లా చాలాఅన్నారు....

లక్ష్మినారాయణ అందరు మాట్లాడిన తరువాత-

"చిన్నా గిది మీ ఒక్క కుటుంబంలోని గడబిడె అనుకుంటండ్లా? మనిషి స్వతాగా ఎవ్వడు చెడ్డవాడుకాదు- ఆడుతోటోల్లతోని కలిసి బతికేటప్పుడెగియ్యన్ని. ఇది అన్ని ఊళ్ళల్ల, అన్ని కుటుంబాలల్ల జర్గుతంది-కుటుంబాలు కమ్మరాం తీర్గ కుతకుత లాడు తన్నయ్-మన చంద్రయ్య ఊరిడిసి బొగ్గు బాయిల కెందుకుబోయిండు? మొగిలి చెయ్య బట్టా? కుటుంబం పెరిగి సాలక - మరి సాలుదెందుకు లేదు? సాలినంత భూమి లేక-భూమిబాయిలచేసిన నౌకరి పైసలతోని సంపాయించుకోవల్నని చంద్రన్న అనుకొంటండు. -వారీ చంద్రన్న నువ్వు మూడేండ్ల బట్టి ఎంతెడకేసినవ్ర - అట్ల కట్టునోన్నివి బల్ల

సెక్కవై పోయినవ్-మరదలును దవఖాన్ల సుట్టుతిప్పేటందుకే సరిపోయింది. మొగిలి అట్ల గాదు కొట్లాడి భూమి గలుసుకుంటనంటండు-బొనురా మొగిలి—ఇంక సక్కగలేదా? సాంభనాయినేమొ మొగిలి చెయ్యబట్టె షావుకారి జొన్నలధర దించిండనుకుంటండు మనం పండించిన పంటకు తగిన ధర వడ్డదా? ఎప్పుడన్న మొగిలి లేనప్పుడునుత - కనుక వీటన్నిటికి మూలం ఎకర్నో ఎతుకులాటలనే గీ గంచర గోళ మంతా - కొట్లా టలంత-"లక్ష్మీనారాయణ నిట్టూర్చి - తను అసెటోదారి తప్పి పోతున్నానని తెలుసుకొని "నిన్ని ఆనికి ఆలోచించే వయసొచ్చింది. అన్నిటికన్నా ముఖ్యంగాభార్యొచ్చింది.... నువ్వుమునుపటి తీర్గ అనకు వానీ మొగిలి — అదిమన అవ్వరా! తను కడుపు నూడ్సుకొని నీనోటికి గడుక ముద్దలందిచ్చిన తల్లిరా! నీ ఉచ్చ, ఏర్గడు కడిగి నిన్ను పెంచి పెద్ద జేసిన తల్లి, అన్ని తెలిసినోనివి-ఓపికబట్టాలె-అవ్వను ఏమీ అనద్దు."

"నేను మా అంబ-మావోడు వెర్రుడుగాడు-కంత్లాడుకండు-నాకేమొ జిగిసచ్చె-పనిజేత్తె వాడు నలుగురిపెట్టు చేత్తడు - నా కెక్కలేదా? తాగుడు, సిల్లర పనులు చెయ్యడు - అద్దుబిడ్డా కాలం మంచిగలేదు—నేనేవి మంచిదేగని -" సాంభయ్యకు చెప్పరాక ఊకున్నాడు -

"నాకు ఇయ్యన్ని చెల్సి పిచ్చలేపినట్టున్నదన్నా" మొగిలి రెండు చేతులతో ముఖం కప్పుకొని వెక్కి వెక్కి ఏడ్చాడు.

ఎందుకో చంద్రయ్య "వద్దురా? తమ్మి" అనుకుంట తనూ ఏడ్చాడు ....

నర్సమ్మ అంతు పొంతూలేకుంట ఏదో ఏదేదో పదురుతూ ప్రపంచాన్ని-తన బిడ్డల బాధపెట్టిన దుష్టప్రపంచాన్ని తిట్టి, తను ఏడ్చింది.

సావిత్రి వెక్కి వెక్కి ఏడ్చింది ....

"తుఫానుగాలికి తల్లి మొదలే వూగుతోంది.... ఆకులు అల్లల్లాడిపోతున్నాయి." లక్ష్మీనారాయణ గొనుగుతూ లేచిపోయాడు. ఆయనకు కళ్ళల్లో నీళ్ళూరినయ్. ఒక్క ఏడువనిది సాంభయ్య మాత్రమే .... అతను గడ్డకట్టిపోయాడు. ఊహ తెలిసె తెలియని వయసులో - గత్తరసోకి తండ్రి చనిపోవడం, అన్న పదేండ్ల అన్న అప్పుడు కష్టకాలాలకు ఎదురొడ్డి తమందరిని సాదుకరావడం - తన అన్న ప్రతిరూపం లక్ష్మీనారాయణలో చూశాడు.

రాత్రి భోజనాలకులేచారు. ఈ మధ్యలో అందరుకలిసి తిన్నరోజులు అరుదు. నర్సమ్మ వడ్డించింది. సాంభయ్య వెయ్యబోయే పంటల గురించి, భూమి కొనడం గురించి మాట్లాడుతున్నాడు. తాము యెంత గరీబుతనం నుంచి వచ్చింది చెప్పుకొచ్చాడు. అందరు బడబడ వాగేస్తున్నారు. ఒక్క మొగిలి అందరి ముఖాలమీద వెలిగే సంతోషాన్ని చూస్తూతిన్నాడు. గడగడ ఉరిమి వర్షం కురిసి అంతలోనే మబ్బులన్ని

తొలగిపోయి ఆకాశం తేటతెల్లమై పోయినట్లుగా ఉన్నది.

అందరు తినేసరికి రాత్రి ముదిరిపోయింది. మొగిలి బయటకొచ్చాడు. గాలి ప్రారంభమయ్యింది. చెట్లు గలగల శబ్దంచేస్తూ శివమెత్తినట్లుగా ఊగుతున్నాయి... కరెంటుతీగలు గాలికి "జువ్వు"మని మోతపెడుతున్నాయి. అంతదాకా జెగ జెగలాడిన చుక్కలను కప్పేస్తూ మబ్బులు కమ్ముకొచ్చాయి.

సాంబయ్య మొగిలి వెనుక నిలబడి "ఆనచ్చేటట్టున్నది - జొన్న దుక్కులు ఎనుకయ్యేటట్టున్నది - జొన్నపోతలు ఎన్నైతయెమొ ?"

మొగిలి ఆ గాలిలోనే ఎడ్ల కొట్టంకేసి నడిచాడు. ఎడ్లకొట్టం గుడిసె గాలికి కిరకిరలాడుతోంది. చాలాసేపు "బొంయ్యి"మంటూ వీచే గాలిలో - టపటపా కొట్టు. కొనే జగ్గయ్య పెరట్ల రాలాకుల శబ్దం వింటూ కూర్చున్నాడు. రాయలింగు బిడ్డ ఏసరాయక్క కాబోలు ఏడుస్తోంది.

మొగిలి ఎంతసేపు అట్లా కూర్చున్నాడో తెలియదు. తలుపులు తెరిచేవున్నాయి. ఇంట్ల అందరు నిద్రలో మునిగిపోయారు. తనకోసం కట్టిన కందితడకల అర్రలకు వెళ్ళాడు. సావిత్రి బాగా అలసిపోయి అడ్డవిడ్డంగా పడి నిద్రపోతోంది. తలుపులు మూసి సావిత్రికి మెలకువ రాకుండా పక్కకు పడుకున్నాడు. కందిన వెలుగులో సావిత్రి ఎండకు వడలిపోయిన లేత ముఖంలోకి చూస్తు ఉండిపోయాడు.

బయట యింకా గాలి మోతపెడుతూ ఉన్నది. గాలికి చింతాకులు చాలా గమ్మత్తుగా మోగుతున్నాయి ....

మొగిలికి నిద్ర పట్టడం లేదు. వెంకట్రాజయ్య మామిడితోట - ఆ తోటలో గాలయ్య మాటలు. తనలాగే వచ్చినవాళ్ళు- తనలాగేవచ్చినవాళ్ళు- తనెప్పుడు ఇది వరకు చూడని పెద్దపెద్ద కళ్ళ ముసలాయన మాటలు.... పదేపదే....కళ్ళు మూసుకున్నా తెరుచుకున్నాకూడా ....

రాత్రి ఎంతయ్యిందో ? పాపం సావిత్రి-బతుకంతా కష్టంతప్ప సుఖమెరుగని తల్లి. తండ్రి,భూమి కొనాలనే ఆలోచనతో బొగ్గు గనుల్లకు పోయి అన్న—ఇల్లు, సంసారం, ఎండ, వాన, చలి, ఎడ్లు, భూమి పంటలు....

తను ఎటి పోతున్నాడు ? ఈ గడ్డ మీదనే- ఈ నేలకోసమే....ఇక్కడే ఉంటాడు— దీనికోసమే పోరాడుతాడు.

మొగిలి చప్పుడు కాకుండా లేచాడు .... తన బట్టలు సదురుకున్నాడు. చప్పుడు కాకుండా తలుపులు తీశాడు.... వర్షం సన్నగా మొదలయ్యింది. గాలి ఇంకా ఉధృతంగా వీస్తూనే ఉన్నది. వాకిట్లోకి వెళ్ళి వెనక్కి తిరిగి చూసి- తలవంచుకొని వడివడిగా గాలిలో చీకట్లో కలిసిపోయాడు.

వర్షం పెద్దదయ్యింది ....గాలి ఆగింది....

o o o

పుస్తక సమీక్ష

స్త్రీ విముక్తి ఉద్యమ వేగుచుక్క "మా కథ"

చంద్రశేఖర్ బి.

దక్షిణ అమెరికా ఖండంలోని బొలీవియాలో బలమైన సమరశీల గని కార్మికోద్యమం, దాన్ని ఆవరించుకుని గొప్ప మహిళా వుద్యమం వున్నాయి. సైగ్లో-20, సోకావన్, కటావి, పాటినో, మిరాఫ్లోర్స్ గనులన్ని కలిపిన పెద్ద గని కేంద్రానికి గొప్ప విప్లవానుభవం వుంది. ఈ గని కార్మికుల వారికుటుంబాల దుర్భర జీవితాలు వారి న్యాయమైన పోరాటాలు, ప్రభుత్వ దమనకాండ, కార్మికుల, కార్మిక స్త్రీల ప్రతిఘటనా పోరాటాల చరిత్ర ఈ పుస్తకం నిజానికిది దొమితిల బారియోస్‌డి చుంగార అనే 'సైగ్లో-20 గృహిణుల సంఘం' నాయకురాలి స్వీయ అనుభవాల చరిత్ర అయినా పై విషయాలలో రచయిత్రికి వున్న సంబంధాన్ని బట్టి ఈ పుస్తకం 'మాకథ' అయింది. బొలీవియా కార్మికుల, మహిళల పోరాట చరిత్ర కూడా అయింది.

బొలీవియా 59 లక్షల జనాభాగల ఒక చిన్న దేశం. జనాభాలో అధిక సంఖ్యాకులు రైతాంగం. నూటికి 70 మంది భారతదేశంలో లాగే గ్రామాల్లో నివసిస్తారు. తగరం, వెండి, బంగారం, జింక్ గనుల్లో దాదాపు 70 లక్షల మంది కార్మికులు పనిచేస్తారు ఆర్థిక వ్యవస్థకు వచ్చే ఆదాయంలో 60 శాతం ఈ గనులనుండే వస్తుంది. ఆర్థిక వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకున్న కొన్ని బహుళజాతి సంస్థల ద్వారా అమెరికా ఈ దేశ రాజకీయ ఆర్థిక వ్యవస్థను నియంత్రిస్తుంది. స్థూలంగా బొలీవియా నయా వలసదేశం.

బొలీవియా గని కార్మికులు దుర్భరమైన దరిద్రంలో జీవిస్తున్నారు. యజమానులు శ్రమశక్తిని పీల్చి పిప్పి చేయడానికి తోడు, దేశంలో సుదీర్ఘకాలం నుండి అధికారం చెలాయిస్తున్న సైనిక నియంతృత్వం కింద నలిగిపోతుంటారు.

కొద్దిమంది కార్మికులకు కంపెనీ యిచ్చే 'యిల్లు' నాలుగు గజాల వెడల్పు ఐదో, ఆరో గజాలపొడవు వుండే చిన్నగది. ఉదయం, రాత్రి కొంచెం కరంటు, పొడవైన క్యూలలో నిలబడి తెచ్చుకునే పబ్లిక్ పంపు నీళ్లు, రోజు మార్చి రోజు వళ్ళు తడిసే నీరుమాత్రం దొరికే పబ్లిక్ స్నానాల గదులు ఇవి కార్మికులు పొందే

'సుఖాలు'. గని లోతులకు దిగి పనిచేసే ఎనిమిది గంటల కాలంలో తిండి తినడానికి యజమానులు అనుమతించరు. దాంతో ఆకలి మర్చిపోవడానికి కార్మికులు తప్పని సరిగా 'కోకా' ఆకులతో కిళ్ళీలాంటివి నములుతుంటారు. గనుల్లో వెలువడే వాయువు వల్ల ఊపిరితిత్తులకు సోకే 'సిలికోసిస్' వ్యాధి ఎక్కువ మందిని కుంగదీస్తుంది. గని కార్మికుల సగటు ఆయుఃప్రమాణం 30 ఏళ్ళు మాత్రమే.

గని కార్మికులలో అనేక రకాలుంటారు. కంపెనీ జీతాలతో గనిలో పనిచేసే మామూలు కార్మికులు మొదటిరకం. రెండవరకం సిలికోసిస్ జబ్బు వుందని కంపెనీ నుండి తీసివేయబడి తమంతతామే బృందాలుగా పనిచేసి ఖనిజాన్ని తవ్వి కంపెనీకమ్మే 'వెనెరిస్టాలు' (వీరిలో బయట పనేమీ దొరకనివారు కూడా వుంటారు) ఇదివరకు కొంపెనీ తవ్వి వదిలేసిన ప్రాంతాలలో తమ దినిముట్లతో ఖనిజాన్ని తవ్వి తీసి కంపెనీకి అమ్మే 'లాకట్ రియోలు' మూడవరకం. వీరికి కంపెనీ ఖనిజాన్ని తవ్వే ప్రదేశం చూపిస్తుంది. కానీ ఆ ప్రాంతాన్ని వాడుకోవడానికి గల హక్కులో 40 శాతం కంపెనీదే. మురికినీటి నుండి ఖనిజాన్ని కడిగితీసి అమ్మే 'లామెరోలు' నాల్గవరకం.

కార్మికులతో పాటు వారి భార్యలు కూడా అనేక బాధలు అనుభవిస్తుంటారు. భర్తలకు షిఫ్టువారీగా వంటచేసి పెట్టడం, ఇంటిపని, పంపులదగ్గర క్యూలో నిలబడటం, సరుకుల రేషన్ దుకాణాల వద్ద బారుల్లో వేచి వుండటం, భర్తల జీతం సరిపోక సంపాదనకోసం ఇతరపనులు చేయడం. ఇంకా యిలాంటివెన్నో కాక భర్తల పెత్తనం కింద నలిగిపోవడం. కొందరు స్త్రీలు భర్తల మరణంతో గని కార్మికులుగా మారతారు.

ఇక్కడి కార్మికులు చాలా సంఘటితంగా వుంటారు. గని కార్మిక సంఘాలన్ని జాతీయ స్థాయిలో 'బొలీవియా గని కార్మికుల సమాఖ్య' (FSTMB) లో సభ్యురాళ్ళు అలాంటి అనేకరకాల కార్మికుల జాతీయ సమస్యలన్నీ కలిసి 'బొలీవియా కార్మిక సంస్థ' (COB) ఏర్పడింది. కార్మిక సంఘాలతో పాటు కొన్నిచోట్ల గృహిణిల సంఘాలు కూడా బలంగా రూపొందాయి. అయితే గృహిణుల సంఘాలకు జాతీయ సమాఖ్యలేదు. 'సైగ్లో - 20 మహిళా సంఘా'నికి మాత్రం COB లో సభ్యత్వం వుంది. FSTMB గానీ, COB గానీ, గృహిణుల సంఘం గానీ ఏ పార్టీ నాయకత్వంలో నడవని 'స్వతంత్ర' సంఘాలుగా కన్పిస్తాయి.

కార్మికులు తమ కోర్కెల సాధన కోసం సమ్మె చేస్తుంటే వారిపై సైన్యం అనేక సార్లు దమనకాండ జరిపింది అలాగే మహిళలపై కూడా బొలీవియా చరిత్రను పరిశీలిస్తే అక్కడ సైనిక తిరుగుబాట్లు ఎక్కువగా కన్పిస్తాయి. ఎప్పుడూ అస్థిర సైనిక ప్రభుత్వం అధికారంలో వుంటుంది.

1946 లో బొలీవియా దేశాధ్యక్షుడు విల్లారోల్ చంపేయబడ్డాడు. అధికారంలో అప్పటిదాకా వున్న ఉయుని సాయుధదళాలను నిరాయుధంచేసి 1952 ఏప్రిల్ 9 న 'విప్లవ' ప్రభుత్వం అధికారం చేపట్టింది. దీనికి 'రివల్యూషనరీ నేషనలిస్ట్ మూవ్ మెంట్ పార్టీ' (MNR) నాయకత్వం వహించింది. ఇది పెట్టీ బూర్జువా పార్టీ. MNR ప్రభుత్వ అధినేత డాక్టర్ విక్టర్‌పాజ్ ఎస్టెన్ సోరో గనులను జాతీయం చేశానన్నాడు. గని యాజమానులకు నష్టపరిహారం ముట్టజెప్పి కొత్తధనిక వర్గానికి గనులను అప్పజెప్పి ప్రజలకు ద్రోహం చేశాడు.

1964 నవంబర్ 4 న MNR ప్రభుత్వంపై సైనిక తిరుగుబాటు జరిగింది. పాజ్ ఎస్టెన్ సోరో దేశం వదలి పారిపోయాడు. బారియొంటోస్ అధికారంలోకి వచ్చాడు. గద్దె నెక్కాడు. ఏడాది తిరగక ముందే సైల్స్‌సాలినాస్‌ను బారి యొంటోస్ చనిపోయాక అప్పటికి ఉపాధ్యక్షుడిగా వున్న సైల్స్ సాలి నాస్‌ను తన్నితరిమేసి ఒవాండో అధికారంలోకి వచ్చాడు, ఇతను బారి యొంటోస్ ప్రభుత్వంలో కొన్నాళ్ళు వుపాధ్యక్షుడు. తనది 'జాతీయ విప్లవ ప్రభుత్వం'గా ప్రకటించి ఒక ప్రముఖ అమెరికన్ కంపెనీని 'జాతీయం' చేశాడు,

మళ్ళీ 70లో సైనిక తిరుగుబాటు. మూడు సైనిక దళాలతో (నౌకా, కాల్బలం, వైమానిక) కలిపి ముగ్గురు సభ్యుల పాలనా మండలి ఏర్పాటుకు సైనిక తిరుగుబాటు నాయకులు ప్రయత్నించారు. కానీ కార్మిక సంఘాల ప్రతిఘటనవల్ల కార్మికుల ఆమోదంతో జనరల్ తొరెస్ అధికారాన్ని స్వీకరించాడు. ఇతను కొన్ని మంచిపనులు చేశాడని చెప్పుకుంటారు, ప్రముఖమైన మెటిల్డా గనులను జాతీయం చేశాడు. కానీ అప్పటికే వున్న సైన్యంపై విశ్వాసం ప్రకటించి ప్రజలను సాయుధం చేయ నిరాకరించాడు. దాని ఫలితంగా 1971 ఆగస్టులో సైనిక తిరుగుబాటులో తొరెస్ పదవీచ్యుతుడై జనరల్ బన్‌జెర్ అధికారంలోకి వచ్చాడు.

ఒక్క తొరెస్ ప్రభుత్వం తప్ప మిగిలిన అన్ని ప్రభుత్వాలు సహజంగా ప్రజలచేతతీవ్రంగా ద్వేషింపబడినవే. అమెరికా అనుకూలమైనవే (దాదాపు అన్నీ).

బొలీవియాలో రాజకీయ పార్టీలు అనేకం వున్నాయి బొలీవియా సోషలిస్టు పార్టీ, రెవల్యూషనరీ నేషనలిస్టు మూవ్‌మెంట్ (MNR- 1952లో అధికారం చేపట్టిన పార్టీ), పాపులర్ క్రిస్టియన్ మూవ్‌మెంట్ పార్టీ (క్రీస్తు పేరుమీద అనేక మందిని వధించిన నియంత బారియెంటోస్ సొంత పార్టీ) క్రిస్టియన్ డెమొక్రాట్స్ అథెంటిక్ రివ్యూషనరీ పార్టీ (MNR నుండి విడిపోయి ఏర్పడింది.), రెవల్యూషనరీ పార్టీ ఆఫ్ ది నేషనలిస్ట్ (ఇదికూడా MNR నుండి చీలి ఏర్పడిందే) వర్కర్స్ రెవల్యూషనరీ పార్టీ (ట్రాట్స్కీయిస్టుల పార్టీ), సోషలిస్టుపార్టీ, ఇంకా రష్యా చైనాలను అనుసరించే పార్టీలు కొన్ని. ఇవి బొలీవియాలోని రాజకీయ పార్టీలు. ఇవికాక గెరిల్లాల 'నేషనల్ లిబరేషన్ ఆర్మీ' కూడా వుంది.

ప్రపంచ వ్యాప్తంగా **మహిళలు** సంఘాలుగా ఏర్పడటం (అవి ఏ రకం సంఘాలైనప్పటికీ) బూర్జువా ప్రజాస్వామిక విప్లవానంతరం ప్రారంభమయింది. అంతకు పూర్వం ఎంత క్రూరంగా స్త్రీలు రకరకాల దోపిడీలకు గురైనప్పటికీ సంఘటితపడక పోవడానికి ముఖ్య కారణం బలమైన ఫ్యూడల్ వ్యవస్థ, సాంఘిక ఆచార సంప్రదాయత. అయితే మహిళా విముక్తిపుద్యమానికి ఒక శాస్త్రీయ అవగాహనను యిచ్చి సైద్ధాంతిక పునాదిని ఏర్పరచి మహిళా సంఘాలకు పోరాట సంప్రదాయాన్ని ఏర్పరచింది ప్రపంచ కమ్యూనిస్టు వుద్యమం.

మహిళా సంఘాలుగా చలామణి అవుతూ దోపిడీ పాలక వర్గ ప్రయోజనాలను ప్రత్యక్షంగా పరిరక్షించే లేడీ రొటేరియన్‌లు, లేడీ లయన్‌లు, స్త్రీల సమస్యలకు పురుషుణ్ణి ఏకైక కారణంగా చూపి ఉద్యమాన్ని పక్కదోవ పట్టించే ఫెమినిస్టు సంఘాలను వదిలిపెట్టి మనదేశ మహిళా ఉద్యమాన్ని పరిశీలిస్తే తుదకవి వివిధ కమ్యూనిస్టు పార్టీల నాయకత్వాన ఉన్న మహిళా సంఘాలే. రివిజనిస్టు నిర్మాణ పద్ధతులను అప్పకాళం గూడుకట్టుకున్న యురోపియన్ పార్టీల నుండి ప్రధానంగా ఇంగ్లండ్ నుండి దిగుమతి చేసుకున్న భారత కమ్యూనిస్టుపార్టీ మిగతా ప్రజా సంఘాలన్నింటి మాదిరిగానే మహిళా సంఘాలను కూడా కూరగాయలమీద పొట్లు తీయకుండా పండాలనే 'ప్రచారం'లాంటి వాటికే పరిమితం చేసింది. వ్యవస్థను కూలదోసేందుకు జరిగే పోరాటంలో స్త్రీలను సంలీనం చేయకుండా కేవలం ఊరేగింపులు, బహిరంగసభలు ప్రదర్శనలు, పత్రికా ప్రకటనలకు, ఆర్థికవాదానికి మహిళా సంఘాలను బలిపెట్టింది.

(అమధ్య వచ్చిన స్త్రీ సమస్యలను వక్రీకరించిన ఒక తెలుగు సినిమాలో చిత్రించిన పూరేగింపులకు కావల్సిన మహిళలను సప్లయిచేసి, ఒక రివిజనిస్టు మహిళా సంఘం దర్శకుడి కృతజ్ఞతలందుకుంది.)

పైన పేర్కొనబడిన అన్నిరకాల మహిళా సంఘాల కంటే వేరుగా కొంత నిజాయితీతో స్థాపించ బడిన మహిళా సంఘాలు అక్కడకూడా వున్నా వీటి ప్రాబల్యం చాలా తక్కువ. పట్టణాలకు కూడా కాదు కేవలం కొన్ని నగరాలకు పరిమితమైన పెట్టీ బూర్జువా మహిళా సంఘాలే ఇవి. కొందరు చదువుకున్న స్త్రీలకు పరిమితమై సమాజం లోని అట్టడుగు స్త్రీలదగ్గరికి పోలేక పోతున్నాయి. ఒక సెమినారో, ఒక డాక్యుమెంటరీ ఫిల్మో, లేదా వీధినాటకం ద్వారానో, పుస్తకం ద్వారానో ప్రచారం చేసేవిగా వుంటు న్నాయి. సరైన సిద్ధాంత పునాది, కార్మిక వర్గ నాయకత్వం లేక పోవడం, పోరాటాల నుంచి పుద్భవించిన సంఘాలు కాకపోవడం వీటి ప్రధాన బలహీనతలు.

మహిళా రంగంపైన నక్సల్బరి ప్రభావం అంతగా కన్పించదు. మహిళా సంఘాల విషయంలో దేశవ్యాప్తంగా వున్న మార్క్సిస్టు - లెనినిస్టు పార్టీలు, అంతకు ముందున్న 'ప్రజాసంఘాలను ఏర్పరచడమే రివిజనిజం' అన్న అవగాహనను సరి దిద్దుకున్న తర్వాత చేసిన ప్రయత్నాలు కూడా చాలా తక్కువ. కనీసం బలమైన ప్రజాపోరాటాలున్న ప్రాంతాల్లో కూడా ప్రత్యేకంగా స్త్రీలను సంఘటిత పరిచిన సమా చారం లేదు. ఈ విషయంలో ఆయా ప్రాంతాల్లో వుద్యమం నిర్మిస్తున్న విప్లవ పార్టీల వివరణ అవసరం.

ఈ విషయంలో బొలీవియా మహిళా వుద్యమాన్ని మనం జాగ్రత్తగా అధ్య యనం చేసి నేర్చుకోవాల్సిన అవసరం వుంది. ఆ వుద్యమానికి ఎంతో గొప్పపోరాట అనుభవం వుంది.

బొలీవియా మహిళా వుద్యమానికి తలమానికంగా వున్న 'సైగ్లో-20 గృహిణుల సంఘం' 1961లో అనివార్య అవసరాల నుండి, పోరాటం నుండి ఏర్పడిన సమర శీల మహిళా సంఘం. జీతాలు అడిగినందుకు కార్మిక నాయకులు అరెస్టుకాగా 70 మంది స్త్రీలు నిరాహార దీక్ష చేసి వారిని విడిపించుకున్నారు. దాంతో రేకెత్తిన ఆలోచనల ఫలితంగా ఈ సంఘం ఏర్పడింది.

మహిళా సమస్యలకు రకరకాల సంఘాలు చెప్పే అశాస్త్రీయ పరిష్కారాలను కాలదన్ని వ్యవస్థను అంతంచేసే పోరాటంలో స్త్రీలు పాల్గొన్నప్పుడే వారి సమస్యల పరిష్కారానికి స్త్రీవిముక్తికి ప్రాతిపదిక ఏర్పడుతుందని నమ్మి సోషలిజం కోసం జరిగే పోరాటంలో పాల్గొనాలనే అవగాహన కలిగిన సంఘం ఇది. కాబట్టే దీని చరిత్ర సైగ్లో-20 గని కార్మిక పోరాటాలతో పెనవేసుకు పోయింది. గని కార్మిక సంఘాల సమాఖ్యలోను, COBలోను కూడా సభ్యురాలై స్త్రీ విముక్తి కార్మికవర్గ విముక్తితో ముడిపడి వున్నదన్న అవగాహనతో అనేక తక్షణ ఆర్థిక, రాజకీయ సమస్యలపై పోరాటం నడిపించింది. ఈ క్రమంలో అనేక మంది స్త్రీలు అరెస్టయ్యారు. చిత్రహింసలను భరించారు. చిత్రహింసల వల్ల కొందరికి గర్భస్రావాలైనై. కొందరి భర్తలు ప్రవాసం పాలయ్యారు. కొందరు మహిళలుకాల్పుల్లో మరణించారు. అయినా మొక్కవోని దీక్షతో పోరాటంలో రాటు దేలిన సంఘం ఈ 'సైగ్లో-20 గృహిణుల సంఘం'

ఒకసారి కారోకారో అనే చోట నిర్బంధాల నిషేధాల మధ్య జరిగిన గని కార్మిక మహాసభలో జీతాల పెంపుదలకోసం, పనిగంటలు తగ్గించమని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మె చేయాలని నిర్ణయించారు. దీనికి గృహిణుల సంఘం మద్దతు ప్రకటించింది.

వెంటనే ప్రభుత్వం విరుచుకుపడి గనికార్మిక సమాఖ్య సభ్యులందర్నీ అరెస్టుచేసి, గని కార్మికుల రేడియో స్టేషన్లపై దాడి చేసింది. సైన్యం గనిలోకి ప్రవేశించి కారోకారో మహాసభకు హాజరైన వారందరినీ బయటికి తరిమేసింది. కొందరిని లాపాజ్ జైలుకు, మరికొందరిని చిలీకి ప్రవాసం పంపారు.

అదే సమయంలో అంతకు ముందు పదవీచ్యుతుడైన జనరల్ తారెస్‌ను ఎవరో అర్జెంటీనాలో హత్య చేశారు. ఆయన మృతదేహాన్ని బొలీవియాకు తీసుకు రావడానికి బన్‌జెర్ సైనిక ప్రభుత్వం నిరాకరించింది. తారెస్ హత్యకు, మృతదేహం దేశంలోకి ప్రవేశించడానికి ప్రభుత్వం నిరాకరించినందుకు నిరసనగా గని కార్మికులు ప్రదర్శన జరిపారు. సైన్యం ప్రదర్శకులపై దాడిచేసి, కార్మికుల ఇళ్ళమీదపడి బీభత్సం సృష్టించింది సైనికులు రేడియో స్టేషన్‌ను ఆక్రమించుకున్నారన్న విషయం తెలిసిన గని కార్మికులు వెంటనే పని బంద్ చేసి నిరవధిక సమ్మె మొదలైందని ప్రకటించారు. గనిలోతులకు వెళ్ళి సైన్యాన్ని ప్రతిఘటించడానికి సిద్ధపడ్డారు. గృహిణుల

సంఘం గని కార్మికులకవసరమైన ఆహార పదార్థాల సేకరణకు పూనుకొని 'ప్రజా వంటశాలలు' తెరిచింది. స్త్రీలు గని కార్మికశిబిరాలన్నీ తిరిగి తిండి పదార్థాలు సేకరించారు. సమ్మెకు యూనివర్శిటి విద్యార్థులు, ఫ్యాక్టరీ కార్మికులు, రైతులు, ప్రైవేట్ గని కార్మికులు సంఘీభావం తెలియజేశారు.

గని యాజమాన్యం సమ్మెను అనేక రకాల ప్రయత్నించి కూడా విచ్ఛిన్నం చేయలేకపోయింది. చివరకు సరకులదుకాణం తెరచి కార్మికులు సరకులు కొని బాకీపడి అవి తీర్చడానికి పనిలోకి రాకపోతారా అని అనుకుంది. కానీ స్త్రీలు ఆ దుకాణం మీదికి రాళ్ళు విసిరి మూయించారు. పోలీసులు దుకాణం తెరచి బాష్పవాయువు ప్రయోగించి అనేక మందిని అరెస్టు చేశారు.

పోలీసులు గ్రామాలకు వెళ్ళి రైతులను పనిలోకి రమ్మని కొన్ని ఆశలు చూపెట్టారు. కానీ రైతులు సిద్ధపడలేదు. పనిలోకి వెళ్ళిన కొందరు నిరుద్యోగులు పని చేయడం తెలియక చనిపోయారు.

స్త్రీలు సమ్మె విచ్ఛిన్నకులకు వ్యతిరేకంగా మెరుపుదాడి బృందాలుగా ఏర్పడి విచ్ఛిన్నకులను తీసుకువెళ్తున్న ట్రక్కులపై రాళ్ళువిసిరారు. తెల్లవారకముందే గని ప్రవేశద్వారాల దగ్గర నిలబడి విద్రోహులను తీసుకెళ్ళి డబ్బా ఎటూ కదలకుండా పిల్లల్ని పట్టాలమీద నిలబెట్టేవాళ్ళు. గనిలోకి వెళ్ళి వాళ్ళను స్త్రీలు నోటికొచ్చిన తిట్లల్లా తిట్టి అవమానపరిచి వాళ్ళమీదకు రాళ్ళువిసిరేసేవారు. స్త్రీలను అక్కడినుండి చెదర గొట్టడానికి పంపబడ్డ సైనికులు కూడా వాళ్ళను ఏమీ చేయలేక పోయారు. అది చూసిన అధికారులు సైన్యాన్ని మార్చింగ్ సాంగ్ పాడుతూ స్త్రీల మీదకి పొమ్మన్నారు. అప్పుడక్కడ వున్న తల్లులూ, పిల్లలూ "జయజయ జయహే మాతృభూమి బొలీవియా" అనే దేశభక్తి గీతం పాడటం మొదలు పెట్టారు. దాంతో ఆసైనికులు ఏమీ చేయలేక పోయారు. బాష్పవాయు ప్రయోగం, లాఠీ చార్జి చేయమని అధికారులు యిచ్చిన వుత్తర్వులు కూడా పనిచేయకుండా పోయాయి.

ఇక లాభం లేదనుకుని లాపాజ్ నుండి కరాటే శిక్షణ పొందిన మహిళా పోలీసులను తెప్పించి మరుసటిరోజు వుదయం ప్రవేశద్వారం దగ్గర కాపేశారు. అది తెలిసిన స్త్రీలు అక్కడికి వెళ్ళలేదు. దాంతో ఆ ప్రయత్నం కూడా విఫలమైంది. అప్పుడు జైళ్ళలో వున్న కార్మికుల ఇళ్ళమీద దాడులు చేసి ఎన్నో కుటుంబాలను ట్రక్కుల్లో ఎక్కించి ప్రవాసం పంపారు. అప్పుడు జరిగిన హృదయ విదారక దృశ్యాలు చూసి మహిళా పోలీసులు కూడా ఏడ్చారు.

ఆ సమయంలో గృహిణుల సంఘం విడుదలచేసిన ప్రణాళిక కారోకారో డిమాండ్లనన్నింటినీ మళ్ళీ ఓ సారి నొక్కిచెప్పింది. ప్రభుత్వం ఒక గృహిణుల సంఘాన్ని పోటీగాఏర్పరచి కొందరు అమ్ముడుపోయిన మహిళానాయకులను చేర్చింది.

ఇన్ని నిర్బంధాలను కూడా ఎదుర్కొని 29 రోజుల సమ్మె అనంతరం ఆర్థిక పరమైన డిమాండ్స్ ఏదీ సాధించకుండానే కార్మికులు పనిలోకి దిగవలసి వచ్చింది. అయినా ఈ పోరాటం అత్యున్నతమైనది. ఈ పోరాటంలో కార్మికుల పోరాటానికి గృహిణుల సంఘం, భుజం భుజం కలిపి పోరాడే సంప్రదాయం బలపడింది. సైగ్లో - 20 గృహిణుల సంఘం మరింత శక్తివంతమైంది.

ఈ సంఘం నాయకులైన రచయిత్రి దొమితిలా తీవ్ర దారిద్ర్యంలో వున్న ఒక పేదకార్మికుని కూతురుగా పుట్టి, మరో కార్మికుని భార్యగా సైగ్లో - 20 గృహిణుల సంఘంలోచేరి నాయకురాలై అనేకసార్లు నిర్బంధానికి, చిత్రహింసలకు గురైన ఫలితంగా కన్నబిడ్డను పోగొట్టుకొని, కొంతకాలం ప్రవాసజీవితం కూడా గడిపింది. ఐక్యరాజ్యసమితి తరఫున 1974లో బొలీవియాకు వచ్చిన ఒక బ్రెజిలియన్ సినిమా దర్శకురాలి కృషి ఫలితంగా అంతర్జాతీయ మహిళా సంవత్సరం సందర్భంగా 1975లో ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా సమావేశానికి హాజరైంది. అక్కడ, స్త్రీ విమోచనోద్యమం మౌలికంగా ఎలా ప్రజల సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సామాజిక సమస్యతో ముడిపడివుందో వివరిస్తూ ప్రసంగించింది. తన అనుభవాలను విప్పిచెప్పింది. ఎందరినో ప్రభావితంచేసింది. ఫలితంగా తన అనుభవాల కథనంగా మొయిమా వీజర్ సహాయంతో ఈ పుస్తకాన్ని వెలువరించింది. అన్ని విషయాలలోనూ ఆమెఅభిప్రాయంతో మార్క్సిస్టులు ఏకీభవించకపోవచ్చు. "దేవుని ఉనికిని కాదనడం అంటే మనఉనికిని కాదనడమే" అనే భావవాదాన్నిగాని, ట్రాట్స్కీయిస్టుల నుండి రివిజనిస్టులదాకా అందరూ ఏకం కావాలనే నిష్ఫలమయిన ఆదర్శాన్నిగాని ఆమోదించకపోవచ్చు. అయినా ప్రచురణ కర్తలు ప్రకటించిన ఈ అభిప్రాయంతో మనం పూర్తిగా ఏకీభవించవచ్చు. ఆ అనుభూతిని పొందవచ్చు.

"జన జీవితపు కొలిమిలో పుటం పెట్టబడిన ఆ అనుభవాలు చదువుతుంటే ఇది నవలేననిపిస్తుంది. శకలాలు, శకలాలుగా వున్న ఆ కథనం చూసి ఇది అనుభవాల సంపుటే మోననిపిస్తుంది. పుస్తకం మొత్తం దొమితిలా మన ఎదురుగా నిలబడి మాట్లాడుతున్నట్లు నడిచి ఆత్మకథేమో అనిపిస్తుంది. తారీకులు, దస్తావేజుల జోలికి పోకుండానే ముప్పై సంవత్సరాల బొలీవియన్ ప్రజాపోరాట సంప్రదాయాన్ని ఇది మన కళ్ళముందు రూపు కట్టిస్తుంటే చరిత్ర పుస్తకమేమో అనిపిస్తుంది. అంకెలూ, పట్టికలు లేకుండానే ఈ పుస్తకం ఆర్థిక విధానాన్ని వివరిస్తుంటే అర్థశాస్త్ర పుస్తకమేమో అనిపిస్తుంది."

[మాకథ (పోరాట పథంలో బొలీవియా మహిళలు) రచయిత్రి దొమితిలా బారిమోస్ డి చుంగార. అనువాదం ; వేణు వెల : పది రూపాయలు ప్రచురణ హైదరాబాద్ బుక్ట్రస్ట్. హిమాయత్‌నగర్. 3-6-697 హైదరాబాద్ - 29]

ప్రతిస్పందన :

కామ్రేడ్ కైరి గంగారాం చిరునామా

— లక్ష్మి

.... చరిత్రలో వెతకాల్సిన పనిలేదు. అది వర్తమానంగా ముందుకు వచ్చి నిలుస్తుంది. దుష్ప్రచారం చేసే శత్రువు ముఖం మీద చాచి కొట్టి ప్రశ్నిస్తుంది. ఆ ప్రశ్నకి జవాబు చరిత్ర చెబుతుంది. ప్రజలే నిజమైన వీరులు.

1978 జూన్ నెలల్లో ఉప్పుమడిగె, కన్నాపురం, లొత్తునూరు, షాపల్లి మరో ముప్పై గ్రామాల్లో రాడికల్ యువజన సంఘాల్లో చేరిన రైతాంగం భూస్వాముల గుండెల్లో భూకంపం సృష్టించింది. భూస్వామ్యం గుండెలు జారాయి. రైతాంగ పోరాటపు సెగజ్వాలలు భూస్వామ్యం కడుపులో చిచ్చు రగిలించాయి. రేచపల్లి గ్రామానికి వెలుగుదొరికింది. 56 ఏళ్ళ పెద్దమనిషి నాయకత్వంలో నూరుమందిపైగా రైతుకూలీలు రాడికల్ యువజన సంఘం పెట్టుకున్నారు.

1978 సెప్టెంబర్ 18 రాత్రినుండి జగిత్యాల తాలూకా వ్యాప్తంగా కల్లోలిత ప్రాంతాలచట్టం పేరుతో నిర్బంధం విస్సిగ్గుగా విరుచుకుపడింది. దానికి వ్యతిరేకంగా ప్రజల పక్షాననిలిచిన పౌరహక్కుల సంఘం నిర్వాహకులు నవంబర్‌లో జగిత్యాలకు వచ్చారు. ఆసందర్భంగా యూత్‌లీగ్ అధ్యక్షుడు (56 ఏళ్ల), కా. గంగారాం (36 ఏళ్ల) వాళ్ళకక్కడి పరిస్థితులు వివరించారు. రిపోర్టంతా విన్న పౌరహక్కుల సంఘంవారు "మీ సంఘం పేరు ఆర్. వై. ఎల్. యేనా ?" అని అడిగారు. గంగారామే 'కొంత సిగ్గు పడుతూ' అవునని అంగీకారంగా తలూపాడు. (ఏ సంఘమైనా దొరలకు వ్యతిరేకంగా తిరగబడే పేరు కావాలనే రేచపల్లి రైతాంగం ఆ పేరు పెట్టుకున్నారు. 1978 వేసవి కాంపెయిన్‌లో జగిత్యాల తాలూకాలో మొదటిసారిగా ఏర్పడ్డవి, దొరలకు వ్యతిరేకంగా తిరగబడ్డవి ఆర్ వై యల్ సంఘాలే. అందుకే వయసులు ఏవైనా అన్నివూళ్లలోనూ అదేపేరు పెట్టుకున్నారు. తర్వాత క్రమంగా నిర్మాణ సూత్రాల కనుగుణంగానే ప్రజాసంఘాల నిర్మాణం జరిగింది. పౌరహక్కుల సంఘం వాళ్లడిగిన "ఆర్ వై ఎల్ యేనా ?" అనే ప్రశ్నను మేం అనేకసార్లు జ్ఞాపకం చేసుకున్నాం. పౌరహక్కుల సంఘానికి ఈ విషయం గుర్తుందో లేదో గాని గుర్తుంచే మాత్రం అక్కడి సంఘనాయకుడే కామ్రేడ్ కైరి గంగారాం అని ఇప్పుడు గుర్తుకు రావచ్చు).

కామ్రేడ్ కైరి 1980 చివరినుంచి రేచపల్లి పరిసర గ్రామాల్లో 1982 చివరి వరకు పార్టీ కార్యకర్తగా పనిచేశాడు. అతనా ప్రాంతం ప్రజలందరికీ పరిచితుడు. శత్రువుకీ తెలుసు అతనా పరిసరాల్లోకి ఉంటున్నాడని. 1983 చివరివరకూ అందరూ అదే మాట చెప్పుకున్నారు.

అతణ్ని అరెస్టు చేయించాలని రేచపల్లి బడా భూస్వామి పెద్దయ్య (పెద్దదొర) తన పలుకుబడి నంతా ఉపయోగించాడు. అతడికి మద్దతుగా తాలూకా భూస్వాములంతా నిలిచారు. వాళ్ల ప్రాపకంతో బహుమానాలకోసం, ప్రమోషన్లకోసం అప్పటి సిఐ తెగపాట్లు పడ్డాడు. రెండు సంవత్సరాలపాటు భార్యాపిల్లల మొహం గూడా చూసి ఎరగడు. (ఇతడే కామ్రేడ్ బత్తుల బక్కయ్యను కాల్చిచంపాడు.)

1982 ఫిబ్రవరి 1వ తేదీనాడు కామ్రేడ్ కైరిని ఫిబ్రవరి 3వ తారీఖున కాల్చి వేస్తారని మాకు తెలిసింది. తొందరగా వార్త నందించాలని తాపత్రయపడ్డాం. కానీ ఎలా పంపించగలం? అసాధ్యం! యిలాంటి వార్తలు 82, 83 ల్లో కనీసం 20 సార్లైనా వచ్చాయి.

పరిస్థితి తీవ్రంగా వుందని అతనికీ తెల్సు, అందరికీతెల్సు. అందుకే పోలీసులు ఆయనకై ఆయన తిరిగే ఊళ్ళే తిరిగారు. ఆయన మనుషుల్లాగానే తిరిగారు. అతనిలా వేషం సైతం వేసి తిరిగారు. గొర్ల కాపర్లలాగా తిరిగారు. పూసలమ్మే వాళ్ళలా తిరిగారు. కెనాల్ నీళ్ళవాళ్ళమనీ తిరిగారు. బిచ్చగాళ్ళలా తిరిగారు. దొరల ఏజెంట్ల ఇళ్ళల్లో చుట్టాలరూపంలో ఉండి ఎదురుచూశారు. ఐనా కైరి కనిపించలేదు.

అందుకే చేనులు, చెలకలు వెతికారు. తోవలన్నీ తిరిగారు. దారులు వేశారు. కెనాల్ బ్రిడ్జీలవద్ద విడిదివేశారు. అడవుల్ని అదురు పాటుతో అడిగారు. గుబులుగా గుట్టలెక్కి చూశారు. గుండెదడతో గుండ్లన్నీ చుట్టివచ్చారు.

కైరి ఊళ్ళోలేడు, అడవిలో లేడు, చేలల్లోలేడు. మరిదొర లెందుకు పారిపోయి నట్టు? జనం దొరల్ని ఎలా తరిమికొట్టగలుగుతున్నారు? జిల్లా ఎస్పీ ఎగిరిబడ్డాడు. కింది అధికారుల్ని ఎడాపెడా తిట్టాడు. (ఆ తిట్లు రాతలో కూడా చెప్పడం కష్టం) దొరలు సరేసరి. మరిన్ని వేల రూపాయలు అధికార్లకిసమర్పించారు. అంతేకాదు —

దొరలు—పోలీసులు కలిసి వృత్తి నేరస్థుల్నీ, గూండాల్నీ, భూస్వాముల ఏజెంట్లనీ ఒక హంతకముఠగా రూపొందించి తుపాకులు, గొడ్డళ్ళు, తలావర్లు ఇచ్చి గంగారాంను గంగలో కలపాలని వినియోగించారు. వాళ్ళు పోలీసుల్ని మించి తిరిగి వేసారి అలవాటు చొప్పున మరికొన్ని దొంగతనాలు నేరాలుచేసి అలసిపోయారు.

మరికైరి చిరునామా ఎక్కడ ? ఎలాచంపాలి ? ఎవరు చంపగలరు ? ఎవరు నెరవేరుస్తారీ ప్రయత్నం ? రంగంలోకి దిగిన రేతీమూక, దొరల కొడుకులు, మతోన్మాద ఫ్యూడల్ ఫాసిస్టులు బారుతుపాకులు జబ్బలకివేసి గంగారాంను కాల్చి చంపుతామని తిరిగారు. తాగుతూ, తింటూ జల్సాలు కుషీలు— ఊరూర దొరల ఆతిథ్యమాయె !

ఈ ప్రయత్నాల్లో భాగంగా గంగారాంను 'దొంగ' అని కరపత్రాలు వేశారు. 'బందిపోటు' అని పత్రికల్లో రాశారు. పచ్చిరక్తం తాగే హంతకుడన్నారు. ఇంకా ఎన్నో కూశారు, రాశారు. కసిగా గావుకేకలు పెట్టారు. ఈ క్రమంలో కామ్రేడ్ షేడిశెట్టి శంకర్‌ను చంపారు. కామ్రేడ్ పద్మని చెరబట్టారు. ఊళ్ళని దోచారు. జనాన్నిహింసించారు. వాళ్ళ ప్రతాపమంతా చూపారు. గంగారాం గూర్చి ఒకరైనా చెప్పరే ?

వేటగాళ్ళలా రివాల్వర్లతో తుపాకులతో తిరిగారు. వాళ్ళంతా వాళ్ళ యిళ్ళలో పడుకోలేదు. జీపుల్లోనించి కాళ్ళని కింద పెట్టలేదు. మోటారుసైకిళ్ళమీంచి దిగలేదు. వాళ్ళ వకీలు తనబంగ్లా నుండి ఒంటరిగా కదల్లేదు.

ఇవంతా సరే, మరి గంగారాం ఏడి ? అతని చిరునామా ఏది ? !

చాలాసహజంగానే గంగారాం చిరునామా వారికి దొరకలేదు, దొరకదు. రేచపల్లి ప్రజలు అతన్ని గుండెల్లో దాచుకున్నారు. కుల మత ప్రసక్తి లేకుండా అన్ని కులాల స్త్రీ పురుషులూ, పెద్దలూ పిన్నలూ అందరూ రక్షించారు. కొండలు కోట గట్టి కాపాడాయి. చెట్లు నీడనిచ్చి సేదదీర్చాయి. బండలు అండనిచ్చాయి. కాలువలు గట్ల చేతుల్లో దాచుకున్నాయి. పశువులు ప్రాణసలిలాలిచ్చాయి.

ఇందరి కోసం తన ప్రాణాల్ని ముడుపుగట్టిన కైరి చిరునామా ఇందరిలో ఎక్కడ దొరుకుతుంది—అందునా శత్రువుకి !

నువు పోలీసువా —
నువు దొరవా —
నువు దొరగూండావా —
నువు వీళ్ళందరికీ ప్రతినిధివైన

హిందూ రజాకార్వా ?

అయితే నీకు

కైరి గంగారాం చిరునామా దొరకదు !

ఒకానొక ఉదయాన పత్రికలు తెల్లని మొహాలమీద నల్లని వార్తనొక దాన్ని మోసుకొచ్చాయి. నిర్బంధ చరిత్రలో అన్నిరోజులూ ఒక్కటే. ఆరోజుకి ప్రత్యేకత ఏమీలేదు. ఐనా గుర్తుకోసం దాన్ని 1985 ఫిబ్రవరి 21వ తేదీ అందాం.

'ప్రముఖ నక్సలైట్ గంగారాం కాల్చివేత' జరిగింది. ముగ్గురు పోలీసులు కాల్చారు. ఐతే ఎవరితూటాతో మరణించాడు తెలీదట. గుర్తింప లేక పోయారట. వార్త ప్రకటించటం వెనక ప్రాణభయం! చంపబడ్డవాడు దుష్టుడైతే, లోక కంటకుడైతే చంపినవాడు 'గర్వంగా' ప్రకటించుకోవలసిన సమయంలో ఆక్షణంలో తనను గూడా మృతుల జాబితాలో చేర్చుకోవటం వ్యవస్థాధర్మ రక్షక భటులకు తగునా?

ధైర్యమంటే అలావుండాలి. ఎవరు చంపారో పేపరు వాళ్ళకి తెలీకపోవచ్చు. వార్తని వివరించిన డి ఐ జి చెప్పకపోవచ్చు కానీ ఎవరి గుండు దెబ్బకు గంగారాం గుండెనించి ఎర్రనిరక్తం వ్యవస్థని ముంచెత్తే పెనుగంగ లా దూకిందో చరిత్రకి తెలుసు, చరిత్రని నిర్మిస్తున్న ప్రజలకి తెలుసు. ప్రజాన్యాయస్థానం బూర్జువా న్యాయస్థానాల్లా కళ్ళకు గంతలు కట్టుకొని ఉండదు. చరిత్ర తీర్పునించి దోషులు తప్పించుకోలేరు.

ప్రకటించిన వార్తలో నిజాలులేవు. అసలునిజం ఒక్కటే - గంగారాంని కాల్చి చంపారన్నది. దీనికి పోలీసులు తమపైత్యాన్ని జోడించి కథఅల్లారు. అన్నం పెట్టిన మహిళను ఉంపుడుగత్తె అనగలిగిన నిర్లజ్జ, క్షుద్రత్వం తార్పుడుగాళ్ళలో గూడా ఉండదు. హరిభూషన్ విషయంలోగూడా ఇలాంటి ప్రచారమే జరిగింది. అతణ్ని క్రూరుడన్నారు, రక్తంతాగే రాక్షసుడన్నారు. అలాంటివాడిని కాల్చి చంపిన 'దేవతలు' తమపేరు మాత్రం ఇంతవరకూ బయట పెట్టుకోలేదు.

కామాంధ నేరం తప్ప వావివరసలు లేనిభూస్వామ్య సంస్కృతిలో పుట్టి పెరిగిన దొరలు, వారి బంధుమిత్రులైన పోలీసులు అల్లిన ఈ కథని జనం నమ్ముతారా? నమ్మరు. 'పోలీసులకీ దొరలకీ సంబంధం నిజంగా ఉంటే నీకు ఉంటా?' అనే కుశంక మధ్యతరగతి మేధావులకి తప్ప మరెవరికీరాదు. ఎందుకంటే మధ్యతరగతివాళ్లు నిజాలు తప్ప అన్నీ ఒప్పుకోవడానికి భయపడరు.

కైరి గంగారాం అనేఒక 'వ్యక్తి మాత్రుడు' చంపబడ్డాడు. సరే, ఇది భౌతిక వాస్తవం. కాసేపు ఒప్పుకుందాం. ఐతేమరి ఆర్ ఎస్ ఎస్ వాళ్లు ఇంకా ఎందుకు గుంపులు గుంపులుగా తుపాకులతో తిరుగుతున్నారు? పలానాదొర బంగ్లానుండి మోసటం లేదెందుకు? వీళ్ళకి రెండువందల తుపాకులెందుకు?

కైరి ఒంటరివాడు కాదని అతనివాళ్ళకీ, శత్రువులకే తెలుసు. వ్యక్తి అని భ్రమించి హత్యచేసినా అతనొక శక్తి అనీ సామూహిక ఆచరణలోని భాగమని శత్రువు ప్రతీక్షణం స్పృహకలిగే ఉన్నాడు. అందుకే ఉన్న సాధనసంపత్తి చాలక ఇంకా రౌడీల్ని, తుపాకుల్ని పెంచుకుంటున్నాడు.

అయితే ఇది అంతిమ పోరుకు రిహార్సలే. కైరి చిరునామా వాళ్ళకింకా దొరకలేదు, దొరకదు. ఈ దోపిడీదారులు వినాశకాలంలోనే 'కైరి'ని చూడగలుగుతారు.

కైరి గంగారాంని వ్యక్తిగా చంపారు. కానీ కొందరు వ్యక్తులు శక్తికి ప్రతినిధులు. వాళ్ళని కొందరు వ్యక్తులు కాదు ఒకవ్యవస్థగూడా నిర్మూలించలేదు. స్పార్టకస్‌ను సిలువవేశారు. రోమన్ సామ్రాజ్యం నిలిచిందా? గెలీలియోని చంపేశారు. భూమి గుండ్రంగా ఉండకుండా పోయిందా? భగత్‌సింగ్‌ని ఉరితీశారు. బ్రిటిష్ సామ్రాజ్యమూ, భారతదళారీ బూర్జువా వర్గమూ నిర్భయంగా ఉన్నాయా?

ఒక జనార్దన్, ఒక ఆనందరావు, ఒక సుధాకర్, ఒక చిన్నాలు, ఒక హరిభూషణ్, ఒక దేవందర్, ఒక సుదర్శన్, ఒక సారంగపాణి. వీళ్ళని హత్యచేయగలిగిన వ్యవస్థ ఈనాడు కంటిమీద కునుకులేక రాత్రింబగళ్లు పిచ్చికుక్కల్లా కాపలా జీపుల్ని ఎందుకు ఉరికిస్తోంది?

ఎక్కడుంది రహస్యం? అది వ్యక్తుల్లోలేదు. వ్యవస్థీకృత శక్తుల్లోఉంది. ఏ శక్తి భగత్ సింగ్‌ని అమరవీరుడుగా చేసిందో ఆ శక్తే కైరి గంగారాంని సజీవంగా నిలుపుతోంది.

రేచపల్లి రైతాంగం, రేచపల్లి కొండలు, వీర్‌పూర్ రాజుల చెరువు ప్రాజెక్టు దొంతాపూర్ హరిజనులు, హర్వెల్లి రైతులు, సారంగాపూర్ అడవి, పోచంపాడు కెనాల్ కింద పచ్చగా పరుచుకున్న పొలాలు, మెట్‌పల్లి విద్యార్థులు, లంబాడీలు, పసుపుతోటలు, చెరుకు నరికిన గండ్రగొడ్డలి మొన పదును, ఆదిలాబాద్‌లో, దండకారణ్యంలో అల్లూరి సీతారామరాజు పోరాటం రగిలించిన మన్యంసీమలో, అఖిల భారత విప్లవ సాంస్కృతిక సమితి సభాంగణంలో, అఖిల భారత విప్లవ విద్యార్థి సమైక్య నిర్మాణ క్రియల్లో, అమరవీరుల ఆశల్లో, పీపుల్స్ వార్ పార్టీలో, మతోన్మాద ఫ్యూడల్ ఫాసిస్టుల్లో గుండెదడను పుట్టించిన వేడిలో, దొరల గుండెల్ని కుదిపిన ప్రజాయుద్ధపోరులో, చంద్రాపూర్ బస్తర్ అడవుల్లో శత్రువు తూటాకు గుండె పగిలి రక్తం బాకీ రగిల్చిపోయిన పెద్దిశంకర్ సహచరుల్లో....

....ఇన్నిచోట్ల వుంది కైరి గంగారాం చిరునామా. ఎక్కడని వెతుకుతాడు శత్రువు ?

గంగారాం వేటగాని దెబ్బకు కూలిన అసహాయమైన పక్షికాదు. రైతాంగం పిడికిలి బిగించిన రాజ్యాధికారాన్ని సవాలుచేసిన ప్రజాయుద్ధధ్వానం !

"సృజన" కు పంపించే రచనలు అనివార్య కారణాల వల్ల పోయే, పరిస్థితి వున్నందువల్ల రచయితలు తమ వద్ద తప్పక ఉంచుకోవలసిందిగా కోరుతున్నాం.

సా-వి

వెలువడింది ! రెండవ ముద్రణ !

"అమ్మ ఒడి యింకెంతమాత్రం
అశ్రుసిక్తం కావొద్దని..."

ఎన్. కె.

అందించిన ఆయుధ కవిత

లాల్ బనో గులామీ ఛోడో
బోలో వందేమాతరం

వెల : రూ. 2-00

ఆర్. ఎస్. యు. ప్రచురణ

ప్రతులకు - సృజన

చదవండి :

1. **Bhopal Genocide** Rs. 1.00
   J G K S Morcha
   260, Poorvanchal
   New Delhi - 110 067

2. **Bhopal** Rs. 3.00
   A people's view of death
   Their right to know and live

   EKALAVYA
   E 1/208 Arera Colony
   Bhopal.

SṚJANA Telugu Monthly May 1985 H/HNK.3

Regd. No with Registrar of Newspapers 10953/67

సృజనపై రాజద్రోహం కేసు :

పాఠకులే న్యాయనిర్ణేతలు

1974 మేలో దేశవ్యాపితంగా జరిగిన రైల్వే కార్మికుల సమ్మె సందర్భంలో "జైళ్ళు రైళ్ళను నడిపించగలవా?" అనే పేరుతో సృజన ఒక కవితను ప్రచురించింది. ఆ కవితను, ఆ సంచికని నిషేధించి ప్రభుత్వం సృజనపై రాజద్రోహ నేరాన్ని మోపింది. ప్రచురణకర్త, సంపాదకురాలు అయిన హేమలతను అరెస్టు చేశారు. 1977లో ఆ కేసులో సంపాదకులకి సెషన్స్‌కోర్టు రెండు సంవత్సరాల శిక్ష విధించింది. అయితే హైకోర్టు ఆ కేసును కొట్టి వేసింది. మళ్ళీ మరోసారి సృజనపై రాజద్రోహ నేరాన్ని మోపుతూ ఏప్రిల్ 18వ తేదీన ప్రెస్‌పై పోలీసులు దాడి చేసారు. ఆ రాత్రి హేమలతను అరెస్టు చేసారు.

హనుమకొండ పోలీసుల ప్రాథమిక నివేదిక (FIR) ప్రకారం ఈ కేసు (క్రైమ్ నంబర్ 101/85 హనుమకొండ పోలీసు స్టేషన్) భారతీయ శిక్షాస్మృతి 124-A కింద పి. హేమలత "మరియు ఇతరుల"పై దాఖలు అయింది. గత సంచిక (మార్చి/ఏప్రిల్ 85, 16/165) లో

1. సంపాదకీయంలో కొన్ని పేరాలు
2. మృత్యులోయ నా మాతృభూమి కాదు (నబరుణ్ భట్టాచార్య)కవితలో కొన్ని చరణాలు
3. ప్రజాస్వామ్యం (పి. చందు) కథలో కొన్ని భాగాలు
4. రాజమ్మ నుంచి సత్తెమ్మ దాకా (రత్నమాల) వ్యాసం
5. ఎ ఐ ఆర్ ఎస్ ఎఫ్ (చుక్కాని) వ్యాసం
6. 'రాజద్రోహం వర్ధిల్లాలి' (సాహితీ మిత్రులు)
7. ఎన్‌కౌంటర్ హత్యలు

రచనలన్నీ "అభ్యంతరకరమయిన పదజాలాన్ని వాడుతూ, ఎన్నికల విధానానికి, ప్రభుత్వానికి, పోలీసులకివ్యతిరేకంగా ద్వేషాన్ని, ధిక్కారాన్ని రెచ్చగొడ్తున్నాయ"ని ఆరోపణ. మర్నాడు, ఏప్రిల్ 19వ తేదీన సంపాదకులని బెయిలపై కోర్టు విడుదల చేసింది.

SṚJANA

Hanumakonda 506 001.

Single copy Rs. 4/-

Yearly Subscription Rs. 30/-